మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 16 సోమవారం | సెప్టెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 365
Navabhoomi daily fallows..




# నెక్ట్స్ ఢిల్లీ సీఎం!?

- వచ్చే ఫిబ్రవరిలో ఢిల్లీ రాష్ట్రానికి ఎన్నికలు
- రేపో..మాపో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ రాజీనామా
- ఎన్నికల దాకా ఢిల్లీ గద్దెపై ఎవరుంటారు?
- రేసులో ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా
- కేజ్రీవాల్ వారసురాలిగా అతిషి పేరు తెరపైకి

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** అరవింద్ కేజ్రీవాల్ మరో రెండు రోజుల్లో ఢిల్లీ సీఎం పదవికి రాజీనామా చేయబోతున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగుతాయి. అంటే ఆలోగా దాదాపు నాలుగు నెలల పాటు ఢిల్లీ సీఎంగా వ్యవహరించబోయేది ఎవరు ? అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఓ వైపు ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా జైలు నుంచి విడుదల కావడం.. మరోవైపు సీఎం పోస్టుకు అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేయడం రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. సిసోడియా జైలులో ఉండగా ఆయన గురించి కేజ్రీవాల్ చాలా బాగా మాట్లాడారు. బర్త్ డే విషెస్ చెబుతూ ట్వీట్స్ చేశారు. ఆయనను మిస్సవుతున్నా అంటూ ఎమోషనల్ కామెంట్స్ చేశారు. అలాంటి మనీశ్ సిసోడియా ఇప్పుడు బయటే ఉన్నారు. ఆయనకు సీఎం పోస్టును ఇచ్చేందుకు కేజ్రీవాల్ మొగ్గుచూపుతారా ?

## సీఎం పదవికి రాజీనామా



### అరవింద్ కేజ్రీవాల్ సంచలన ప్రకటన

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సెప్టెంబర్ 13న బెయిల్ పై తీహార్ జైలు నుంచి విడుదలైన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్.. తాజాగా సంచలన ప్రకటన చేశారు. ఈ కేసులో తనని తాను నిర్దోషిగా నిరూపించుకునేంతవరకూ సీఎం పదవిలో ఉండబోనని తెలిపారు. 2లో

## మరోసారి తెరపైకి

# జమిలి ఎన్నికలు!

- ఎన్డీఏ పాలనలోనే జమిలి ఎన్నికల నిర్వహణ
- విశ్వసనీయ వర్గాల ద్వారా వెల్లడి
- వివిధ రాజకీయ పార్టీల మద్దతు లభించే అవకాశం
- పంద్రాగస్టునాడు ఎర్రకోట ప్రసంగంలో ప్రధాని ప్రస్తావన
- రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్రం ఉన్నతస్థాయి
- కమిటీ సైతం జమిలి ఎన్నికలకే ఓటు



**ఢిల్లీ-నవభూమిబ్యూరో:** 'ఒక దేశం.. ఒకే ఎన్నిక' అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. ప్రస్తుత ఎన్డీయే పాలనలోనే జమిలి ఎన్నికల నిర్వహణ మొదలవుతుందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.
వివిధ రాజకీయ పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశాయి. మూడోసారి అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న మోదీ ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తికాలం పాలన కొనసాగిస్తుందని తెలిపాయి.
గత నెలలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై ప్రధాని మోదీ ప్రసంగిస్తూ జమిలి ఎన్నికల గురించి ప్రస్తావించారు. దేశ వ్యాప్తంగా ప్రతి ఏటా ఏవో ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయని, వీటి ప్రభావం దేశ పురోగతిపై పడుతుందోని ఆందోళన వ్యక్తం చేశారు. దీని నుంచి బయపడాలంటే ' జమిలి ఎన్నికలే' సరైన మార్గమని నొక్కి చెప్పారు. దీనికోసం అన్ని రాష్ట్రాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాజాగా మోదీ 3.0 ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న తరుణంలో.. జమిలి ఎన్నికల దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల భాజపా మేనిఫెస్టోలో 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' కూడా ఉంది.
దీనిపై అధ్యయనం చేసేందుకు ఎన్నికలకు ముందే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్రం ఉన్నతస్థాయి కమిటీని

# మా జోలికి వస్తే ఊరుకోం



2

- కౌశిక్‌రెడ్డి, అరెకపూడి గాంధీ ఎపిసోడ్‌పై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి
- సవాల్ విసిరింది వాళ్లే..ఇప్పుడేమో ఇంటిపైకి దాడికొచ్చారని ఆరోపణలు
- రుణమాఫీ చేస్తే పదవికి రాజీనామా చేస్తానన్న హరీశ్ ఎక్కడ దాక్కున్నారు
- టీపీసీసీ అధినేత మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ సందర్భంగా సీఎం

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, అరెకపూడి గాంధీ ఎపిసోడ్ తెలంగాణ రాజకీయాలను మరింత హీటెక్కించింది.. ఈ విషయంలో బీఆర్ఎస్.. కాంగ్రెస్ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి.పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డి వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలిసారి స్పందించారు. "మా వాళ్ల ఇంటికి వస్తామని కొందరు సవాల్ విసిరారు.. మా వాళ్లే వాళ్లింటికెళ్లి బుద్ధి చెప్పారు.. మా ఇళ్లపై దాడి చేశారని ఆరోపిస్తున్నారు.. అలాంటప్పుడు దమ్ముంటే రా అంటూ సవాల్ చేయడం ఎందుకు ?.. మా వాళ్లు ఎవరి జోలికి వెళ్లరు.. మా జోలికి వస్తే ఊరుకోం".. అంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం టి.పీసీసీ చీఫ్‌గా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గాంధీ భవన్ లో నిర్వహించిన సభకు సీఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, మంత్రులు, ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తే పదవికి రాజీనామా చేస్తానన్నా హరీశ్‌రావు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు సీఎం రేవంత్. రుణమాఫీ అయిన రైతుల వివరాలను ఆయనకు పంపిస్తామన్నారు. మహేష్‌కుమార్ గౌడ్ సౌమ్యుడు కాబట్టి.. ఊర్లలో తమ ఆటలు సాగుతాయని కొందరు అనుకోవచ్చు.. కానీ మహేష్‌కుమార్ గౌడ్ వెనుక తాను ఉన్నానంటూ పేర్కొన్నారు. ఎవరైనా తమ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమంటూ వార్నింగ్ ఇచ్చారు.
ప్రజలు విశ్వసించి కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కూడా.. వరుసగా రెండుసార్లు అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. రాహుల్ ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేశామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 48 గంటల్లో.. మొదటి రెండు గ్యారంటీలు అమలు చేశామనితెలిపారు. గత ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీని నీరుగార్చిందని.. రాజీవ్

# ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్

- పీఎస్సార్ ఆంజనేయులు,కాంతిరాణా,విశ్వాల్ గున్నిల సస్పెన్షన్
- ముగ్గురిపై ముంబయి నటి వ్యవహారంతోపాటు పలు అభియోగాలు
- ముంబయి నటి కాదంబరీ జత్వానిని అరెస్ట్ చేసి ఇబ్బందులకు
- గురిచేసిన వ్యవహారంలో కీలకపాత్రదారులుగా గుర్తింపు



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీలో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు విజయవాడ మాజీ సీపీ కాంతిరాణా తాతా ఐపీఎస్ అధికారి విశాల్ గున్నిని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ముగ్గురిపై ముంబయి నటి వ్యవహారంతోపాటు పలు అభియోగాలున్నాయి.
తప్పుడు కేసులో ముంబయి సినీ నటి కాదంబరీ జత్వానీని అరెస్టు చేసి, ఇబ్బందులకు గురిచేసిన వ్యవహారంలో కీలకపాత్రధారులని చెబుతున్న నాటి విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతి రాణా, డీసీపీ విశాల్ గున్ని చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఐపీఎస్ అధికారులపైనే తీవ్రస్థాయి ఆరోపణలు రావడంతో దీనిపై డీజీపీ ద్వారకా తిరుమలరావు విచారణకు ఆదేశించారు. ఆయన ఆదేశాలతో విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు.. ఇబ్రహీంపట్నం స్టేషన్‌లో కాదంబరీ జత్వానీ, ఆమె కుటుంబసభ్యులపై నమోదైన కేసు ఫైళ్లను పరిశీలించారు. కేసు నమోదు, దర్యాప్తులో అనేక లోసుగులు ఉన్నట్లు గుర్తించారు. వీటిపై నివేదికను రూపొందించి డీజీపీకి అందజేశారు.

# ఏపీలో మళ్లీ ఎన్నికలు..!

- మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ మొదలు
- ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలు పెట్టిన అధికారులు

2

**అమరావతి-నవభూమిబ్యూరో:** ఆంధ్రప్రదేశ్లో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ముందుగా ఓటర్ ల నమోదు ప్రక్రియ మొదలుపెట్టారు.
కృష్ణ - గుంటూరు ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం ... అలాగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికలకు ఓట్ల నమోదు ప్రారంభించారు. ఈ నెల 30వ తేదీ నుంచి నవంబర్ ఆరో తేదీ వరకు ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చు. గ్రాడ్యుయేట్ టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎప్పటికప్పుడు కొత్త ఓటర్ లిస్ట్ చేసుకుంటారు .. పాత ఓటర్ల లిస్టు పనిచేయదు .. కొత్తగా ఓటు హక్కుకు అర్హులైన వారితో పాటు గతంలో ఓటు హక్కు ఉన్నవారు కూడా మరల కొత్తగా ఓటు హక్కును నమోదు చేయించుకుని పొందాల్సి ఉంటుంది .. ఆన్లైన్లో కూడా ఓటు నమోదు చేసుకోవచ్చు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఎన్నికలు జరిగే నియోజకవర్గాల పరిధిలో నివసించే వారంతా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు గా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.
ఓటర్ నమోదుకు గ్రాడ్యుయేటెడ్ డిగ్రీ ప్రొవిజనల్ ఫోటో ... ఆధార్ ఓటర్ ఐడిని సమర్పించాల్సి ఉంది. టీచర్లు - గ్రాడ్యుయేట్లు తప్పనిసరిగా ఫారం 18 - 19 ద్వారా ఓటర్ గా నమోదు కావాలని అధికారుల

## సీఎం ఇంటి సమీపంలో

# బ్యాగ్ కలకలం

- అప్రమత్తమైన అధికారులు..
- బాంబు స్క్వాడ్‌తో బ్యాగ్ తనిఖీ

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం సమీపంలో బ్యాగ్ కలకలం సృష్టించింది. దీంతో అధికారులు అలర్ట్ అయ్యారు. వివరాలు.. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో అనుమానస్పద స్థితిలో ఓ బ్యాగ్ కనిపించడం కలకలం రేపింది.అయితే వెంటనే అప్రమత్తమైన ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ అధికారులు అనుమానాస్పద బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద బ్యాగ్‌ను అక్కడి నుంచి అధికారులు తరలించి తనిఖీ చేస్తున్నారు. బాంబు స్క్వాడ్ ఆ బ్యాగ్‌ను తనిఖీ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. అయితే ఆ బ్యాగ్‌లో ఏముందనేది తెలియాల్సి ఉంది.
ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇంటి వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర

# సమావేశానికి భట్టికి ఆహ్వానం



**హైదరాబాద్-నవభూమిబ్యూరో :** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అరుదైన గౌరవం లభించింది. నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానం అందింది. ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు..మెక్సికో దేశంలో న్యూవోలియోన్‌లోని మోంటెగ్రో నగరంలో జరగనున్న 19వ ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావాల్సిందిగా భట్టి విక్రమార్కకు నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందింది.ప్రగతి కోసం శాంతి అనే ప్రధాన అజెండాతో ఈ సమావేశాలు జరగనున్నాయి. నోబెల్ గ్రహీతలు, ప్రపంచ శాంతి న్యాయవాదుల సామూహిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఆహ్వానంలో పేర్కొన్నారు. ఒత్తిడితో కూడిన ప్రపంచ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ, వ్యూహాలను ఈ శిఖరాగ్ర సమావేశంలో రూపొందిస్తామని ఆహ్వాన పత్రికలో నిర్వాహకులు తెలిపారు.

## కోడలిపైనా..

# కర్కశం!



### చాట్రాయి 'అప్పులరెడ్డి' ఘాతుకం

- అక్క కూతురి కాపురంలో తీరని చిచ్చు
- దళితుల భుజంపై 'రెడ్డి'గారి అక్రమార్జన
- భార్యా, బిడ్డల నుంచీ తప్పని ఛీత్కారం
- అప్పులరెడ్డి నిర్వాకాలపై నవభూమి వరుస కథనాలు
- నవభూమి కథనాలపై ప్రభుత్వ నిఘావర్గాల దృష్టి

2

**అమరావతి సెప్టెంబర్ 15 నవభూమి స్టేట్ బ్యూరో చీఫ్:** 'అప్పులరెడ్డి' అరాచకపర్వంలో ఇది మరో దారుణం. బ్లాంక్ చెక్కులు, ప్రామిసరీ నోట్లు తీసుకుని, ఈత ఆకు పరిమాణంలో ప్రజలకు అప్పులు ఇచ్చి, తాటాకు వైశాల్యంలో వసూళ్లు చేస్తూ ప్రజాకంఠకునిగా మారిన అప్పులరెడ్డి ముఠా దందాలో పైశాచిక చేష్టలు కూడా తాజాగా ప్రాచుర్యంలోకి వస్తున్నాయి. రక్తం పంచుకు పుట్టిన సొంత అక్క కూతురు కాపురంలోనే చిచ్చు రేపి, మేన కోడలికి విడాకులు ఇప్పించిన ఘనతను అప్పులరెడ్డి మూట గట్టుకున్నాడు. ఉమ్మడి కృష్ణా జిల్లా, ప్రస్తుత ఏలూరు జిల్లా చాట్రాయి మండలం బూరుగుగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అప్పులరెడ్డిగా ప్రాచుర్యం పొందిన సంగతి తెలిసేందే. 'అప్పులరెడ్డి' ముఠా పాల్పడుతున్న అరాచకాలను నవభూమి ఇప్పటికే వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ వార్తా కథనాలపై కూటమి ప్రభుత్వ నిఘా వర్గాలు నివేదికను రూపొందించే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే అప్పులరెడ్డి ముఠా సాగిస్తున్న అరాచకాల్లో తాజాగా మరో అంశం వెలుగులోకి వచ్చింది. చట్టవ్యతిరేకంగా వడ్డీ వ్యాపారం చేస్తూ ప్రజల ఆస్తులను లిటిగేషన్ల ద్వారా కైవసం చేసుకుంటున్న చరిత్రను అప్పులరెడ్డి సంపాదించుకున్నాడు. ఇటువంటి చర్యల ద్వారా ప్రజాకంఠకునిగా మారిన అప్పులరెడ్డి చివరికి తన సొంత మేనకోడలి కాపురం కూలిపోవడానికి ప్రధాన కారకుడైనట్లు చాట్రాయి, విసన్నపేట మండలాల్లో అతని గురించి తెలిసినవారు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. చాట్రాయి మండలంలోని పలు గ్రామాల ప్రజల్లో వ్యాప్తి చెందిన కథనం ప్రకారం.. ప్రజల నుంచి బ్లాంకు చెక్కులు, ప్రామిసరీ నోట్లు తీసుకుని వంచిస్తున్న మేనమామ అప్పులరెడ్డి చర్యలను అతని కోడలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయంలో సొంత అక్క, బావ కూడా అప్పులరెడ్డి దందాను ప్రశ్నించారు. గౌరవంగా జీవిస్తూ, నలుగురి

# ట్రంప్ లక్ష్యంగా కాల్పులు

- అమెరికాలో కాల్పులు కలకలం.. డొనాల్డ్ ట్రంప్ సురక్షితం
- ఫ్లోరిడాలోని వెస్ట్‌పాం బీచ్‌లోని గోల్ఫ్ కోర్టులో ఘటన
- ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా ఓ వ్యక్తి తుపాకీతో సంచారం
- సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు గమనించి అతనిపై కాల్పులు



2

**ఫ్లోరిడా-నవభూమిబ్యూరో:** అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం చోటుచేసుకుంది. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సమీపంలో కాల్పులు జరిగాయి.
ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లోని తన గోల్ఫ్ కోర్టులో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తుపాకీతో సంచరించాడు. దీంతో ఆ వ్యక్తిపై సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పులు జరిపారు. అక్కడి కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనతో ట్రంప్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు సీక్రెట్ సర్వీస్ అధికారులు పేర్కొన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 | హైదరాబాద్
సోమవారం
16। సెప్టెంబర్। 2024



# ఖైరతాబాద్ ఐమాక్స్ మార్గంలో తొక్కిసలాట



**హైదరాబాద్-నవభూమి:** తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా గణేశ్ నిమజ్జనాల శోభాయాత్రలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇక భాగ్యనగరం హైదరాబాద్ మరింత జోరుగా నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నిమజ్జన పాయింట్ల వద్దకు విగ్రహాలను భక్తులు పెద్ద సంఖ్యలో తరలిస్తున్నాయి. కాగా ఖైరతాబాద్‌లోని భారీ గణనాథుడిని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఖైరతాబాద్ ఐమాక్స్ మార్గంలో తొక్కిసలాట వాతావరణం కనిపిస్తోంది. క్యూలైన్లలో భక్తులు ఊపిరాడక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. క్యూలైన్లలో వృద్ధులు సొమ్మసిల్లి పడిపోతున్నారు. ఇక బారికేడ్లు తొలగించడంతో భక్తులను అదుపు చేయడం పోలీసులకు ఇబ్బందికరంగా మారింది. ఈ అర్ధరాత్రి వరకే మహాగణపతి దర్శనానికి సమయం ఉండడంతో లక్షలాదిగా భక్తులు తరలి వస్తున్నారు. పరిస్థితి శృతిమించడంతో భక్తులెవరు ఖైరతాబాద్‌కు రావద్దు అంటూ ఉత్సవ సమితి విజ్ఞప్తి చేసింది.

# యశ్వంత్ సిన్హా కొత్త పార్టీ.. 'అటల్ విచార్ మంచ్'

**హజారీబాగ్-నవభూమి:** కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా కొత్తగా రాజకీయ పార్టీ స్థాపించారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ సిద్ధాంతాలకు అనుగుణంగా 'అటల్ విచార్ మంచ్' పేరుతో దీన్ని ప్రారంభించారు.

ఝార్ఖండ్‌లో హజారీబాగ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రారంభించిన ఆయన.. మరికొన్ని నెలల్లో జరగనున్న ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. ఝార్ఖండ్‌లో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల తన మద్దతుదారులతో భేటీ అయిన కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా.. కొత్త పార్టీ ఏర్పాటుపై మంతనాలు జరిపారు. ఇదే విషయంపై ఆదివారం తన మద్దతుదారులతో కలిసి పార్టీ పేరును అధికారకంగా ప్రకటించారు. ఐఏఎస్ అధికారి అయిన యశ్వంత్ సిన్హా.. 1977లో బిహార్ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకుర్‌కు ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేశారు. 1984లో రాజీనామా చేసిన ఆయన.. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. హజారీబాగ్ లోక్‌సభ స్థానం నుంచి 1988, 1999, 2009ల్లో గెలుపొందిన ఆయన.. వాజ్‌పేయీ హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. 2004 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి చేతిలో ఓటమిపాలయ్యారు. 2014లో ఆయన పెద్ద కుమారుడు జయంత్ సిన్హాను భాజపా ఇదే సీటు బరిలోకి దించగా.. ఆయన గెలుపొందారు. మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించే ఆయన.. 2021లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా కొత్త పార్టీ స్థాపించిన యశ్వంత్ సిన్హా.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు.

# జగిత్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

### బైక్స్‌ను ఢీ కొట్టిన ప్రైవేట్ బస్సు ఇద్దరి మృతి

**జగిత్యాల -నవభూమి:** జగిత్యాల(జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ ప్రైవేట్ బస్సు ద్విచక్రవాహనాలను ఢీ కొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన జగిత్యాల రూరల్ మండలం పోలస వద్ద చోటు చేసుకుంది. రెండు ద్విచక్రవాహనాలను బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు స్పాట్స్ లోనే మృతి చెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. పదేళ్ల బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి.

కాగా, టూ వీలర్ పై నుంచి బస్సు వెళ్లడంతో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా నుజ్జు నుజ్జు అయ్యాయి. బస్సు డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగా త్రులను జగిత్యాల జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# కరీంనగర్‌లో చర్మ వ్యాధి కలకలం.. విజృంభిస్తున్న సెల్యూలైటిస్..!



**హైదరాబాద్- నవభూమి:** కరీంనగర్ జిల్లాలో మరో వ్యాధి కలకలం రేపుతోంది. ఇప్పటికే మంకీపాక్స్ భయం కొనసాగుతుండగా.. ఇప్పుడు కొత్తగా ఓ చర్మ వ్యాధి భయపెడుతోంది. ప్రస్తుతం మంకీపాక్స్ అనే వైరస్ ప్రపంచ వ్యాప్తంగా విజృంభిస్తోంది. దీని కారణంగా మరణాలు కూడా భారీగానే సంభవిస్తున్నాయి. దాంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ అన్ని దేశాలను అప్రమత్తం చేసింది. ఇటీవల ఇండియాలోనూ ఒక మంకీ పాక్స్ కేసు నమోదు కావడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. అయితే ఇప్పుడు కరీంనగర్ జిల్లాలో ఓ కొత్త వ్యాధి ప్రజలను భయపెడుతోంది. ఈ వ్యాధి మొదట దురదతో మొదలై క్రమంగా గాయంగా మారుతున్నది. ఇప్పటికే అక్కడ వందల కేసులు నమోదయ్యాయి. ఈ సెల్యూలైటిస్ వ్యాధి సాధారణ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షనే. కానీ వ్యాధి తీవ్రతతో ప్రమాదకరంగా మారుతున్నది. ఈ చర్మ వ్యాధి ఎక్కువగా కాళ్లపై ప్రభావం చూపుతుంది. నిర్లక్ష్యం వహిస్తే శరీర భాగాలకు సోకే ప్రమాదం ఉంది. సెల్యూలైటిస్ వ్యాధి ఎక్కువగా వర్షాకాలంలో వస్తుంది. ఏటా పదుల సంఖ్యలో ఉండే ఈ వ్యాధి బాధితులు ఈసారి వందల్లో ఉన్నారు.

# వెల్లివిరిసిన మతసామరస్యం.. గణేష్ లడ్డు దక్కించుకున్న ముస్లిం సోదరుడు



**భద్రాద్రి కొత్తగూడెం -నవభూమి:** గంగా యమున తెహజీబ్‌కు ప్రతీక తెలంగాణ. వందల ఏండ్లుగా కులమతాలకు అతీతంగా ఈ గడ్డన శాంతి, సామరస్యంతో జీవిస్తూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారు. మతసామరస్యానికి పెట్టింది పేరు తెలంగాణ రాష్ట్రం. అందుకు ఎన్నో ఉదాహరణలు చరిత్ర పొడవునా కనిపిస్తాయి. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మతసామరస్యం వెల్లివిరిసింది.

భద్రాద్రి కొత్తగూడెంజిల్లా( అశ్వాపురం మండలం చవిటిగూడెంలో షేక్ అష్రఫ్ అనే ముస్లిం యువకుడు వేలంలో గణేశ్ లడ్డును దక్కించుకున్నాడు. అలాగే వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముతోజీ పేటలో గణపతి ఉత్సవాలకు మహ్మద్ రియాజ్ అనే ముస్లిం సోదరుడు 216 కిలోల భారీ లడ్డును అందించి భక్తి భావాన్ని చాటుకున్నాడు.

# దేశంలోనే తొలిసారిగా ఎల్‌బీనగర్ మెట్రోస్టేషన్‌లో ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం



**హైదరాబాద్-నవభూమి:** దేశంలోనే మొట్టమొదటి సారిగా హైదరాబాద్ మెట్రో స్టేషన్‌లలో ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావడం గర్వకారణమని గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. మిట్టా ఎక్స్‌లెన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్‌లో పాలీ హెల్త్ క్లినిక్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హాజరయ్యారు. ఎల్‌బీనగర్ వరకు మెట్రో రైల్లో ప్రయాణించిన ఆమె.. ఆ స్టేషన్‌లో లాంఛనంగా ఆరోగ్య సేవలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ... మెట్రో ప్రయాణికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కూడా ఈ వైద్య సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు. తొలిసారిగా హెల్త్ ఏటీఎం కూడా అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. రక్త పరీక్షలు, డయాగ్నస్టిక్ సౌకర్యం, మెడికల్ షాప్, వైద్య నిపుణులు, ఫిజియోథెరపీ, టెలీమెడిసిన్, డెంటల్ కేర్ ఇలా అన్నీ సౌకర్యాలు మెట్రో స్టేషన్‌లో ఉంటాయన్నారు. ఆధునిక కార్పొరేట్ స్థాయి వైద్యం మెట్రో స్టేషన్‌లలో అందుబాటులోకి రావడం దేశంలోనే రికార్డు అని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వివరించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... లక్షలాది మంది ప్రయాణించే మెట్రో ట్రైన్లలో ఎలాంటి అనారోగ్యానికి గురైనా వెంటనే ఎమర్జెన్సీ క్లినిక్స్ ఆయా మెట్రోస్టేషన్లలో అందుబాటులోకి తీసుకు రావడం గొప్ప విషయమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందు చూపు ఆదర్శనీయమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మిట్టా ఎక్స్ లెన్స్ చైర్మన్ డా. మిట్టా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్‌లో తొలి క్లినిక్ ప్రారంభించామని, త్వరలో మియాపూర్, రాయదుర్గం మెట్రో స్టేషన్లలో ఈ సేవలను అందుబాటులోకి తీసుకు రానున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వంద మెట్రో కేంద్రాల్లో ఆరోగ్య సేవలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన 'ఎనీమియా ముక్త భారత్' పిలుపులో భాగంగా తాము ఉచితంగా హిమోగ్లోబిన్ పరీక్షలు చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే విజన్ చెక్, ఆడియోమెట్రీ లాంటి 21 టెస్టులు ఉచితంగా చేయనున్నట్లు మిట్టా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మిట్టా ఎక్స్ లెన్స్ డైరెక్టర్లు డాక్టర్ నిఖిల్, సీనియర్ జర్నలిస్ట్ డా. మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# మహిళపై అత్యాచారం... రేపిస్టును ఎన్‌కౌంటర్ చేయాలంటూ



**ములుగు-నవభూమి:** దేశంలో ఏ మూలన చూసినా ప్రతిరోజూ మహిళలు, చిన్నారులపై అత్యా చారాలు, హత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్ని కఠిన శిక్షలు వేస్తున్నా నేరస్థుల్లో మాత్రం భయం పుట్టడం లేదు. ఒక ప్రాంతంలో అత్యాచారం జరిగిందంటూ పెద్దఎత్తున నిరసనలు జరిగిన మరుసటి రోజే మరో అత్యాచారం గురించి వినాల్సిన దుస్థితి నెలకొంది. కామాంధులకు కఠిన శిక్షలు పడుతున్నా చివరికి ఎన్‌కౌంటర్లు జరిగిన ఘటనలు కళ్లెదుటే కనిపిస్తున్నా నిందితుల్లో మాత్రం మార్పు కనిపించడం లేదు. తాజాగా అలాంటి ఘటనే ఒకటి ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ఓ గ్రామంలో వరస అత్యాచారాలు చేస్తూ హడలెత్తిస్తున్న కామాంధుడు శివకుమార్.. గత రాత్రి(శనివారం) మరో మహిళపై దారుణానికి ఒడిగట్టాడు. వృద్ధురాలని కూడా చూడకుండా ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెపై కన్నేశాడు. ఎవరూ లేని సమయం చూసి ఇంట్లో చొరబడి అత్యాచారం చేశాడు. గదిలోనే బంధించి రాత్రి మొత్తం అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఉదయం ఘటన గురించి తెలుసుకున్న గ్రామస్థులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు.

గ్రామస్థులంతా వెంకటాపూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. నిందితుడు శివకుమార్‌ను కఠినంగా శిక్షించాలని స్టేషన్ ఎదుట బైఠాయించి డిమాండ్ చేశారు. శివకుమార్ గతంలోనూ ఆరుగురు మహిళలపై అత్యాచారం చేశాడని గ్రామస్థులు ఆరోపించారు. ఇలాంటి కామాంధుణ్ని వదలకూడదని, వదిలితే మరిన్ని దారుణాలకు పాల్పడతాడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతణ్ని ఎన్‌కౌంటర్ చేయాలంటూ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి డిమాండ్ చేస్తున్నారు.

# నెక్స్ట్ ఢిల్లీ సీఎం!?

(1వపేజీ తరువాయి)లేదంటే తనకు నమ్మిన బంట్లుగా ఉన్న అతిషి వంటి వాళ్లకు సీఎం సీటును అప్పగిస్తారా ? అనేది రెండు రోజుల్లో తేలిపోతుంది.

ఒకవేళ మనీశ్ సిసోడియాకు ఆ అవకాశం దక్కకుంటే.. ఆప్‌లోని సమీకరణాలు మారే అవకాశం ఉంది. రాజకీయ భవిష్యత్తుకు సంబంధించి సిసోడియా పునరాలోచన చేసుకునే ఛాన్స్ లేకపోలేదు. అయితే ఇవాళ కేజ్రీవాల్ ఒక కీలక కామెంట్ చేసిన విషయాన్ని మనమంతా గుర్తుంచుకోవాలి. అదేమిటంటే.. "ప్రజలు మరోసారి ఆప్‌ను గెలిపించాకే నేను సీఎం, మనీశ్ సిసోడియా డిప్యూటీ సీఎం అవుతాం" అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఒకవేళ ఇప్పుడు తాను సీఎంగా కొనసాగితే.. మనీశ్ సిసోడియాకు డిప్యూటీ సీఎం పదవిని ఇవ్వాల్సి ఉంటుంది. డిప్యూటీ సీఎం పోస్టును సిసోడియాకు ఇవ్వకుంటే.. ఆయన వర్గీయుల నుంచి ఆప్‌లో అసమ్మతి పెరిగే ముప్పు ఉంటుంది. దాన్ని ముందే అంచనా వేసిన కేజ్రీవాల్.. తాను సీఎం పోస్టు నుంచి వైదొలగి తన అనుయాయుడిని ఆ సీటుపై కూర్చోబెట్టాలని భావిస్తున్నారు.

ఢిల్లీ సీఎం రేసులో వీరే.. ?

**అతిషి:** ఈమె ఆప్ సీనియర్ నాయకురాలు. కేజ్రీవాల్ జైలులో ఉన్న ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ఢిల్లీ క్యాబినెట్‌లోని ఐదు మంత్రిత్వ శాఖలు అతిషి వద్దే ఉన్నాయి. మహిళా శిశు సంక్షేమం, విద్య, పర్యాటకం, కళ, సంస్కృతి, భాష, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, పవర్ శాఖలకు ఆమె మంత్రిగా ఉన్నారు.

**కైలాష్ గహ్లోట్:** ఈయన వద్ద ప్రస్తుతం ఎనిమిది మంత్రిత్వ శాఖలు ఉన్నాయి. న్యాయ శాఖ, శాసన వ్యవహారాలు, రవాణా, పరిపాలనా సంస్కరణలు, ఐటీ, రెవెన్యూ, ఆర్థిక, ప్రణాళిక శాఖలు ఈయన వద్దే ఉన్నాయి.

**సౌరభ్ భరద్వాజ్:** ఈయన వద్ద ప్రస్తుతం ఏడు మంత్రిత్వ శాఖలు ఉన్నాయి. విజిలెన్స్, సేవలు, ఆరోగ్యం, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, నీటిపారుదల, వరద నియంత్రణ, నీటి సరఫరా శాఖలు ఈయన వద్దే ఉన్నాయి.

**గోపాల్ రాయ్:** ఈయన వద్ద కీలకమైన దేశ రాజధాని అభివృద్ధి, సాధారణ పరిపాలన శాఖ, పర్యావరణ శాఖ, అటవీ శాఖ, వన్యప్రాణుల శాఖ ఉన్నాయి.

**ఇమ్రాన్ హుస్సేన్:** ఈయన వద్ద ఢిల్లీలోని ఆహార, పౌర సరఫరాల శాఖ ఉంది

## మరోసారి తెరపైకి జమిలి ఎన్నికలు!

(1వపేజీ తరువాయి)ఏర్పాటు చేసింది. ఈ కమిటీ దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించాలని ఏకగ్రీవంగా తమ అభిప్రాయాన్ని వెల్లడించింది. జమిలి ఎన్నికలకు రెండంచెల విధానాన్ని సూచించింది. తొలుత, లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో పోలింగ్ నిర్వహించాలని పేర్కొంది. ఆ తర్వాత 100 రోజులకు మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఎన్నికలు జరపాలని నివేదికలో తెలిపింది. ఇందుకోసం రాజ్యాంగంలో కనీసం ఐదు ఆర్టికల్స్‌ను సవరించాలని కమిటీ సూచించింది. మూడు స్థాయిల ఎన్నికలకు ఉమ్మడిగా ఓటర్ల జాబితా ఉండాలని తెలిపింది.

# కోడలిపైనా..కర్కశం!

(1వపేజీ తరువాయి) క్షేమాన్ని కోరే సామాజికవర్గానికి చెడ్డపేరు తీసుకురావద్దని కూడా బంధుగణం హెచ్చరించిందట. తన కుటుంబానికే చెందిన సొంత మేనకోడలు నుంచే తొలుత ఇటువంటి వ్యతిరేకత ప్రారంభం కావడాన్ని అప్పులరెడ్డి జీర్ణించుకోలేకపోయాడట. దీంతో భారీ కుట్రకు తెర లేపినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే తన ముఠాలో కాంబాబు గా పేరు గాంచిన ఓ వ్యక్తిని అప్పులరెడ్డి ఉపయోగించుకున్నాడట. అవసరం లేకపోయినా, పలుసార్లు తన కోడలి ఇంటికి అప్పులరెడ్డి, కాంబాబు ను పంపాడట. సూపర్ స్టార్ క్రిష్ణ నటించిన 'నెంబర్ వన్' సినిమాలోని సీన్ ను ప్రేరణగా తీసుకుని కాంబాబు ను అప్పులరెడ్డి తన మేన కోడలి ఇంటికి పంపేవాడట. ఇలా పలుసార్లు అప్పులరెడ్డి కోడలి ఇంటికి కాంబాబు ను పంపించి ఇతనితో ఆమెకు వివాహేతర సంబంధం ఉన్నట్లు కట్టుకథను అల్లి ఆమె కాపురం కూలిపోవడానికి కారకుడైనట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. సొంత మేనమామ పన్నిన దారుణ కుతంత్రం వల్ల భర్తకు, తనకు మధ్య తీవ్ర అగాధం ఏర్పడి, చివరికి విడాకులకు దారి తీసిందని బూరుగుగూడెం, పరిసర గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ అనూహ్య పరిణామం తర్వాత అప్పులరెడ్డి కర్కశానికి బలైన అతని మేనకోడలు విదేశాలకు వెళ్లి ఉద్యోగం చేసుకుంటున్నట్లు ప్రజలు చెప్పుకుంటున్నారు. అప్పులిచ్చి మహిళలను వేధించినట్లు ఆరోపణలు గల అప్పులరెడ్డి అరాచక చరిత్రలో ఇది దారుణ ఘటనగా చాట్రాయి మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

**'ఛీ'కొట్టిన భార్యా, బిడ్డలు:**

చాట్రాయి మండలంలో ప్రజాకంతకునిగా మారిన అప్పులరెడ్డి చివరికి భార్యా, బిడ్డల చేతుల్లోనూ ఛీత్కారానికి గురైనట్లు ప్రచారం జరుగుతోంది. స్థానికంగా ప్రజల్లో తమ కుటుంబానికి భారీగా వ్యతిరేకత రావడం, అప్పులరెడ్డి చర్యల వల్ల ప్రజానీకం చులకనగా చూస్తుండడంతో అతని భార్య, బిడ్డలు దూరమైనట్లు తెలుస్తోంది. దీంతో స్థానికంగా ఉండలేక హైదరాబాద్ కు మకాం మార్చినట్లు ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల్లో అప్పులరెడ్డి బూరుగుగూడెంలో ఒంటరి జీవనం గడుపుతున్నట్లు తెలుస్తోంది.

**దళితుల భుజంపై అప్పులరెడ్డి అక్రమార్జన:**

తన అక్రమ వడ్డీ దందాలో అప్పులరెడ్డి దళితుల భుజాలపై అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు అనేక ఘటనలు చెబుతున్నాయి. చాట్రాయి, విసన్నపేట ప్రాంతాలకు చెందిన కొందరు పేద దళితులను చేరదీసి, వారికి చిన్నచిన్న అవసరాలు తీరుస్తూ మచ్చిక చేసుకుంటున్నారు. ఆ తర్వాత తన ప్రణాళికను అమలు చేస్తున్నారు. అక్రమ వడ్డీ వ్యాపార దందా నిర్వహణకు దళితులను అస్త్రంగా ఉపయోగించుకుంటున్నారు. తన ఇంట్లో పని చేసే పని మనుషుల చేత కూడా ప్రజలపై కేసులు దాఖలు చేయిస్తున్నారు. ఇంట్లో పాచి పనులు చేసే తన పని మనుషులు లక్షలాది రూపాయలు అప్పులు ఇచ్చినట్లు అప్పులరెడ్డి సామాన్యులపై కేసులు దాఖలు చేయిస్తుండడం ఇందుకు నిదర్శనం. తద్వారా దళితులను ఉసిగొల్పి ఇప్పటికే దాదాపు వంద ఎకరాలకు పైగా భూములను అప్పులరెడ్డి ప్రజల నుంచి అక్రమంగా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దళితులను ముందుంచి అప్పులరెడ్డి సాగిస్తున్న అరాచకాలపై ఎమ్మార్పీఎస్ నాయకులు దృష్టి సారించాల్సిన అవసరముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# మా జోలికి వస్తే ఊరుకోం

(1వపేజీ తరువాయి) ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచామని గుర్తుచేశారు. ఆడబిడ్డలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేశామని, రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు జమ చేశామని తెలిపారు. ముచ్చెర్లలో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపడతామని.. ప్రపంచానికి ఆదర్శంగా అధునాతన నగరం నిర్మిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. రీజనల్ రింగ్‌రోడ్‌తో తెలంగాణ స్వరూపం మారుతుందన్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలు సెమీఫైనల్స్.. 2029 ఫైనల్స్‌లో మనం ఘనవిజయం సాధించాలి.. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేసినప్పుడే ఫైనల్స్‌లో విజయం సాధించినట్టు.. అంటూ పేర్కొన్నారు. రాబోయే పదేళ్లపాటు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు సీఎం రేవంత్. 1994 నుంచి కొనసాగుతున్న పొలిటికల్ ట్రెండ్ గురించి వివరించారు.

మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గాంధీభవన్ దేవాలయంతో సమానమని.. కార్యకర్తలు దేవుళ్లతో సమానమని పేర్కొన్నారు. తన మార్గదర్శకుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఎక్కువ.. విమర్శించుకుంటాం.. అవసరం వస్తే కలిసి పనిచేస్తామంటూ పేర్కొన్నారు.

## ట్రంప్ లక్ష్యంగా కాల్పులు

(1వపేజీ తరువాయి)ట్రంప్‌నకు గోల్ఫ్ ఆడే అలవాటు ఉంది. అప్పుడప్పుడు ఉదయం నుంచి మధ్యాహ్న భోజనానికి ముందు వరకు వెస్ట్ పామ్ బీచ్‌లోని తన గోల్ఫ్ కోర్టులో గడుపుతారు. ఎన్నికల ప్రచారం ముగించుకొని ఫ్లోరిడా చేరుకున్న ఆయన.. ఆదివారం గోల్ఫ్ ఆడుతుండగా గోల్ఫ్ క్లబ్ వద్ద ఓ వ్యక్తి ఆయుధంతో సంచరించాడు. ఆ సమయంలో గోల్ఫ్ కోర్టును పాక్షికంగా మూసివేసి ఉంచారు. అనుమానితుడు కోర్టు కంచెలోకి ఆయుధాన్ని ఉంచడాన్ని గమనించి ఏజెంట్లు కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. దీంతో సదరు వ్యక్తి ఓ ఎస్‌యూవీలో పారిపోయాడని, పోలీసులు వెంబడించి అతడిని పట్టుకున్నట్లు చెప్పారు. ఘటన ప్రాంతంలో ఏకే 47 మోడల్ వంటి తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. అయితే ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకొని ఈ కాల్పుల జరిగాయా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీక్రెట్ సర్వీస్ అధికారులు పేర్కొన్నారు.

**గోల్ఫ్ క్లబ్ వద్ద మోహరించిన పోలీసు వాహనాలు**

ఈ ఘటనపై డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ స్పందించారు. ట్రంప్ క్షేమంగా ఉన్నట్లు తమకు సమాచారం అందిందని, అమెరికాలో హింసకు తావులేదని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి అధ్యక్షుడు బైడెన్‌కు అధికారుల సమాచారం అందించారు. రిపబ్లికన్ పార్టీ సభ్యుడు, సౌత్ కరోలినా సెనేటర్ లిండ్సే గ్రాహమ్ కాల్పులు ఘటనపై ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. తాను ట్రంప్‌తో మాట్లాడానని, తను క్షేమంగానే ఉన్నాడన్నారు. తాను చూసిన వక్తుల్లో ఆయన చాలా బలవంతుడన్నారు.

గత జులైలో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి అయిన ట్రంప్ పెన్సిల్వేనియాలోని బట్లర్ పట్టణంలో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తుండగా థామస్ మాథ్యూ క్రూక్స్ అనే యువకుడు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ కాల్పుల్లో ట్రంప్ కుడి చెవి పైభాగం నుంచి తూటా దూసుకువెళ్లింది. వెంట్రుకవాసిలో ఆయన మృత్యువును తప్పించుకున్నారు. ఈ ఘటనపై ప్రపంచమంతా ఒక్కసారిగా షాక్‌కు గురైంది. తాజాగా ట్రంప్‌నకు సమీపంలో మళ్లీ కాల్పుల ఘటన చోటుచేసుకోవడంతో ఒక్కసారిగా కలకలం రేగింది.

## ఏపీలో మళ్లీ ఎన్నికలు..!

(1వపేజీ తరువాయి)కోరుతున్నారు. గతంలో మూడు గ్రాడ్యుయేట్ ఎన్నికలలో టిడిపి ఘనవిజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్లో ఈ యేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఘనవిజయం సాధించి భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. అనంతరం జరిగిన విశాఖ స్థానిక సంస్థల ఉప ఎన్నికలలో మాత్రం వైసీపీకి భారీ మెజార్టీ ఉండడంతో కూటమి నుంచి ఎవరు ? పోటీ చేయలేదు. దీంతో వైసిపి నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా విజయం సాధించారు. ఇది ఇలా ఉంటే వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఈ మూడు ఎమ్మెల్సీ ఎన్నికలలో విజయం సాధించేందుకు ఎవరికి వారు రకరకాల ఎత్తులు వేస్తున్నారు.

## సీఎం పదవికి రాజీనామా

(1వపేజీ తరువాయి)రెండ్రోజుల్లో తాను సీఎం పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించడంతో.. ఒక్కసారిగా ఢిల్లీ రాజకీయం మారింది. ఆదివారం ఢిల్లిలో ఉన్న ఆప్ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ.. ఈ ప్రకటన చేశారు.

సీఎం పదవికి తాను రాజీనామా చేశాక.. నవంబర్ లో మహారాష్ట్రతో పాటు.. ఢిల్లీలో కూడా మళ్లీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. తనపై వచ్చిన ఆరోపణలు అబద్ధమని నిరూపించుకునేందుకు అగ్నిపరీక్షకు సైతం సిద్ధంగా ఉన్నట్లు కేజ్రీవాల్ పేర్కొన్నారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించినపుడు తన భవిష్యత్ ఏంటో ఓటర్లే నిర్ణయిస్తారని చెప్పారు. మళ్లీ ప్రజల మధ్యలోకి వెళ్తానని, ప్రతి వీధికి, ప్రతి ఇంటికి తిరుగుతానని, తాను నిర్దోషిని అనుకుంటే ప్రజలు ఓట్లు వేస్తారన్నారు.


**'ముఖ్యమంత్రి ఆఫీసులో అడుగుపెట్టకూడదు'.. కేజ్రీవాల్ బెయిల్‌కు సుప్రీం షరతులివే!**

ఆమ్ ఆద్మీ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఆ దేవుడే తమను ముందుకు నడిపించాడన్నారు. దైవమిచ్చిన ధైర్యంతోనే శత్రువులతో పోరాడుతామని తెలిపారు. ప్రస్తుతం జైల్లో ఉన్న ఆప్ నేతలు సత్యేందర్ జైన్, అమానతుల్లా ఖాన్ త్వరలోనే బయటకు వస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. ఆరునెలల తర్వాత జైలు నుంచి విడుదలైన కేజ్రీవాల్.. తాజాగా రాజీనామాపై ప్రకటన చేయడం హాట్ టాపిక్ గా మారింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ ఇచ్చిన 9 సమన్లకు కేజ్రీవాల్ స్పందించకపోవడంతో.. ఈ ఏడాది మార్చి 21న అరెస్టయ్యారు. ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు మధ్యంతర బెయిల్ పొందిన ఆయన.. జూన్ 2న తీహార్ జైలులో లొంగిపోయారు. అనంతరం ఆరోగ్య సమస్యల దృష్ట్యా మరోసారి బెయిల్ పొందారు. రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేసినా.. ఢిల్లీ హైకోర్టు దానిపై స్టే విధించింది. ఆ తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లగా.. వాయిదాలపై వాయిదాలు పడి.. సెప్టెంబర్ 13న బెయిల్ మంజూరైంది.

## నిమజ్జన ర్యాలీలో అపశృతి.. 30 మందికి గాయాలు

**మనుబోలు-నవభూమి:** నెల్లూరు జిల్లా మనుబోలు బీసీ కాలనీలో ఆదివారం రాత్రి నిర్వహించిన గణేష్ నిమజ్జన ర్యాలీలో అపశృతి చోటుచేసుకుంది. వినాయకుని నిమజ్జనోత్సవంలో బాణసంచా పేలడంతో 30మందికి పైగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. మనుబోలు బీసీ కాలనీలోని వరసిద్ధి వినాయకుని ఆలయం వద్ద చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి నిమజ్జనోత్సవం చేసేందుకు సిద్ధమయ్యారు. భారీగా బాణసంచా తీసుకొచ్చి మండపం సమీపంలోని ఓ ఇంటి వరండాలో, ప్రహరీ పక్కన నిల్వ ఉంచారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ సోమవారం 16, సెప్టెంబర్, 2024



## దారుణం.. మంత్రాల నెపంతో ఒకే కుటుంబానికి చెందిన



**న్యూఢిల్లీ- నవభూమి:** ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో ఆదివారం దారుణ ఘటన చోటు చేసుకున్నది. చేతబడి చేస్తున్నారన్న అనుమానంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని గ్రామస్తులు కర్రలతో కొట్టి చంపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. ఈ ఘటన మురలీగూడ సమీపంలోని ఇట్కల్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఓ కుటుంబం చేతబడి చేస్తున్నట్లుగా అనుమానించిన గ్రామస్తులు.. ఒక్కసారిగా ఆగ్రహించి దారుణానికి పాల్పడ్డారు. హత్య కేసులో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఓ కుటుంబ చేతబడి చేయడంతో తమ కుటుంబ సభ్యుడు ఒకరు అనారోగ్యానికి గురయ్యారని ఓ కుటుంబం గ్రామస్తులతో కలిసి కుటుంబంపై దారుణం దాడి చేసింది. కర్రలతో దాడికి పాల్పడడంతో ఐదుగురు మృతి చెందారు. ఘటనను జిల్లా ఎస్పీ చౌహాన్ కిరణ్ గంగారాం ధ్రువీకరించారు. గ్రామస్తులు చేతబడి చేస్తున్నారనే అనుమానం ఉందని.. వారిని హత్య చేసేందుకు గ్రామస్తులు సైతం ఏకమయ్యారని తెలిపారు.

అయితే, బాధిత కుటుంబం కొంతకాలంగా గ్రామస్తుల నుంచి అవమానాలతో పాటు ఇబ్బందులు సైతం ఎదుర్కొంటున్నట్లుగా ప్రాథమికంగా తెలిసిందన్నారు. గ్రామంలో పలువురు అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడం.. ఈ అనర్థాలకు బాధిత కుటుంబమే కారణంగా పేర్కొంటూ టార్గెట్ చేసినట్లు తెలుస్తున్నది. హత్యకు కారణమైన పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతులను మౌసం కన్న, మౌసం బుచ్చా, మౌసం బిరీ, కర్క లచ్చి, మౌసం అర్జోగా గురించారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ సైతం సందర్శించారు. నిందితులతో పాటు స్థానికులను పోలీసులు విచారిస్తున్నారు.

## కేజ్రీవాల్ రాజీనామా నిర్ణయం ప్రచార ఎత్తుగడే..! : బీజేపీ, కాంగ్రెస్ ఫైర్




**న్యూఢిల్లీ- నవభూమి:** ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో అరెస్ట్ అయి బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేశారు. తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ఆరు నెలల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చిన కేజ్రీవాల్ ఆదివారం పార్టీ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయబోతున్నట్లు ప్రకటించారు. తాను నిజాయితీపరుడినని ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చేవరకూ సీఎం పగ్గాలు చేపట్టబోనని చెప్పారు. ఇక కేజ్రీవాల్ ప్రకటన పబ్లిసిటీ స్టంట్, ఎన్నికల ఎత్తుగడ మాత్రమేనని కాంగ్రెస్, బీజేపీలు తప్పుపట్టాయి.

ఢిల్లీ సీఎం పదవికి రాజీనామా చేస్తానని కేజ్రీవాల్ చేసిన ప్రకటన పబ్లిసిటీ స్టంట్ మాత్రమేనని, తన ఇమేజ్‌ను కాపాడుకునే ప్రయత్నంలో భాగమేనని బీజేపీ జాతీయ ప్రతినిధి ప్రదీప్ భండారి అన్నారు. ఢిల్లీ వాసుల్లో కేజ్రీవాల్ అవినీతిపరుడనే ముద్ర పడుతోందని గ్రహించినందునే దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించారు. ఇక కేజ్రీవాల్ సీఎం పదవి నుంచి తప్పుకోవడం త్యాగమేమీ కాదని, సీఎం కార్యాలయంలోకి తిరిగి ప్రవేశం, ఫైళ్లపై సంతకాలు చేయరాదని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని బీజేపీ నేత మణిందర్ సింగ్ సిర్సా పేర్కొన్నారు. తదుపరి సీఎంగా తన భార్య సునీతా కేజ్రీవాల్‌ను ఎన్నుకోవాలని ఎమ్మెల్యేలను ఒప్పించేందుకే సీఎం రెండు రోజుల గడవుతు తీసుకున్నారని స్పష్టం చేశారు.ఇక సీఎం నిర్ణయం కేవలం ప్రచార ఎత్తుగడని కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ అభివర్ణించారు. ఆయన ఎప్పుడో రాజీనామా చేయాల్సి ఉందని వ్యాఖ్యానించారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత సీఎంఓకు తిరిగివచ్చి ఫైళ్లపై సంతకాలు చేయరాదని ఓ సీఎంను సుప్రీంకోర్టు కోరడం ఇదే తొలిసారని గుర్తుచేశారు. ఆధారాలను మాయం చేసే అవకాశం ఉందనే కోర్టు ఆందోళన ఈ ఉత్తర్వుల్లో కనిపిస్తోందని అన్నారు. కేజ్రీవాల్‌ను సుప్రీంకోర్టు నేరస్తుడిగా పరిగణిస్తున్నదని ఆరోపించారు. లిక్కర్ పాలసీ కేసులో జైలులో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు ఈనెల 13న షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

## హరియాణ సీఎం రేసులో ఉన్నా: అనిల్ విజ్



**న్యూఢిల్లీ- నవభూమి:** సీనియర్ బీజేపీ నేత, మాజీ మంత్రి అనిల్ విజ్ హరియాణ సీఎం పీఠంపై కన్నేశారు. తాను పార్టీలో సీనియర్‌నని, రానున్న హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తే తాను సీఎం రేసులో ఉంటానని ఆయన స్పష్టం చేశారు. హరియాణ ప్రస్తుత సీఎం నయబ్ సింగ్ సైనీ పార్టీ సీఎం అభ్యర్థిగా బీజేపీ ఇప్పటికే ప్రకటించిన క్రమంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అనిల్ విజ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.అనిల్ విజ్ ఆదివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తానిప్పటి వరకూ పార్టీ నుంచి ఏమీ కోరలేదని, కానీ ఇప్పుడు తన సీనియరిటీ ప్రకారం సీఎం పదవిని తాను కోరుతున్నానని చెప్పారు. హరియాణ ప్రజలు తనను కలిసేందుకు వస్తున్నారని, తన నియోజకవర్గమైన అంబాలా ప్రజలు సైతం సీనియర్ నేత అయిన మీరు అత్యున్నత పదవి చేపట్టాలని కోరుతున్నారని తెలిపారు. ప్రజల కోరిక మేరకు, తన సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని సీఎం పదవికి తనను పరిశీలించాలని ఈసారి తాను కోరతానని చెప్పారు.పార్టీ నాయకత్వం తనకు హరియాణ సీఎం పదవి అప్పగిస్తే హరియాణ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేస్తానని తెలిపారు. కాగా మనోహర్ లాల్ ఖట్టర్ రాజీనామా అనంతరం నయాబ్ సింగ్ సైనీ ప్రభుత్వం ఇటీవల కొలువుతీరిన క్రమంలో అనిల్ విజ్‌కు సైనీ క్యాబినెట్‌లో స్థానం దక్కని సంగతి తెలిసిందే. ఇక అనిల్ విజ్‌ను అంబాలా కంటోన్మెంట్ నుంచి బీజేపీ బరిలో దింపగా పార్టీ సీనియర్ నేతల సమక్షంలో ఈనెల 11న ఆయన నామినేషన్ దాఖలు చేశారు.


## అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా పీఆర్ స్టంటే.. బీజేపీ విమర్శలు



**న్యూఢిల్లీ- నవభూమి:** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బెయిల్‌పై విడుదలైన సీఎం అరవింద్ కేజ్రీవాల్ తన పదవికి రెండురోజుల్లో రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ఆయన రాజీనామా ప్రకటనతో ఢిల్లీ రాజకీయాలు వేడెక్కాయి. ఆయన రాజీనామా ప్రకటన కేవలం పీఆర్ స్టంట్‌గా బీజేపీ అభివర్ణించింది. కోర్టు విధించిన షరతుల కారణంగానే ఆయన పదవికి రాజీనామా చేయాల్సి వస్తోందని బీజేపీ విమర్శించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి మాట్లాడుతూ 'ఇది అరవింద్ కేజ్రీవాల్ పీఆర్ స్టంట్. ఆమ్ ఆద్మీ పార్టీ అవినీతి పార్టీగా పేరుపొందింది. పీఆర్ స్టంట్‌తో మళ్లీ ఇమేజ్‌ను పెంచుకోవాలని భావిస్తున్నారు. మన్మోహన్ సింగ్‌ను డమ్మీ ప్రధానిని చేసి తెరవెనుక ప్రభుత్వాన్ని నడిపిన సోనియా నమూనానే అమలు చేయాలనుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓడిపోతుంది. ఢిల్లీ ప్రజలు తన పేరుపై ఓట్లు వేయరని.. అందుకే వేరొకరిని బలిపశువును చేయాలనుకుంటున్నారు' అంటూ విమర్శించారు. మరో నేత మంజీందర్ సింగ్ సిర్సా మాట్లాడుతూ రెండురోజుల తర్వాత రాజీనామా చేస్తానని.. ప్రజా నిర్ణయంతోనే మళ్లీ సీఎం అవుతానని ప్రకటించారన్నారు. ఇది త్యాగం కాదని.. సీఎం కూర్చిపై వెళ్లలేరని.. ఏ ఫైల్‌పైనా సంతకం చేయొద్దని సుప్రీం ఉత్తర్వుల్లో ఉందని.. ఆయనకు మరో అవకాశం లేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాజీనామా చేయాల్సి వస్తుందన్నారు. భార్యను ఢిల్లీ సీఎం చేసేందుకు ఎమ్మెల్యేలందరినీ ఒప్పించేందుకు కేజ్రీవాల్ రెండు రోజుల సమయం తీసుకుంటున్నారని విమర్శించారు.

# బండికి నంబరు ప్లేట్ లేకుంటే మోసం కేసేంటి?




**న్యూఢిల్లీ- నవభూమి:** కొట్టేసిన టీహైకోర్టు చార్మినార్ పోలీసులు నమోదు చేసిన ఒక కేసుకు సంబంధించిన విచారణలో తెలంగాణ హైకోర్టు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. చార్మినార్ పోలీసులు నమోదు చేసిన ఒక కేసుకు సంబంధించిన విచారణలో తెలంగాణ హైకోర్టు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. చేసిన తప్పునకు.. సంబంధం లేని సెక్షన్ కింద కేసు పెట్టిన వైనాన్ని తప్పు పట్టింది. అంతేకాదు.. దీనిపై పోలీసులు పెట్టిన కేసును కొట్టేస్తూ నిర్ణయాన్ని ప్రకటించింది. వాహనానికి నంబరు ప్లేట్ లేకుండా వాహనాన్ని నడుపుతున్న వైనంపై హైదరాబాద్ మహానగర పోలీసులు నమోదు చేసిన 'మోసం' కేసుపై ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. వాహనాలకు పర్మిట్లు జారీ విధానానికి సంబంధించిన సెక్షన్ కింద కేసు నమోదు చేయటాన్ని తప్పు పట్టింది. అసలేం జరిగిందన్న విషయంలోకి వెళితే.. పోలీసులు వాహనాల తనిఖీల సందర్భంగా వాహనానికి నంబరు ప్లేట్ లేదన్న కారణంగా వాహనాన్ని సీజ్ చేసి పోలీసు స్టేషన్ కు తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా అప్పట్లో ఐపీసీ సెక్షన్ 420, సెక్షన్ 80(ఏ) కింద కేసు నమోదు చేశారు. వాహనానికి నంబరు ప్లేట్ లేకపోవటం మోసం ఎందుకు అవుతుందన్న ప్రాథమిక ప్రశ్నను లేవనెత్తిన పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనతో తెలంగాణ హైకోర్టు ఏకీభవించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఆకాశ్ బాగ్లేకర్ వాదనలు వినిపించారు.

పోలీసులు నమోదు చేసిన సెక్షన్ల కింద పిటిషనర్ నేరానికి పాల్పడలేదని పేర్కొన్నారు. చార్మినార్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని హైకోర్టును కోరారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలను ఏకీభవిస్తూ వాహనానికి నంబరు ప్లేట్ లేకపోవటం మోసం కేసు పరిధిలోకి రాదన్నారు. వాహనాల జారీకి సంబంధించిన సెక్షన్లపై పెట్టిన కేసు చెల్లదంటూ కేసును కొట్టేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

### ఇంజినీర్ రషీద్ విడుదల అందుకే..

## మోదీ సర్కారుపై ఫరూక్ అబ్దుల్లా ఫైర్



**న్యూఢిల్లీ- నవభూమి:** జమ్ముకశ్మీర్‌లోని బారాముల్లా ఎంపీ ఇంజినీర్ రషీద్ జైలు నుంచి విడుదల కావడంపై నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ చీఫ్, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా స్పందించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రషీద్‌ను విడుదల చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని ముస్లింలను విడగొట్టేందుకే అసెంబ్లీ ఎన్నికల ముందు రషీద్‌ను జైలు నుంచి విడుదల చేశారని ఆరోపించారు.ఒకప్పుడు పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినదించిన వాళ్లే ప్రస్తుతం బీజేపీతో జత కట్టారని మండిపడ్డారు. గతంలో అంటే 1987లో జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అక్కడ చోటుచేసుకున్న పరిణామాలను ఫరూక్ అబ్దుల్లా గుర్తుచేశారు. నాడు పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినదించిన వారితోనే నేడు కలిశారని బీజేపీపై ఆయన నిప్పులు చెరిగారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీతో జతకట్టిన నేషనల్ కాన్ఫరెన్స్ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే.. కాశ్మీర్ లోయలో ఉగ్రవాదం మళ్లీ పేట్రేగిపోతుందని శనివారం ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు.2019లో ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, అయినా రాష్ట్రంలో ఉగ్రవాద కార్యకలాపాలు ఇంకా కొనసాగుతున్నాయని ఈ సందర్భంగా ఫరూక్ అబ్దుల్లా గుర్తుచేశారు. ఉగ్రవాదుల చేతికి ఆయుధాలు ఎలా వస్తున్నాయని ఆయన సందేహం వెలిబుచ్చారు. ఎన్నికల ముందు ఇంజినీర్ రషీద్ జైలు నుంచి విడుదలవుతున్నారంటే ఆయన కచ్చితంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు చెందిన వ్యక్తేనని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బారాముల్లా లోక్‌సభ స్థానం నుంచి.. మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లాపై ఇంజినీర్ రషీద్ భారీ అధిక్యంతో గెలిచారు.ఉగ్రవాదులకు నిధులు, ఆయుధాలు సమకూరుస్తున్నారనే ఆరోపణలపై కొన్ని రోజుల క్రితం ఇంజినీర్ రషీద్‌ను అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి తీహార్ జైల్లో ఉన్న ఆయనకు బెయిల్ లభించడంతో తాజాగా జైలు నుంచి విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో ఫరూక్ అబ్దుల్లా పైవిధంగా స్పందించారు. కాగా, జమ్ము కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 18, 25, అక్టోబర్ 5వ తేదీల్లో మూడు విడతల్లో జరగనుంది. ఫలితాలు అక్టోబర్ 8న వెలువడనున్నాయి.

## కాళ్లు విరిగిన శునకాలకు అతనే ఒక అండ..



**న్యూఢిల్లీ- నవభూమి:** 15 ఆగస్టు 2024 బెంగళూరు వీధుల్లో పంద్రాగస్టు వేడుకల సందడి. హఠాత్తుగా రెపరెపలాడే జాతీయ జెండాతో కుక్కలు పరుగులు తీస్తున్నాయి. ఆ డాగ్ పరేడ్ చూసిన ప్రజలు జాతీయ జెండాకు, కాళ్లు విరిగిన కుక్కలు వాటి కాళ్లపై అవి నిలబడి బతికేలా చేసిన ఓ మంచి ప్రయత్నానికి సెల్యూట్ చేశారు!

విశ్వాసంలో శునకాన్ని మించిన జీవి లేదు. మనిషి కూడా అది చూపించే విశ్వాసానికి సాటి రాలేడు. ఎంత విశ్వాసం చూపినా ఏం లాభం? ఈ మనిషితో కుక్కలకు ఎన్ని చిక్కులో! రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు విరగ్గొట్టుకున్న శునకాలను చూస్తే.. మనసు చివుక్కుమంటుంది. నడవలేక, కనీసం కదల్లేక అవి పడుతున్న అవస్థ చూసి హృదయం తల్లడిల్లుతుంది. రాత్రుళ్లు వాహనాల కింద పడుకున్నప్పుడు, రోడ్డు పక్కన ఉన్న వీధికుక్కలు తరచూ ప్రమాదాలకు గురవుతూ ఉంటాయి. కాలు విరిగినా, తెగిపోయినా ఇక వాటి బతుకు నరకమే. నాలుగు కాళ్లూ భద్రంగా ఉన్నప్పుడే వీధికుక్కలను పట్టించుకునే నాథుడు ఉండడు. రోజంతా తిరిగినా వాటి ఆకలి తీరదు. ఇక నడవలేని పరిస్థితి వస్తే.. వాటి డొక్కలు ఎండిపోతాయి. ఆకలి బాధకు కాళ్లు ఈడ్చుకుంటూ తిరిగే వీధికుక్కలను చూసి జాలిపడతాం అంతే! కానీ, వాటి ఆకలి తీర్చే తీరిక ఎంతమందికి ఉంటుంది? కానీ, బెంగళూరులో గ్రామసింహాల రోదన ఆలకించే రోర్ (రెమిస్ ఆర్గనైజేషన్ ఫర్ యానిమల్ రిహాబిలిటేషన్) ఉంది. అంటే.. ప్రమాదాల బారినపడి వైకల్యంతో బాధపడుతున్న కుక్కలకు వైద్యం అందించే సంస్థ. కాలు విరిగిన శునకాలను మళ్లీ మునుపటిలా పరిగెత్తిస్తుందీ ఆర్గనైజేషన్.

**గ్రామసింహాల కోసం గర్జన**

ప్రత్యేక అవసరాలున్న, వైకల్యంతో బాధపడుతున్న కుక్కల సంరక్షణ కోసం ఈ సంస్థ ఏర్పడింది. బెంగళూరు నగరంలోని హెన్నూరు రోడ్‌లో ఉందీ ఎన్‌జీవో. వైకల్యం బారినపడిన వీధికుక్కల కోసం ప్రత్యేకంగా చక్రాల కుర్చీలు తయారు చేస్తుంటుంది. నడవలేని మనిషి చక్రాల కుర్చీల సాయం తీసుకున్నట్టు.. నడవలేని శునకాలకు చక్రాల కాళ్లు అమర్చుతుందన్నమాట. కుక్కల శరీర సౌష్టవానికి తగినట్టుగా తేలికపాటి బరువుతో దృఢంగా ఉండే లోహపు కడ్డీలతో చక్రాల కాళ్లు తయారు చేయిస్తుంటారు. శునకాల ఎత్తుకు తగ్గట్టుగా వీటిని సరి చేయవచ్చు.

**వీధికుక్కల సమస్యకు ఓ పరిష్కారం**

బెంగళూరు వీధుల్లో గాయపడి నడవలేని స్థితిలో ఉన్న వీధికుక్కలను రోర్ ఎన్‌జీవో సంస్థ సభ్యులు గుర్తించి వాటన్నిటినీ చికిత్స కోసం ఓ కేంద్రానికి తరలిస్తారు. వైద్యుల పరీక్షల తర్వాత వాటి కాళ్లు సాధారణ చికిత్సతో పూర్వస్థితికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తారు. సాధ్యం కాకపోయినా, లేదా కాలు పూర్తిగా తెగిపోయిన కుక్కలకు చక్రాల కాళ్లు అమరుస్తారు. చక్రాలు అమర్చిన తర్వాత వాటికి నడవడంలో కొంతకాలం పాటు శిక్షణ ఇస్తారు. ఐడియా బాగుంది కదా! అంతేకాదు ఊరకుక్కల్ని వీధుల్లో వదిలేయకుండా చేరదీస్తున్నారు. వాటికి వైద్యం చేస్తారు. వాటిని పెంచుకునేందుకు స్థానికులను ఒప్పిస్తున్నారు. పన్నెండేళ్లలో ఎన్నో కుక్కలను బతికేలా, నడిచేలా, జంతు ప్రేమికులు పెంచుకునేలా చేశారు, చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు వాళ్ల దగ్గర 40కి పైగా వైకల్యం బారినపడిన.. చక్రాల కాళ్ల సాయంతో నడిచే కుక్కలు ఉన్నాయి.!

**రెమీ ప్రేమకు ముగ్ధుడై**

రోర్ ఎన్జీవో నిర్వాహకుడు ఆనంద్ కృష్ణన్ శ్రీనివాసన్ యానిమల్ హైడ్రోథెరపిస్ట్‌గా పని చేస్తున్నాడు. పన్నెండేళ్ల క్రితం ఆయన చెన్నైలో ప్రయాణిస్తున్నప్పుడు రోడ్డుపై ప్రమాదంలో గాయపడ్డ ఓ కుక్క కనిపించింది. దానిని కారులో తీసుకుని పశు వైద్యశాలకు తీసుకెళ్లాడు. అది బతికింది. కానీ, నడవలేని స్థితిలో ఉంది. ఆ కుక్కను తన వెంట తీసుకెళ్లి పెంచుకున్నాడు. దానికి రెమీ అని పేరు పెట్టుకున్నాడు. ఆ కుక్క చూపే విశ్వాసానికి ముగ్ధుడై మళ్లీ నడిపించాలనుకున్నాడు. దానికోసం ఓ చక్రాల కాలు తయారు చేయించాడు. అది అటూ ఇటూ తిరుగాడటం ఆయనకు అబ్బురమనిపించింది. అప్పటినుంచి వీధుల్లో, ఇళ్లలో వైకల్యంతో బాధపడుతున్న కుక్కలకు ఉచితంగా వైద్యం అందించేందుకు రోర్ సంస్థను ప్రారంభించాడు. డాగ్ లవర్స్ ఇచ్చే విరాళాలతో వైకల్యంతో ఉన్న కుక్కలను కాపాడుతూ ప్రేమను చాటుకుంటున్నాడు ఆనంద్!

## సోషల్‌మీడియాలో ఇప్పుడు ఇతనే సెన్సేషన్..

**న్యూఢిల్లీ-నవభూమి:** సోషల్ మీడియా.. ఎప్పుడు ఎవర్ని స్టార్‌ను చేస్తుందో ఊహించలేం! అప్పుడెప్పుడో 'కచ్చా బాదాం!' అంటూ పాడిన భుబన్ బద్యాకర్, ఒక్కరోజులోనే బాలీవుడ్ సింగర్‌గా మారిన రానూ మండల్.. ఓవర్‌నైట్‌లో ఫేమస్ అయినవారే! ఇప్పుడు తరుణ్ రాయన్ వంతు. 'నా గురించి తెలుసుకోవాలంటే.. నా పేరును గూగుల్‌లో వెతకండి!' అంటున్న ఈ తోపుడుబండి కుర్రాడు.. సోషల్‌మీడియాలో తాజా సెన్సేషన్! చెన్నైకి చెందిన రాయన్.. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బయోటెక్నాలజీలో పీహెచ్‌డీ చేస్తున్నాడు.కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండేందుకు తోపుడు బండిపై చవులూరించే పాకాలు చేసి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలోనే



అమెరికాకు చెందిన వ్లాగర్ క్రిస్టఫర్ లూయిస్.. తన వీడియోల్లో తమిళనాడును ఎక్స్‌ప్లోర్ చేస్తూ.. తరుణ్ రాయన్ బండి దగ్గరికి వచ్చాడు. చికెన్ 65 ఆర్డర్ ఇచ్చి.. ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్న రాయన్‌ను పలకరించాడు. తన గురించి చెప్పమంటూ అడిగాడు. అప్పుడు రాయన్ చెప్పిన సమాధానం విని.. క్రిస్టఫర్ మాత్రమే కాదు సోషల్ మీడియానే నోరెళ్లబెట్టింది.'నా పేరును గూగుల్‌లో వెతకండి. నా పీహెచ్‌డీ పరిశోధనా వ్యాసాలు మీకు కనిస్తాయి!' అని చెబుతున్న రాయన్ వీడియో.. సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నది. ఇప్పటికే లక్షకుపైగా వ్యూస్‌ను సాధించింది. ఈ వీడియోలో రాయన్‌ను చూసినవారంతా.. అతణ్ని తెగ పొగిడేస్తున్నారు. ఓవైపు ఉన్నత విద్యాభ్యాసం చేస్తూనే.. కుటుంబం కోసం వీధి వ్యాపారిగా రాణిస్తున్నాడనీ, అతని కష్టపడేతత్వానికి ముగ్ధులవుతున్నారు.

## సీఎం వైపు దూసుకెళ్లిన యువకుడు.. పట్టుకున్న భద్రతా సిబ్బంది..



**న్యూఢిల్లీ-నవభూమి:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య పర్యటనలో భారీ భద్రతా లోపం వెలుగు చూసింది. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో వేదికపై కూర్చున్న సీఎం సిద్ధరామయ్య వైపు ఓ యువకుడు దూసుకెళ్లాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది అతన్ని వెంటనే పట్టుకున్నారు. అనుమానాస్పదంగా ఉన్న యువకుడిని భద్రతా సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సదరు యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం సిద్ధరామయ్య వేదికపై ఉండగా.. ఓ యువకుడు ప్రేక్షకుల గ్యాలరీ నుంచి లేచి వేదికపైకి దూకాడు. వెంటనే అక్కడనే ఉన్న భద్రతా సిబ్బంది సీఎం కుర్చీ వైపు రాకుండా యువకుడిని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. అయితే, యువకుడు ఎందుకు సీఎం వైపు ఎందుకు దూసుకువెళ్లాడు అనే కారణం తెలియరాలేదు. అదే సమయంలో సదరు యువకుడి వివరాలు సైతం తెలియలేదు. ప్రస్తుతం పోలీసులు సదరు యువకున్ని విచారిస్తున్నారు.

## అరవింద్ కేజ్రీవాల్ అగ్నిపరీక్ష : ఢిల్లీ సీఎం రాజీనామాపై రాఘవ్ చద్దా




**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో అరెస్ట్ అయి బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేశారు. తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ఆరు నెలల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చిన కేజ్రీవాల్ ఆదివారం పార్టీ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయబోతున్నట్లు ప్రకటించారు. తాను నిజాయితీపరుడినని ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చేవరకూ సీఎం పగ్గాలు చేపట్టబోనని చెప్పారు.కాగా కేజ్రీవాల్ సంచలన ప్రకటనపై పార్టీ సీనియర్ నేత రాఘవ్ చద్దా స్పందించారు. కేజ్రీవాల్ తన పదవిని త్యజించి అగ్నిపరీక్షకు సిద్ధమయ్యారని వ్యాఖ్యానించారు. ఆప్‌నకు ఓటు వేయడం ద్వారా కేజ్రీవాల్ నిజాయితీపరుడని ఢిల్లీ ప్రజలు నిర్ధారించనున్నారని ధీమా వ్యక్తం చేశారు. బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ దీవార్ మూవీలోని సన్నివేశాన్ని తలపిస్తూ ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ అమాయకుడని తమ చేతిపై రాసుకోవాలని చద్దా కోరారు.ఢిల్లీ ప్రజలు తమ తీర్పును వెలువరించేవరకూ తాను సీఎం స్థానంలో కూర్చోబోనని వెల్లడిస్తూ రెండు రోజుల్లో ఢిల్లీ సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించడం ఆప్ వర్గాల్లో కలకలం రేపింది. ప్రజా తీర్పు అనంతరమే తాను సీఎం పదవి చేపడతానని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. కేజ్రీవాల్ అమాయాకుడా..? దోషా..? అని తాను ఢిల్లీ ప్రజలను అడగదలుచుకున్నానని చెప్పారు. ఢిల్లీ నూతన సీఎంను ఎన్నుకునేందుకు ఆప్ ఎమ్మెల్యేలతో రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను మహారాష్ట్రతో పాటు ఈ ఏడాది నవంబర్‌లో నిర్వహించాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు.


## మేం అధికారంలోకి రాగానే మద్య నిషేధాన్ని ఎత్తేస్తాం : ప్రశాంత్ కిషోర్



**న్యూఢిల్లీ-నవభూమి:** బీహార్‌లో తమ పార్టీ అధికారంలోకి రాగానే మద్య నిషేధాన్ని రద్దు చేస్తామని జన్ సురాజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్ హామీ ఇచ్చారు. అక్టోబర్ 2న తమ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఏర్పాట్లను వివరిస్తూ ఆయన ఈ విషయం చెప్పారు. పీకే మీడియాతో మాట్లాడుతూ.. జన్ సురాజ్ ప్రభుత్వం ఏర్పడితే అధికారంలోకి వచ్చిన గంటలోపే బీహార్‌లో ఉన్న మద్యపాన నిషేధాన్ని ఎత్తేస్తామని వ్యాఖ్యానించారు. అందుకోసం తాము రెండు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నామని చెప్పారు.రాష్ట్రీయ జనతాదళ్ నాయకుడు తేజస్వి యాదవ్ రాష్ట్రంలో చేపట్టిన యాత్రపై పీకే మాట్లాడుతూ.. ఆయన కనీసం ఇప్పటికైనా ఇంటి నుంచి బయటకువచ్చి ప్రజల మధ్యకు వెళ్లడం మంచి పరిణామమే అన్నారు. తేజస్వి యాదవ్, సీఎం నితీశ్ కుమార్ వల్ల రాష్ట్రానికి నష్టం తప్ప ప్రయోజనం ఏమీ లేదని వ్యాఖ్యానించారు. బీహార్ ప్రజలు 30 ఏళ్లుగా వారిని భరిస్తున్నారని అన్నారు. ఇకనైనా వారు బీహార్‌ను విడిచిపెట్టాలని సూచించారు.ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. బీహార్‌లో 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం ఉన్నప్పటికీ అభివృద్ధి సూచీల్లో వెనుకబడి ఉందని తేజస్వీ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఆయన రాజకీయ నాయకుడు కావడానికి ఏకైక కారణం మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు కావడమే అని ఎద్దేవా చేశారు. కాగా బీహార్‌లో 2016 ఏప్రిల్ నుంచి మద్య నిషేధం అమల్లో ఉన్నది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
సోమవారం
16, సెప్టెంబర్, 2024





## ఇక్కడ భార్యలు అద్దెకు లభించును.. ధర కేవలం..

**భోపాల్-నవభూమి:** మధ్యప్రదేశ్‌లోని శివపురిలో మహిళల సంత జరుగుతుండటం అందరినీ కలచివేస్తున్నది. ధడీచా పేరుతో కొనసాగుతున్న ఈ తిరోగమన ఆచారం దిగ్భ్రాంతికి గురి చేస్తున్నది. ఈ సంతలో యువతులు, మహిళలను అద్దెకు ఇస్తారు. నచ్చిన యువతి/మహిళను నెలలు, సంవత్సరాల కోసం అద్దెకు తీసుకుంటారు. ఆమె కుటుంబ సభ్యులు, అద్దెకు



తీసుకునేవారు స్టాంపు పేపర్లపై ఒప్పందం రాసుకుంటారు. పెండ్లి చేసుకోవడానికి తగిన యువతి దొరకనివారు, తమ ఇండ్లలోని వయోవృద్ధుల సంరక్షణ కోసం మహిళలు అవసరమైనవారు ఈ విధంగా ఒప్పందాలు చేసుకుంటారు. అద్దె రూ.15,000 నుంచి ప్రారంభమై, కొన్ని లక్షల వరకు ఉండవచ్చు. కన్యలకు ఎక్కువ ధర ఉంటుందని, అయితే ఈ ఒప్పందాన్ని తిరస్కరించే హక్కు మహిళలకు ఉంటుందని స్థానికులు చెప్తున్నారు.

## హైదరాబాద్‌లో వికసిస్తున్న ఎఐ విప్లవం

మానవ కార్యకలాపాలను వినూత్నంగా మార్చివేస్తున్న అధునాతన సాంకేతికత కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్%-%ఎఐ). ప్రపంచ దేశాలు ఎఐ సామర్థ్య విస్తృతిని అన్వేషించడంలో పోటీపడుతున్నాయి. ఆ శక్తిని ఉయోగించుకుంటూ అందులో మరింత నైపుణ్యాన్ని సముపార్జిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'గ్లోబల్ ఎఐ సమ్మిట్-2024' ఆ సమూల పరివర్తన సాధక సాంకేతికతలో అతినూతన పోకడలపై వెలుగులు ప్రసరించనున్నది. ఆరోగ్య భద్రత, జీవశాస్త్రాలు, విద్య, వ్యవసాయం, న్యాయవ్యవస్థ, తయారీ రంగం, పౌర సేవలు ఇత్యాది రంగాలలో ఎఐ ఆధారిత నవీకరణల ప్రగాఢ, విస్తార ప్రభావ ప్రాబల్యాలను అధ్యయనం చేసి, సంబంధిత మార్పులపై మన అవగాహనను మరింతగా మెరుగుపరచుకునేందుకు ఆ సమ్మిట్ దోహదం చేయనున్నది. ట్రాఫిక్ జామ్‌లను తగ్గించడం నుంచి అధిక దిగుబడులు సాధించడంలో రైతులకు తోడ్పడడం వరకు ప్రభుత్వాలు తమ పౌరులకు అందిస్తున్న సేవల తీరుతెన్నులను ఎఐ సాంకేతికత కొత్త పుంతలు తొక్కిస్తోన్నది. గ్లోబల్ టెక్నాలజీ కేంద్రంగా శీఘ్రగతిన వినుతికెక్కుతున్న హైదరాబాద్ ఎఐ ఆధారిత భవిష్యత్తు కల్పించే అవకాశాలను సమగ్రంగా ఉపయోగించుకునేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నది. ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్, ఆటోమేషన్ తదితర వ్యవస్థాపిత ఎఐ సాంకేతికతలు ప్రభవిస్తోన్న జెనరేటివ్ ఎఐతో కలిసి ఒక కొత్త పారిశ్రామిక విప్లవానికి దారితీస్తున్నాయి. నిన్న ఒక స్వప్నంగా, భవిష్యద్దర్శనంగా మాత్రమే ఉన్న (సకల పారిశ్రామిక కార్యకలాపాలలోనూ) ఎఐను ఉపయోగించుకోవడమనేది నేడు ఒక యథార్థంగా ఉన్నది. తెలంగాణలో సంప్రదాయక వ్యవసాయక సవాళ్లు అధిగమించేందుకు ఎఐని ఫలప్రదంగా ఉపయోగిస్తున్నారు. పంట సమాచారం, సాగు భూముల పరిస్థితులను విశ్లేషించడం ద్వారా ఎఐ, రైతుల వైయక్తిక అవసరాలకు అనుగుణమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తూ దిగుబడులను అధికం చేస్తోంది. ఎఐని ఉపయోగించుకున్న రైతులు ఎకరాకు సగటున 21 శాతం అధిక దిగుబడిని సాధించారు. పంటల సాగులో వారు ఉపయోగించే క్రిమిసంహారక మందుల వినియోగం 9 శాతం, ఎరువుల వాడకం 5 శాతం తగ్గిపోగా దిగుబడుల విక్రయ ధరలు 8 శాతం మేరకు పెరిగాయి. హైదరాబాద్‌లోను, ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాలలోను రోడ్లపై వాహనాల రాకపోకలను మరింత సమర్థంగా క్రమబద్ధం చేసేందుకు ఎఐ తోడ్పడుతున్నది. ఎఐ శక్తిదాయక వ్యవస్థలు వాహనాల రాకపోకల తీరుతెన్నులను వాస్తవ సమయం (రియల్ టైమ్)లో విశ్లేషిస్తూ, ట్రాఫిక్ లైట్లను నియంత్రించడం ద్వారా ట్రాఫిక్ రద్దీని కూడళ్లలో 30 శాతం మేరకు, కాలుష్యకారక ఉద్గారాలను 10 శాతం మేరకు తగ్గించగలుగుతున్నాయి. అంటువ్యాధుల విజృంభణను ముందస్తుగా మదింపు వేయడం, నిధులు అధికంగా, అత్యవసరమైన వ్యాధి నిరోధక కార్యకలాపాలకు కేటాయింపులు చేయడంలో సహాయపడడం ద్వారా ఆరోగ్య భద్రతలో ఎఐ కీలకపాత్ర వహిస్తోంది. కొవిడ్ మహమ్మారి కాలంలో ఆ అనారోగ్య హానికి గురయ్యేందుకు ఎక్కువ అవకాశమున్న ప్రజా సమూహాలను గుర్తించేందుకు ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్‌ను ఉయోగించి మంచి ఫలితాలను సాధించారు. ఎఐ ఆధారిత ఆరోగ్య భద్రతా పద్ధతులు మారుమూల గ్రామాల ప్రజలకు సైతం అత్యవసర వైద్య సలహాలు సత్వరమే, సుగమంగా సమకూరేందుకు విశేషంగా తోడ్పడుతున్నాయి. ప్రభుత్వాల పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు ఎఐ ఆధారిత సాధనాలు, దోహదం చేస్తున్నాయి. భారీ పరిమాణంలో ఉన్న సమాచారాన్ని విద్యుత్ వేగంతో మథించి, ప్రభుత్వ వ్యయాలలో అవకతవకలను కనుగొని వనరులను మరింత వివేకవంతంగా వినియోగించేందుకు ఎఐ తోడ్పడుతున్నది విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఎఐని ఉపయోగించి వారి అభ్యసన అనుభవాలను సమున్నతం చేసేందుకు ఎఐని ఉపయోగిస్తున్నారు. ఎఐ ఆధారిత విద్యా వేదికలు వైయక్తిక అభ్యసన శైలిని మదింపు చేసి, అందుకు అనుగుణంగా పాఠ్యాంశాలను మార్చి ప్రతి విద్యార్థికి వైయక్తికమైన విద్యాబోధన చేయడంలో ఎఐ విశేష పాత్ర వహిస్తోంది. అలాగే విద్యాసంస్థల దైనందిన పాలనా ప్రక్రియలను ఆటోమేట్ చేయడం ద్వారా ఉపాధ్యాయులు తమ దృష్టిని పూర్తిగా బోధన విధులపై కేంద్రీకరించేందుకు ఎఐ తోడ్పడుతున్నది. పారిశ్రామిక రంగంలో వివిధ సంస్థలు తమ యూనిక్ డేటా నుంచి గరిష్ఠ ప్రయోజనం పొందేందుకు, సమస్త వేల్యూ చైన్స్ (ముడిపదార్థాల సేకరణ, ఉత్పత్తి వినియోగం, త్యజించడం, రీసైక్లింగ్ ప్రక్రియతో సహా ఒక ఉత్పత్తి సంపూర్ణ జీవితచక్రాన్ని ఉద్దేశించిన భావన)ను తిరిగి ఊహించేందుకు, తమ సిబ్బంది, యంత్రాల పనితీరును విస్తారంగా మెరుగుపరచుకునేందుకు, కొత్త కల్పనలను ప్రోత్సహించేందుకు ఎఐ విశేషంగా తోడ్పడుతున్నది. బ్యాంకింగ్, ఫైనాన్సియల్ సర్వీసెస్, బీమా రంగంలో అపార సమాచారాన్ని తరచిచూసి దూరదృష్టితో కూడిన నిర్ణయాలు తీసుకునేందుకు ఎఐ సహాయపడుతున్నది. తద్వారా ముందస్తు అంచనా సామర్థ్యాన్ని మెరుగుపరిచి వాస్తవ సమయంలో మోసాలు, అక్రమాలను గుర్తించి నిరోధించడం సాధ్యమవుతోంది. మన సమస్త జీవిత పార్శ్వాలను విప్లవీకరించే శక్తి ఎఐకి ఉన్నది. ఈ అధునాతన సాంకేతికతను ఉపయోగించుకోవడం అంతకంతకూ పెరుగుతున్నందున తత్ఫలితంగా ఉత్పన్నమవుతున్న పలు క్లిష్ట విషయాలనూ నిశితంగా పరిశీలించి వాటిని పరిష్కరించుకోవడంపై దృష్టిపెట్టాల్సిన అవసరమున్నది. వ్యక్తిగత గోప్యత, పారదర్శకత, వివరణీయత, నిష్పాక్షికత, జవాబుదారీతనం, అనువర్తన, భద్రత, రక్షణ మొదలైన వ్యవహారాలలో ఎఐ మూలంగా పలు సమస్యలు నెలకొంటున్నాయి. ఎఐ మూలంగా తలెత్తే సమస్యలు, ఇక్కట్లను జరూరుగా గుర్తించి, సకాలంలో సంపూర్ణంగా పరిష్కరించుకోవాలి. ఎఐ వ్యవస్థలు సేకరిస్తున్న సమాచారం గోప్యత భంగానికి, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగానికి దారితీసే ప్రమాదమున్నది. ఎఐ వ్యూహాలు, ప్రణాళికలతో ముందుకుసాగుతున్న సంస్థలు అనేకం అపాయాలు, అవకాశాల మధ్య సమతుల్యతను ఎలా సాధించాలనే విషయమై శ్రద్ధ చూపుతున్నయని మా (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) సొంత అనుభవాలతో పాటు టిసిఎస్ ఎఐ ఫర్ బిజినెస్ స్టడీ కనుగొన్న విషయాలూ స్పష్టం చేస్తున్నాయి. భారతదేశ సైబర్ సిటీగా ప్రసిద్ధికెక్కిన హైదరాబాద్ ఎఐ విప్లవాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు అన్ని విధాల సర్వసన్నద్ధంగా ఉన్నది. నగరంలో సాటిలేని రీతిలో పెరుగుతూ, ప్రభావదాయకంగా ఉన్న నవీన సాంకేతికతల వ్యవస్థలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో ఎఐ విప్లవ పురోగమనానికి సానుకూల పరిస్థితులను సమృద్ధంగా సృష్టిస్తున్నాయి. హైదరాబాద్ ఒక ఉన్నతస్థాయి విద్యాకేంద్రం. నగరంలోని ఇంజినీరింగ్ కళాశాలలు ఏటా వేలాది ఇంజినీరింగ్ పట్టభద్రులను రూపొందిస్తున్నాయి. ఎఐ విప్లవాన్ని నగరంలోనే కాకుండా విశాల భారతదేశమంతటా ఎఐ విప్లవాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడంలో ఆ ప్రతిభావంతుల పాత్ర కీలకమైనది. ఎఐ మూలంగా లక్షలాది ఉద్యోగాలు మటుమాయమవుతున్న మాట నిజం. అయితే 2025 సంవత్సరం నాటికి ఎఐ, తన మూలంగా మాయమవుతున్న ఉద్యోగాల కంటే 12 మిలియన్ ఉద్యోగాలను అధికంగా సృష్టించనున్నదని అంచనా. ఒక్క భారతదేశంలోనే రాబోయే కొద్ది సంవత్సరాలలో దాదాపు 4 లక్షల కొత్త ఉద్యోగాలు ఎఐ మూలంగా సృష్టి కానున్నాయి.

# ఓజోన్ పొర రంధ్రాన్ని మూసేద్దామా ??




(సెప్టెంబర్ 16 అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం.)

ముప్పైవ అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని 2024లో మనం జరుపుకుంటున్నాం. ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబరు 16న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం కారణంగా కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ఏర్పాటుచేసింది. ప్రపంచ ఓజోన్ దినోత్సవం భూమిపై జీవించడానికి ఓజోన్ పొర చాలా అవసరమని మనకు గుర్తుచేస్తుంది. భవిష్యత్ తరాల కోసం దానిని రక్షించడానికి కొనసాగుతున్న వాతావరణ చర్య అవసరాన్ని హైలైట్ చేస్తుంది. పర్యావరణ మార్పులపై ఓజోన్ పొర క్షీణతపై ప్రజలకు అవగాహన కల్పించడం, అన్ని దేశాల ప్రభుత్వాలు మాంట్రియల్ ప్రోటోకాల్‌ను మరింత సమర్థంగా అమలుచేసి 2050 సంవత్సరానికి ఓజోన్ పొరను 1980కు ముందున్న స్థాయికి తేవడానికి చేయవలసిన చర్యలగురించి శాస్త్రవేత్తలు, పరిశ్రమల యజమానులు, సంబంధిత అధికారులుసమావేశాలు నిర్వహిస్తారు.

**ఓజోన్ పొర అంటే ?**

ఓజోన్ మన వాతావరణంలో చాలా చిన్న భాగాన్ని కలిగి ఉంది. అయితే దాని ఉనికి మానవ శ్రేయస్సుకు చాలా ముఖ్యమైనది. చాలా వరకు ఓజోన్ భూఉపరితలం మీద 10 నుండి 40 కి.మీల మధ్య వాతావరణంలో ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాన్ని స్ట్రాటో ఆవరణ అని పిలుస్తారు. ఇది వాతావరణంలోని మొత్తం ఓజోన్‌లో 90% కలిగి ఉంటుంది. స్ట్రాటో ఆవరణలోని ఓజోన్ సూర్య కిరణాలు నేరుగా భూమిపై పడకుండా అందులో ఉండే అతినీలలోహితకిరణాలును ఓజోన్ పొర సంగ్రహించి ప్రాణకోటికి వాటిల్లే ముప్పు నుంచి



కాపాడుతుంది. ఈ ప్రయోజనకరమైన పాత్ర కారణంగా స్ట్రాటో ఆవరణ ఓజోన్ "మంచి" ఓజోన్‌గా పరిగణించబడుతుంది. దీనికి విరుద్ధంగా కాలుష్య కారకాల నుండి ఏర్పడిన భూమి ఉపరితలం వద్ద అదనపు ఓజోన్‌ను "చెడు" ఓజోన్‌గా పరిగణిస్తారు ఎందుకంటే ఇది మానవులకు, మొక్కలు, జంతువులకు హానికరం.

**ఓజోన్ పొర క్షీణత అంటే ?**

ఓజోన్ పొర క్షీణత అంటే ఎగువ వాతావరణంలో ఉన్న ఓజోన్ పొర సన్నబడటమే. వాతావరణంలోని క్లోరిన్, బ్రోమిన్ పరమాణువులు ఓజోన్‌తో చర్య పొంది ఓజోన్ అణువులను నాశనం చేసినప్పుడు ఇది జరుగుతుంది. ఒక క్లోరిన్ ఒక లక్ష ఓజోన్ అణువులను నాశనం చేయగలదు. ఇది సృష్టించబడిన దానికంటే త్వరగా నాశనం అవుతుంది. కొన్ని సమ్మేళనాలు అధిక అతినీలలోహిత కాంతికి బహిర్గతం అయినప్పుడు క్లోరిన్ బ్రోమిన్‌లను విడుదల చేస్తాయి. ఇది ఓజోన్ పొర క్షీణతకు దోహదం చేస్తుంది. ఇటువంటి సమ్మేళనాలను ఓజోన్ క్షీణత పదార్థాలు అంటారు. మే 1985లో బ్రిటీష్ అంటార్కిటిక్ సర్వే కథనం ఫలితాలను ప్రచురించిన తరువాత అంటార్కిటికాపై ఓజోన్ క్షీణత దృగ్విషయాన్ని "ఓజోన్ రంధ్రం"గా సూచిస్తారు, ఈ పదబంధాన్ని నోబెల్ బహుమతి గ్రహీత షేర్‌వుడ్ రోలాండ్ మొదట ఆపాదించారు. ఓజోన్ రంధ్రం ఉపగ్రహ చిత్రం పర్యావరణ ముప్పుకు ప్రపంచ చిహ్నంగా మారింది. ఇది మాంట్రియల్ ప్రోటోకాల్‌కు ప్రజల మద్దతును సమీకరించడంలో సహాయపడింది. మోటారు వాహనాలు పెరగడం, పరిశ్రమల కాలుష్యం, అధిక శాతం మంది ఏసీలను వినియోగించడం వలన ఓజోన్ పొర క్షీణించిపోతోందని 1987లో ఓజోన్ పొర క్షీణతపై జరిపిన పరిశోధన సంస్థ (మాంట్రియల్ ప్రోటోకాల్) తెలిపింది. ఓజోన్ పొరను దెబ్బతీస్తున్న పదార్థాల నియంత్రణకు గాను రూపొందించిన మాంట్రియల్ ప్రోటోకాల్‌పై ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు 16 సెప్టెంబర్ 1987న సంతకాలు చేశాయి. ఆ తరువాత 16 సెప్టెంబర్ 1994న మరో సమావేశం జరిపి ఓజోన్ క్షీణతను అరికట్టాలని నిర్ణయించారు. మాంట్రియల్ ప్రోటోకాల్ సార్వత్రిక ఆమోదాన్ని సాధించడం ద్వారా ఇప్పటి వరకు అత్యంత విజయవంతమైన పర్యావరణ ఒప్పందాలలో ఒకటిగా విస్తృతంగా పరిగణించబడుతుంది. ఇది ఓజోన్ క్షీణించే పదార్థాలను దశలవారీగా తొలగించడానికి ప్రపంచాన్ని ఏకం చేసింది. దీని అమలు ఓజోన్ పొర పునరుద్ధరణకు దారితీసింది. వాతావరణ మార్పులను తగ్గించడంలో గణనీయంగా దోహదపడింది. అంతర్జాతీయ దేశీయ ప్రయత్నాల కారణంగా 2065 నాటికి ఓజోన్ పొర పూర్తిగా కోలుకుంటుందని అంచనా.

**ఓజోన్ క్షీణతకు దారితీసేవి ?**

రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్లు, ద్రావకాలు, డ్రై క్లీనింగ్ ఏజెంట్లు లలో ఉండే క్లోరోఫ్లోరో కార్బన్‌లు. అగ్నిమాపక యంత్రాలు, వాటి ద్రావకాలలో ఉన్న హాలోన్స్ , కార్బన్ టెట్రాక్లోరైడ్లు, హైడ్రోఫ్లోరోకార్బన్లు. సంసంజనాలు, ఏరోసోల్లులలో ఉండే మిథైల్ క్లోరోఫామ్ ఓజోన్ పొర క్షీణతకు దారితీసే రసాయనాలు. క్లోరోఫ్లోరో కార్బన్‌లు అత్యంత సమృద్ధిగా ఓజోన్ పొరను క్షీణింపజేసే పదార్థం. రాకెట్‌లను నియంత్రించకుండా ప్రయోగించడం వల్ల ఓజోన్ పొర సిఎఫ్సిల కంటే చాలా ఎక్కువ క్షీణతకు దారి తీస్తున్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఇంకా ఔషధాలు, వ్యవసాయ పురుగుమందులతో పాటు వివిధ రసాయనిక పరిశ్రమల నుండి వచ్చే వాయువులు ఓజోన్ పొర మీద ప్రభావం చూపుతున్నాయి. ఓజోన్ పొర క్షీణతకు అగ్నిపర్వత విస్ఫోటనాలు కూడా కారణం. వీటిని నియంత్రించకపోతే 2050 నాటికి ఓజోన్ పొర భారీ నష్టానికి దారితీయవచ్చు.

**మన దేశం తీసుకుంటున్న చర్యలు:**

మాంట్రియల్ ప్రోటోకాల్ అమలులో మన దేశం అగ్రగామిగా ఉంది. ప్రోటోకాల్ కింద షెడ్యూల్ కంటే ముందే సాధించబడిన నియంత్రిత పదార్థాల తగ్గింపు లక్ష్యాలను చేరుకుంది. ఇది ఓజోన్ పొరను రక్షించడమే కాకుండా వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ప్రపంచ ప్రయత్నాలకు గణనీయమైన సహకారాన్ని అందిస్తోంది. మాంట్రియల్ ప్రోటోకాల్ ఫేజ్ అవుట్ షెడ్యూల్‌కు అనుగుణంగా 1 జనవరి 2010 నాటికి నియంత్రిత ఉపయోగాల కోసం భారతదేశం క్లోరోఫ్లోరోకార్బన్స్, కార్బన్ టెట్రాక్లోరైడ్, హాలోన్స్, మిథైల్ బ్రోమైడ్, మిథైల్ క్లోరోఫామ్‌లను దశలవారీగా తొలగించింది. ప్రస్తుతం మాంట్రియల్ ప్రోటోకాల్ వేగవంతమైన షెడ్యూల్ ప్రకారం హైడ్రోక్లోరోఫ్లోరో కార్బన్‌లు దశలవారీగా తొలగించబడుతున్నాయి.

**పరిష్కారాలు:**

ప్రతీ వ్యక్తి ఓజోన్ క్షీణతకు గురిచేసే కారకాలను నియంత్రణకు పాటుపడాలి. ప్రభుత్వాలు కూడా చట్ట వ్యతిరేకంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలపై ఉక్కుపాదం మోపాలి.

**జనక మోహన రావు దుంగ**
ఫోన్ 8247045230

# ముంపు నివారణోద్యమ సారథి కొల్లా వెంకయ్య

(స్వాతంత్ర సమరయోధుడు కొల్లా వెంకయ్య
సెప్టెంబర్ 17వ తేదీన 26వ వర్ధంతి)

కామ్రేడ్ కొల్లా వెంకయ్య, పెదనందిపాడు ప్రాంత ప్రజల ప్రియతమ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, శాసనసభ్యునిగా, శాసన మండలి సభ్యునిగా, పార్లమెంటు సభ్యుడు


వరదలను నివారించాలంటే ప్రజలు కదలాలి

ఈ మధ్యకాలంలో బుడమేరు వరదలు తీవ్రంగా వచ్చాయి.

బ్రిటిష్ ప్రభుత్వం నుండి ఇప్పటివరకు ఉన్న ప్రభుత్వాలన్నిటికీ ,గ్రామ ప్రజలకు జీవనాధారమైన తాగునీరు, వ్యవసాయానికి ముఖ్య అవసరమైనటువంటి నీటిపారుదల సౌకర్యాలు, మురుగునీటి పారుదల వ్యవస్థపై శ్రధ, ఆసక్తి క్రమేపీ తగ్గుతూ వస్తుంది. వరదలు వచ్చినప్పుడు ప్రజలను,రైతులను పరామర్శించి ఆహార పొట్లాలను,నిత్యావసరాలను అందించి వాగులను విస్తరిస్తామని హామీలు ఇస్తున్న ప్రభుత్వాధి నేతల మాటలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయి. వరద తగ్గగానే శాశ్విత వరద నివారణకు సలహాలివ్వమని ఒక కమిటీని నియమించడం ఆనవాయితీ అయింది. అలా నియమించిన 9 కమిటీలూ, శాశ్వత వరద నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోమని సూచించాయి. అందులో ఏ ఒక్క కమిటీ రిపోర్టు కూడా పూర్తిగా అమలుపరచలేదు.

మిత్రా కమిటీ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన, 1964 సంవత్సరం సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 1 వరకు కురిసిన భారీ వర్షాలు, గుంటూరు, క్రిష్ణా, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీ నష్టాల్ని సృష్టించాయి. 1964 అక్టోబర్లో ఉత్తరప్రదేశ్ చీఫ్ ఇంజనీర్ గారైన ఏసిమిత్ర గారి నాయకత్వాన ఆరుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పరిచారు. తరచుగా విలయతాండవం సృష్టిస్తున్న వరదల నివారణకు పటిష్టమైన చర్యలను సూచించమని ప్రభుత్వం ఆదేశించింది. వరద ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను అధ్యయనం చేసిన కమిటీ, తన రిపోర్టును జనవరి 26,1966 న ప్రభుత్వానికి సమర్పించింది. ఆ నివేదికలో అనేక కీలక రికమండేషన్స్ చేశారు. ఏ ఒక్క ప్రభుత్వం కూడా మిత్రా కమిటీ రిపోర్ట్ ను పూర్తిగా అమలు పరచలేదు. వారు చెప్పినట్లు,' 500 సి వేల్యూ కి ' బుడమేరు,తమ్మిలేరు, నల్లమడవాగులను అభివృద్ధి చేయలేదు. ఈ 60 సంవత్సరాల కాలంలో అనేక ప్రభుత్వాలు మారాయి. ఇంకా కొత్త నిపుణుల కమిటీలను ఏర్పాటు చేశారు. డాక్టర్ కె శ్రీరామకృష్ణయ్యకమిటీ (1986), సిహెచ్ రాధాకృష్ణమూర్తి గారి కమిటీ((1997), కృష్ణారావు గారి కమిటీ (2000), కృష్ణ గోదావరి జిల్లాల వరద గురించి ముఖ్యంగా బుడమేరు కాలువ యనమదురు డ్రెయిన్ లను స్టడీ చేయడానికి ఎమ్మెస్ చలపతిరావు కమిటీ(2000), రోశయ్య కమిటీ (2007)' చెరుకూరి వీరయ్య కమిటీ, వెంకయ్యనాయుడు, కొరటాల సత్యనారాయణ సభ్యులుగా వున్న శాసనసభ కమిటీ, దాదాపు 9 కమిటీలు, వరద ప్రాంతాలన్నీ కూడా పర్యటించి విషయ సేకరణ చేసి ఎంతో వివరమైనటువంటి రిపోర్టులను ఇచ్చాయి. రోశయ్య గారి కమిటీ రిపోర్ట్‌లో "కారణాలు ఏమైనప్పటికీ వాగులను మెయింటైన్ చేయటానికి ప్రాముఖ్యత ఇవ్వలేదు. ఒక ముఖ్యమైన పని కింద భావించలేదు. పెద్ద ఉపయోగం లేకుండానే కొన్ని పనులు చేస్తున్నారు. ముఖ్యమైన అభివృద్ధి గురించి అసలు పట్టించుకోవడమే మానేశారు "అని కమిటీ రిపోర్టు 23వ పేజీలోచెప్పారు. ఏ ఒక్క రిపోర్టును కూడా పూర్తిగా అమలుపరచలేదు.ఆ రిపోర్టులలోని కొన్ని పనులను కొద్ది ఖర్చు తో చేసి తాత్కాలికంగా ప్రజలను మభ్య పెట్టడం అనేది మామూలు అయిపోయింది. నాకున్న ప్రత్యక్ష అనుభవం- 2005 సంవత్సరంలో ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారు శాశ్వత వరద నివారణకు చర్యలు తీసుకుంటామని బాపట్ల సమావేశంలో వాగ్దానం చేశారు. ఆనాటి ముఖ్యమంత్రి రోశయ్య గారు కారంచేడు మునిగిపోయినప్పుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారి సమక్షంలో ఎన్నో హామీలు ఇచ్చారు. 2013 సంవత్సరంలో వచ్చిన పెద్ద వరదకు శాశ్వత నివారణ చర్యలు తీసుకుంటామని ఆనాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారు జిల్లెల్లమూడి గ్రామంలో పడవపై వచ్చి వాగ్దానం చేశారు. 2016 లో వచ్చిన వరదల సమయంలో వరదప్రాంతాల్లో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు పర్యటించి, 360 కోట్ల రూపాయలతో నల్లమడ ఆధునీకరణ ను చేపడ్తామని కాకుమాను లో 27 సెప్టెబరు 2016 న ప్రకటించారు. 2019 ఎన్నికల లో వైసీపీ నాయకులు జగన్మోహనరెడ్డి గారిచ్చిన వాగ్దానాలు నెరవేరనేలేదు.




1977లో కొల్లావెంకయ్య గారు స్థాపించిన నల్లమడ రైతు సంఘం దాదాపు 100 గ్రామాల ప్రజలను చైతన్యపరిచి, పదివేల మందితో పెదనందిపాడు లో బహిరంగ సభను నిర్వహించి శాశ్వత వరద నివారణ చర్యలు చేపట్టమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చరిత్రలో మొదటిసారిగా వరద నివారణ కోసం రైతులు బందు చేశారు.నల్లమడ ప్రాంత బంద్ ని సంపూర్ణంగా స్వఛందంగా నిర్వహించారు. రైళ్లతో సహా అన్నీ బంద్ అయ్యాయి. ఆనాటి ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి చెన్నారెడ్డి గారు,19-2-1979 అర్ధరాత్రి 444 లక్షల నిధులను విడుదల చేసి నల్లమడ వరదల నుండి పాక్షికంగా వెసులుబాటు కల్పించారు. కమిటీలతో కాలక్షేపం చేయకుండా, వాగులను అభివృద్ధి చేయమని, నిరంతర ఆందోళన కొనసాగుతున్నందువలన, కొంతవరకు తీవ్రస్థాయి ప్రమాదంనుండి తప్పించుకోగలిగారు.బుడమేరు ప్రాంతంలో వాగుల అభివృద్ధి, నీటిపారుదల వ్యవస్థ, ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసివచ్చినందున పెను ప్రమాదాన్ని ఎదుర్కోవలసివచ్చింది. ప్రభుత్వాల మంచితనం పై ఆధారపడి కాలం గడపకుండా, రైతులు తమ సమస్యల పై గళం విప్పాలి. తాము నమ్ముకున్న పార్టీల పై అభిమానం వుండవచ్చు. కానీ దురభిమానంతో, మాపార్టీ వారే చేస్తారులే అనే అతి నమ్మకంతో కాలంగడపటం అనర్ధానికి దారితీస్తున్నది. ఏపార్టీ రాజకీయాలలో వున్నా రైతాంగ సమస్యల పై రైతులే స్పందించాలి. బుడమేరులో జరిగినంత ఘోరం నల్లమడ ప్రాంతంలో జరగలేదు. రైతులుచైతన్యంతో నిరంతర పోరాటంతో నల్లమడ వరదలను కొంతవరకు నివారించుకోగలిగారు. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోవటమే ఈ దుస్థితికి కారణం. బుడమేరు ఆధునీకరణ కు మొదటిసారిగా ప్రణాళిక వేసి దశాబ్దాలు గడిచాయి. హైవేరోడ్డుల మీద వున్న శ్రధ వాగులు, నీటికాలువలపై లేదు. విజయవాడలో రెండున్నర లక్షల మంది ప్రజల దుస్థితికి కారణం ఎవరు? వాగులు, కాలువలు, చెరువులు ఆక్రమణలకు గురవుతుంటే చూస్తూ ఊరుకుంటే వరదలు రాకుండా వుండవు. కరకట్టల మట్టిని ప్రొక్లైనర్లు పెట్టి తోలుకెళుతుంటే, లంకలను కరకట్టలను ఆక్రమించుకొని, ఇళ్ళు, విల్లాలు, కట్టుకుంటూ ఉంటే వరదనీరు పల్లం లోకి ప్రవహిస్తూ విలయతాండవం సృష్టిస్తున్నాయి. విల్లాలు, హైవేలు విలాసవంతంగా పటిష్టంగా ప్రతిభావంతంగా నిర్మించటమే అభివృద్ధి కాదు. ప్రకృతిని గౌరవించి వరదల నివారణకు కారణాలను అన్వేషించి సమస్యా పరిష్కారానికి శాశ్వత చర్యలను చేపట్టి ప్రజలను రక్షించాలి. కామ్రేడ్ కొల్లా వెంకయ్య గారి నాయకత్వాన మహోద్యమం ..గుంటూరు బాపట్ల ప్రకాశం జిల్లాలలో ప్రవహించే నల్లమడ వాగు ప్రమాదం చాలా తీవ్రంగా ఉంటుంది. ఆరు నియోజకవర్గాలలో పది మండలాలలో లక్షలాది ఎకరాలు ముంపు కి గురి అవుతుంటే వరద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని నల్లమడ ప్రాంత రైతాంగం కామ్రేడ్ కొల్లా వెంకయ్య గారి నాయకత్వాన మహోద్యమాన్ని నిర్మించారు. అనేక ఉద్యమాలు సమాజంలో జరుగుతుంటాయి కానీ వరదలు నివారించాలని బ్రిటిష్ వారి పరిపాలనా కాలం నుండి ఈ కాలం వరకూ రైతులు నిలకడగా ప్రభుత్వాలను నిలదీస్తున్నటువంటి ప్రాంతం నల్లమడ పరీవాహక ప్రాంతం. పెదనందిపాడు ప్రాంత ప్రజల ప్రియతమ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, శాసనసభ్యునిగా, శాసన మండలి సభ్యునిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రజా వాణిని వినిపించివిశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు ఉద్యమం పై ప్రభుత్వ దమనకాండ కు నిరసనగా పార్లమెంటు సభ్యత్వానికి తృణప్రాయంగా రాజీనామా చేసిన మొదటి పార్లమెంటు సభ్యుడు కొల్లా వెంకయ్య గారు.

పేదప్రజల విముక్తి కోసం సభలు సమావేశాలు, చట్టసభల్లో పోరాటం నుండి తెలంగాణా, శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటం వరుకూ అన్ని పోరాట రూపాలనూ ఆచరించి చూపిన నాయకుడు కొల్లా వెంకయ్య గారు.గ్రామీణ పేదల సంఘాన్ని స్థాపించి పేదలకు భూమి కోసం గ్రామాల నుండి సుప్రీం కోర్టు వరకు పోరాడారు.1977 లో నల్లమడ రైతు సంఘాన్ని స్థాపించి ప్రజలను కదిలించి, వరదల నివారణకు మహోద్యమాన్ని నడిపించిన నాయకులు వెంకయ్య . వారికి జోహార్లు చెపుదాం.కొల్లా వెంకయ్య 26 వ వర్ధంతి 17-09-2024.

**డాక్టర్ కొల్లా రాజమోహన్,**
**నల్లమడ రైతు సంఘం.**
**ఫోన్ 9000657799.**
**13-9-2024**



# వెయ్యేళ్ల వెయ్యి లింగాల గుడి



'కొలనుపాక' అనగానే మనకు పురాతనమైన జైన దేవాలయం గుర్తుకు వస్తుంది. దానికి సమీపంలోనే దేశంలోనే అతి పురాతనమైన శివాలయాల్లో ఒకటైన శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయం కూడా ఉంది. సుమారు వెయ్యేళ్ల క్రితం కళ్యాణీ చాళుక్యుల కాలంలో కట్టించిన ఈ దేవాలయానికి ఏటా లక్షల మంది భక్తులు వస్తూ ఉంటారు.

కాకతీయులు.. అంతకు ముందు కళ్యాణీ చాళుక్యుల పరిపాలనలో తెలంగాణ ప్రాంతంలో అనేక దేవాలయాలు వెలిసాయి. వీటిలో కొలనుపాకలోని శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయం ఒకటి. సాధారణంగా కొలనుపాక అనగానే అత్యంత పురాతనమైన జైనదేవాలయం అందరికి గుర్తుకు వస్తుంది. దానికి అతి సమీపంలో ఈ సోమేశ్వరస్వామి దేవాలయం కూడా ఉంది. తెలంగాణాలోని పలు గ్రామాల్లో అనేక దేవాలయాలు ఉన్నా- కొలనుపాకకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ ఒక్క గ్రామంలోనే 21 రకాల కులాలకు ప్రత్యేకమైన దేవాలయాలు ఉన్నాయి. వీటిని స్థానికులు 'మఠాలు'గా పిలుస్తారు. వీటిలో సోమేశ్వరస్వామి దేవాలయానికి కొన్ని విశిష్టతలు ఉన్నాయి. వీటిలో మొదటిది వెయ్యి లింగాలు. ఒక శివలింగంపై వెయ్యి శివలింగాలు ఉండటం అత్యంత అరుదైన విషయం. అందుకే దీనిని 'వెయ్యి లింగాల గుడి' అని కూడా పిలుస్తారు. ఈ వెయ్యిలింగాల స్వామిని కొలవటానికి కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వేలాది భక్తులు వస్తూ ఉంటారు.శివాలయం పక్కనే అమ్మవారి ఆలయం ఉండటం మరో ప్రత్యేకత. ఈ దేవాలయంలో వెయ్యేళ్ల క్రితం నాటి కొన్ని అరుదైన శిల్పాలను చూడవచ్చు. నంది కూడా సజీవంగా ఉన్నట్లు కనబడుతుంది. ఈ శివాలయం ముందు ఉన్న మండపం పైభాగంలో పురాణ గాథలకు సంబంధించిన కొన్ని అరుదైన చిత్రాలు ఉన్నాయి.


ఒకప్పుడు శిథిలావస్థలో ఉన్న దేవాలయ పునరుద్ధరణ కార్యక్రమాన్ని యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైటీడీఏ) చేపట్టింది. ఈ పునరుద్ధరణ పనులు చురుకుగా సాగుతున్నాయనీ, ఒకప్పుడు ఈ దేవాలయానికి ఉన్న వైభవాన్ని మళ్లీ తిరిగి తేవటానికి అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ శివాలయ పునరుద్ధరణ పనులు పూర్తయితే దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది భక్తులు కొలనుపాక సోమేశ్వరుణ్ణి దర్శించుకోవడానికి వస్తారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదంటున్నారు స్థానికులు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 హైదరాబాద్
సోమవారం
16, సెప్టెంబర్, 2024

## పుష్టిని ఇచ్చే 'పులగం'

కట్టు పొంగలి చాలా మందికి ఇష్టమైన వంటకం. దీన్నే మన వాళ్లు పులగం అని కూడా పిలుస్తారు. ఈ పులగం వెనక చాలా కథే ఉంది. కట్టు పొంగలి అంటే కారపు పాయసం అని అర్థం. వాస్తవానికి 'పుల' అనే తెలుగు పదానికి బంగారం అని అర్థం. బంగారపు రంగులో ఉంటుంది కాబట్టి ఈ పొంగల్‌ను పులగం అని కూడా పిలుస్తారు. ఇక పులగాన్ని సంస్కృతంలో కృశరా అంటారు. దీని అర్థం కూడా బంగారపు రంగులో ఉండేదనే! శుభకార్యాలు.. దైవ కార్యాలలో దీనిని వండి నైవేద్యంగా పెట్టి ప్రసాదం పంచుతారు.'అనంగత్రయోదశి వ్రతం' లాంటి సందర్భాల్లో పులగాన్నే నైవేద్యంగా పెడతారు. నందికేశుడి



నోములోనూ, నవరాత్రుల్లోనూ పులగం తప్పనిసరిగా ఉంటుంది. మనుస్మృతి... బియ్యం, నువ్వులు, పెసరపప్పు కలిపి పాలు పోసి పులగం వండుతారని పేర్కొంది. ఇక పులగం తయారీలో కూడా పరిణామ క్రమం ఉంది.దక్షిణాదిలో అల్లం, ఇంగువ, మిరియాలు జీలకర్ర, కరివేపాకు, జీడిపప్పు తాలింపు పెట్టే ఆచారం మొదలైతే.. ఉత్తరాదిలో రకరకాల కూరగాయల ముక్కలు ఉడికించి కలిపి కృశరాన్నాన్ని కిచిడీగా మార్పు చేసుకున్నారు. కృశరా లేదా పులగం గురించి యోగరత్నాకరం, భోజన కుతూహలం, క్షేమకుతూహలం లాంటి పాకశాస్త్ర గ్రంథాలు పులగాన్ని ఎలా చేసుకోవాలో వివరంగా ఇచ్చాయి. క్షేమశర్మ క్షేమకుతూహలంలో పులగం తయారీ గురించి ఇలా పేర్కొన్నాడు.

# మహిళా సర్వోదయంస్త్రీ శక్తి



సాధారణంగా స్వయం సహాయ సంఘాల మహిళలంటే తాము పొదుపు చేసుకున్న మొత్తానికి తోడు, బ్యాంకు లింకేజీ కింద వచ్చే రుణాలతో కిరాణాషాపులు.. పాడి పశువుల పెంపకం వంటి పనులకు పరిమితమవుతుంటారు. అయితే సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం గంగ్లూర్ గ్రామానికి చెందిన మహిళలు ఓ అడుగు ముందుకేశారు. ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గ్రామంలోని 126 మంది మహిళలు సంఘటితమై మూడు కుటీర పరిశ్రమలను స్థాపించారు. సర్వోదయ ఉమెన్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో కంపెనీని రిజిస్ట్రేషన్ చేయించారు. త్వరలోనే స్వయం సహాయక బృంగాల మహిళలు కాస్తా మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదిగారు.

'సర్వోదయ మంజీరా' బ్రాండ్ పేరుతో చేతితో చేసిన 15 రకాల సబ్బులు తయారు చేస్తున్నారు. 20కిపైగా రసాయనాలతో తయారయ్యే సాధారణ సబ్బులకు భిన్నంగా ఇవన్నీ బొప్పాయి, టమాట వంటి సహజ వనరులతో తయారు చేసినవే కావడం గమనార్హం. ఈ పరిశ్రమల్లో కోల్డ్‌ప్రెస్ వంటనూనెలను కూడా ఉత్పత్తి చేస్తున్నారు. పల్లి, పొద్దుతిరుగుడు, నువ్వుల నూనె, కొబ్బరినూనెలను తయారు చేస్తున్నారు. ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్ కూడా చేస్తున్నారు. స్థానికంగా పండే పప్పుదినుసుల ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేస్తున్నారు.

**జాతీయ స్థాయి నాణ్యత ప్రమాణాలు..**

బహుళ జాతి సంస్థల ఉత్పత్తులకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యత విషయంలో రాజీ పడటం లేదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా), జీఎంపీ (గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రొడక్ట్) వంటి జాతీయ సంస్థల లైసెన్సులు తీసుకున్నారు. హ్యాండ్‌మేడ్ సబ్బులు వంటి కాస్మోటిక్స్ ఉత్పత్తుల కోసం ఆయుష్ విభాగం నుంచి అనుమతి పొందారు.

**త్వరలో మార్కెట్‌లోకి ఉత్పత్తులు..**

సర్వోదయ ఉత్పత్తులు మార్కెట్‌లోకి తెచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 2022 జనవరిలోనే ఈ ఉత్పత్తుల





మార్కెటింగ్ ప్రారంభించాలని భావించినప్పటికీ కరోనా థర్డ్‌వేవ్ ప్రభావం కారణంగా మరో పక్షం రోజులు వాయిదా వేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఈ ఉత్పత్తుల కోసం వినియోగదారుల అభిరుచుల సేకరణ ప్రక్రియను కూడా చేపట్టారు. వారి అభిరుచుల మేరకు తమ ఉత్పత్తుల్లో మార్పు చేర్పులు కూడా చేసినట్లు మహిళలు చెబుతున్నారు.బాధ్యతగా పనిచేస్తున్నాం...

'సర్వోదయ'లో పనిచేసే మేము అందరం ఈ పరిశ్రమలకు ఓనర్లమే. అందరికీ యాజమాన్య వాటా ఉంది. వచ్చే లాభాల్లో డివిడెండ్ వస్తుంది. అందువల్ల బాధ్యతగా పనిచేస్తున్నాం. ఇప్పుడు మేమందరం పప్పుల ప్రాసెసింగ్, నూనెలు తయారు చేయడం నేర్చుకుంటున్నాము. గ్రామంలోనే మా సొంత పరిశ్రమ లో పని చేయడం చాలా ఆనందంగా ఉంది.

**అంకమ్మగారి చిట్టెమ్మ, 'సర్వోదయ' సభ్యురాలు**

**సొంతూరులోనే పని దొరుకుతోంది...**

ఇప్పటివరకు ఇంటిపనికే పరిమితమైన మాకు ఈ పరిశ్రమ వల్ల సొంత ఊరిలోనే పని దొరుకుతోంది. ఈ పరిశ్రమలో మా కుటుంబం పెట్టుబడి ఉండటంతో అందులో పనిచేస్తున్న నేను కార్మికురాలిగా కాకుండా యజమానురాలిగా భావిస్తున్నాను. ప్రస్తుతం నేను సబ్బుల తయారీలో పనిచేస్తున్నాను.

**జంగం శిరీష, 'సర్వోదయ' సభ్యురాలు**

**గ్రామీణాభివృద్ధి సేవలందిస్తున్నాం...**

సర్వోదయ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు విద్యా, వైద్యం, ఉపాధి, పర్యావరణం వంటి విషయాల్లో ముందుకు సాగేలా ప్రోత్సహిస్తున్నాము. ఐఆర్ఎస్ అధికారులం కలిసి ఇప్పటి వరకు జిల్లాలో ఆరు గ్రామాల్లో కార్యకలాపాలను ప్రారంభించాం. కరస్‌గుత్తి, ఎద్దుమైలారం, మునిపల్లి, మైనంపల్లి, హన్మంతరావుపేట్‌లలో కూడా సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అందరూ బాగుంటేనే మనం బాగుంటాము.. అనే నినాదం తో ముందుకెళుతున్నాం.

**డాక్టర్ సుధాకర్ నాయక్, సర్వోదయ సంస్థ**

**ఐఆర్ఎస్ అధికారుల సహకారం..**

ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్‌గా పనిచేసిన ఆర్‌కే పాలివాల్ అనే ఉన్నతాధికారి ఈ గంగ్లూర్ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఆయన స్ఫూర్తితో మరికొందరు ఐఆర్ఎస్ ఉన్నతాధికారులు సర్వోదయ సంస్థను స్థాపించి ఈ గ్రామంలోని మహిళలను సంఘటితం చేస్తున్నారు. ప్రతిష్ఠాత్మక ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి సంయుక్తంగా మహిళలకు పారిశ్రామిక ఉత్పత్తిలో ఉన్నత స్థాయి శిక్షణ ఇప్పించారు. ఈ సంస్థ సహకారంతో మహిళలు ముందడుగు వేస్తున్నారు.

## గణేశుడికే నిమజ్జనం ఎందుకు.. అదీ 10 రోజుల తరువాత చేయడానికి కారణం ఏంటి



రుతుధర్మాన్ననుసరించి జరుపుకొనే పండుగలలో వినాయక చవితి ముఖ్యమైంది. ఏటా భాద్రపద శుద్ధ చవితినాడు చవితి వస్తుంది. వేసవి తాపం తగ్గి, బీటలు వారిన భూమి వర్షపు జల్లులతో శక్తిని తెచ్చుకుని పచ్చదనాన్ని సంతరించుకునే సీజన్ ఇది. నదులలో నీరు నిండి పుడమి తల్లి పులకరిస్తుంది. బుధగ్రహానికి ఆకుపచ్చనివంటే ఇష్టం. వినాయకుడికి కూడా గడ్డిజాతి మొక్కలంటే ప్రీతి. అందుకే గరికతోనూ, వివిధ ఆకులతోనూ పూజిస్తుంటారు. గణేశుడి పూజకు ఒండ్రుమట్టితో చేసిన వినాయకుడి ప్రతిమను మాత్రమే ఉపయోగించడంలో ఒక విశేషముంది. అదేంటంటే.. ఎండాకాలం అయిపోయాక జలాశయాలన్నీ పూడికతో నిండి ఉంటాయి. బంకమట్టికోసం జలాశయాలలో దిగి మట్టిని తీయడం వల్ల పూడిక తీసినట్లు అవుతుంది. నీళ్లు తేటపడతాయి. అదీకాక మట్టిని తీయడం, దానితో విగ్రహాన్ని రూపొందించడం వల్ల మట్టిలోని మంచి గుణాలు శరీరానికి పడతాయి. ఒండ్రుమట్టిలో నానడం మంచిదని ప్రకృతి వైద్యులు కూడా చెబుతుంటారు. ప్రకృతి చికిత్సకు ఒండ్రుమట్టిని కూడా వాడుతుండటం మనకు తెలిసిందే. అయితే పదిరోజుల పాటు పూజలు చేసిన వినాయక విగ్రహాన్ని 11వ రోజున డప్పుచప్పుల, మేళతాళాల నడుమ నిమజ్జనానికి తీసుకెళ్తారు. నిమజ్జనం చేయడంలో వేదాంత రహస్యం కూడా ఉందండోయ్. ఈ ప్రపంచం పంచ భూతాలతో నిండింది. పంచ భూతాల నుంచి పుట్టిన ప్రతి సజీవ, నిర్జీవ పదార్థం ఎంత విలాసంగా గడిపినా.. చివరికి మట్టిలో కలిసిపోవాల్సిందే. అందుకే ప్రకృతి దేవుడైన వినాయక విగ్రహాలను మట్టితోనే చేసి నిమజ్జనం పూర్తి చేస్తారు.

పాచుర్యంలో రెండు కథలు..

వేదవ్యాసుడు మహాభారత కథను గణేశుడికి గణేశ్ చతుర్ది నుంచి అనంత చతుర్దశి వరకూ 10 రోజులు వినిపించాడని పురాణాలు చెబుతున్నాయి. వేదవ్యాసుడు కథ చెబుతున్నప్పుడు అతను కళ్లు మూసుకుని ఉండటంతో ఆ కథ ప్రభావం గణేశుడిపై ఎలా పడిందో తెలియలేదు. వేదవ్యాసుడు కథ పూర్తి చేసి..కళ్లు తెరిచినప్పుడు పదిరోజుల పాటు కథ వినడం వల్ల గణేశుడిలో వేడి పెరిగి.. జ్వరం వచ్చేసింది. దాంతో వేదవ్యాసుడు గణేశుడిని సమీపంలోని ఓ చెరువుకు తీసుకెళ్లి మునక వేయిస్తాడు. దాంతో వినాయకుడి శరీరంలో వేడి తగ్గుతుంది. అందుకే వినాయకుడిని ప్రతిష్ఠించిన 10 రోజుల వరకూ భక్తుల కోర్కెలు వినీ వినీ లంబోదరుడిలో శరీర వేడి పెరిగిపోతుందట.

చతుర్దశినాడు చెరువు, నది లేదా సముద్రంలో నిమజ్జనం చేసి శరీరాన్ని చల్లబరచడానికి నిమజ్జనం చేస్తారని ఓ కథ వివరిస్తోంది. ఇంకో కథ ప్రకారం.. వినాయక చవితికి భక్తుల పూజలు అందుకున్న గణేశుడు వారి కోర్కెలు తీర్చడానికి భూమిపైకి వస్తాడట. గణపతిని తిరిగి స్వర్గానికి పంపించడానికి జలవనరులే దగ్గరి మార్గం. అందుకే విఘ్నేశ్వరుడి విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేస్తారని మరో కథ ఉనికిలో ఉంది. ఆ రోజు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించి నీటిలో నిమజ్జనం చేస్తారన్నమాట. మట్టి విగ్రహాల్ని, పత్రిని నీటిలో నిమజ్జనం చెయ్యడం ద్వారా నీళ్లలో ఉండే క్రిమి కీటకాలు చనిపోతాయి. నిమజ్జనం పూర్తికాగానే దసరా సంబరాలు, బతుకమ్మ ఉత్సవాలూ ప్రారంభమవుతాయి.

## ఫ్రూట్ క్రీం



కావల్సినవి:

చిక్కని పెరుగు - కప్పు, క్రీం - పావుకప్పు, యాలకులపొడి - అరచెంచా, చక్కెర - రెండు టేబుల్‌స్పూన్లు, పిస్తా, బాదం పలుకులు - అరకప్పు, యాపిల్, అరటిపండు ముక్కలు - రెండూ కలిపి అరకప్పు, దానిమ్మగింజలు - పావుకప్పు, పాలు - టేబుల్‌స్పూను.

తయారీ:

క్రీంని ఓ గిన్నెలోకి తీసుకుని గిలకొట్టాలి. అందులో చక్కెరా, పెరుగూ వేసి మరోసారి కలపాలి. ఇప్పుడు పాలూ, యాలకులపొడీ, పండ్ల ముక్కలూ, బాదం, పిస్తా పలుకులు కలపాలి. గంటసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి.. వడ్డించేముందు దానిమ్మ గింజలు వేస్తే చాలు.

# లక్ష్మీ కాసుల గలగలలు



ప్రతియేటా లక్ష్మీ కాసును కొనడం ఆనవాయితీగా ఉంటుంది చాలామందికి. ఈ కాసులు కొన్ని పోగయ్యాక వాటితో సింపుల్ డిజైన్స్ చేయించుకోవచ్చు. ఇవి ప్లెయిన్ శారీస్, అనార్కలీ వంటి వాటి మీదకూ ధరించవచ్చు.

**మామిడికాసులు**

మామిడి పిందెల రూపంలో ఉండే కాసులను కూడా ఇప్పుడు తయారు చేస్తున్నారు. వీటిని మ్యాంగోమాల అంటారు. మన సంప్రదాయ వేడుకల్లో మామిడితో ఉన్న అనుబంధం వర్ణించలేనిది. అందుకే మామిడి పిందెల డిజైన్లు గల జరీ చీరలు, ఆభరణాలు ఎప్పుడూ గ్రాండ్‌గా ఉంటాయి. కనీసం 25 పైసలంత సైజ్‌లో ఉండే కాసులతో తయారయ్యే మాల 30 నుంచి 300గ్రాముల దాకా బరువు ఉంటున్నాయి.

**డైమండ్స్‌కు కాసుల జత**

కాసు హారానికి ఫ్లాట్ డైమండ్స్, సింగిల్ కట్ డైమండ్స్, కెంపులు, పచ్చలు, ముత్యాలతోనూ... ఇలా కంటెంపరరీగా డిజైన్ చేయించుకోవచ్చు. జూకాలు, గాజులు కూడా కాసులతో చేయించుకుంటే పట్టు చీరల మీదకు ఈ డిజైన్ ఆభరణాలు బాగా నప్పుతాయి.

# పూనా పవార్.. వయసు 86.. అయినా తగ్గేదేలే.. ధైర్యంగా..





శాంతాబాలు పవార్ కర్రసాము నేర్పిస్తూ...

అమ్మాయిలు ధైర్యంగా ముందడుగు వేయాలని, స్వీయరక్షణలో శిక్షణ పొందినప్పుడు ఆత్మస్థైర్యం దానంతట అదే పెంపొందుతుం దని పర్సనాలటీ డెవలప్‌మెంట్‌లో భాగంగా నిపుణులు చెప్తున్నారు. మహిళల రక్షణ కోసం పని చేసే విభాగాల ప్రముఖులందరూ ఈ విషయంలో అమ్మాయిల తల్లిదండ్రులను చైతన్యవంతం చేస్తూనే ఉన్నారు. సెల్ఫ్ డిఫెన్స్ కోర్సులను పాఠశాల స్థాయిలోనే ప్రవేశ పెట్టాలనే సూచనలు కూడా చేస్తున్నారు. అయితే వీటన్నింటి గురించి ఏ మాత్రం తెలియని ఓ మామ్మ శాంతాబాలు పవార్ తాను నివసించే పూనా నగరంలో అమ్మాయిలకు కర్రసాములో శిక్షణనిస్తోంది. శాంతాబాలు పవార్ వయసు 86. మహారాష్ట్రలో శరద్ పవార్ ఎంత ఫేమసో పూనాలో శాంతాబాలు పవార్ అంత పాపులర్. దాదాపు ఎనభై ఏళ్లుగా ఆమె పూనా వీధుల్లో విన్యాసాలు చేస్తోంది. ఎనిమిదేళ్ల వయసు నుంచి కర్రసాము, తాడు మీద నడవడం వంటి విన్యాసాలు చేస్తూ పెరిగింది. ఇప్పటికీ ముఖం మీద నుంచి మాస్కు తీసి చీరకట్టుకు దూర్చి, ఆమె రెండు చేతుల్తో కర్రలు పట్టుకుంటే గాలి పక్కకు తప్పుకుంటుంది.ఆమె చేతి ఒడుపు తగ్గలేదు, వేగమూ తగ్గలేదు. ఒకప్పుడు వీధి ప్రదర్శనకు మాత్రమే పరిమితం అయిన కళ... ఇప్పుడు పూనాలోని ఆడపిల్లలకు స్వీయరక్షణ విద్యగా మారింది. వారియర్ ఆజి దగ్గర శిక్షణ తీసుకుంటే తమ ఆడపిల్లల రక్షణ గురించి ఆందోళన పడాల్సిన అవసరం లేదని, భరోసా ఉంటుందని భావిస్తున్నారు తల్లిదండ్రులు. శాంతాబాలు అజి రెండేళ్ల కిందట కరోనా సమయంలో ప్రారంభించిన శిక్షణకేంద్రం ఇప్పుడు ఆడపిల్లల కర్రసాముతో ధైర్యవికాసం పొందుతోంది. అప్పట్లో సోనూసూద్, రితేశ్ దేశ్‌ముఖ్ వంటి సెలబ్రిటీలు శాంతా బాలూ పవార్‌ను అభినందనలతో ముంచెత్తారు.ఆమె చేతిలోని కర్రసాము యుద్ధవిద్య పూనా అమ్మాయిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడంతోపాటు ఇరవై మంది సభ్యులున్న ఆజి కుటుంబాన్ని పోషించడానికి ఆధారం అయింది. కరోనా కారణంగా ఆమె కొడుకులకు పని లేకపోవడం తో ఆమె కర్రసాముతోనే కుటుంబాన్ని పోషిస్తోం ది. 'ఇంట్లో ఊరికే కూర్చోవడం నాకు నచ్చదు" అంటోంది శాంతాబాలు పవార్. అన్నట్లు ఈ వారియర్ ఆజీలో నటనాకౌశలం కూడా దాగి ఉంది. 1972లో హేమమాలిని, ధర్మేంద్ర నటించిన హిట్ మూవీ 'సీత ఔర్ గీత'లో నటించింది.

# బలానికి భయ్యా.. రొయ్య



నాలుక లాగినప్పుడు నాలుగు రొయ్యలను నోట్లో వేసుకోకపోతే.. ఇక ఈ తిండి ఎందుకు? ఈ తిప్పలు దేనికి? అనిపిస్తుంది. రొయ్యల వేపుళ్లను తినే కాసేపైనా అనారోగ్య భయాలను పక్కనపెట్టండి. ఎందుకంటే రొయ్య.. బలానికి భయ్యా!

సముద్ర ఆహార ఉత్పత్తుల్లో రొయ్యలంత బలవర్ధకమైన ఆహారం మరొకటి లేదు. వీటిలోని సెలీనియం అనే పదార్థం క్యాన్సర్ కారక నివారిణి. క్యాన్సర్‌సెల్స్ అడ్డదిడ్డంగా పెరగకుండా అడ్డుకుంటుంది.

ఒమెగా త్రీ ఫ్యాటీ యాసిడ్స్‌లో ఉండే మేలిమి గుణం - గుండె శ్రేయస్సుకు పాటుపడటం. రక్తనాళాల్లో పేరుకుపోయిన చెడు కొవ్వును తొలగించి.. రక్తసరఫరాకు సులభమైన మార్గం ఏర్పాటు చేయటం. అధిక రక్తపోటును నిలువరించే గుణమూ ఫ్యాటీ యాసిడ్స్‌లో ఉంది. ఇన్నేసి బెనిఫిట్స్ రొయ్యల్లోనే అధికం.

శరీరానికే కాదు, మెదడుకూ మేత అవసరం. దానికి తగిన పోషకవిలువలు అందకపోతే వచ్చే సమస్యల్లో అల్జీమర్స్ ఒకటి. రొయ్యలు తింటే ఈ మతిమరుపు జబ్బు అంత త్వరగా రాదు.


దంతాలు, ఎముకలు బలంగా ఉన్నన్నాళ్లు మనిషి అంత త్వరగా నీరసపడిపోడు. ఇవి రెండూ అంత బలంగా ఉండాలంటే పుష్కలమైన కాల్షియం అవసరం. అది రొయ్యల్లో ఎక్కువ.

చర్మం ఎంత నాజూగ్గా ఉంటే అంత అందంగా కనిపిస్తారు. అయితే చర్మసౌందర్యానికి అవసరమైన 'విటమిన్ ఇ'ని అందించడంలో మాత్రం అంత శ్రద్ధ కనబరచం. ఆ లోటును భర్తీ చేయాలంటే రొయ్యల్ని తినాలి. వీటిలో విటమిన్-ఇ దండిగా దొరుకుతుంది. చర్మానికి కావాల్సిన పోషకాలు దొరికినప్పుడు మెరవమంటే ఎందుకు మెరవదు.

గుండెలోని రక్తనాళాల్లో పూడికలు రాకుండా, జ్ఞాపకశక్తి లోపించకుండా ఉండాలంటే విటమిన్ బి 12 అవసరం. రొయ్యలో ఈ రకం విటమిన్లకు కొదవ లేదు.

ప్రొటీన్లు శరీరశక్తికే కాదు, బాడీలో ఎక్కడ ఏ డ్యామేజ్ జరిగినా తిరిగి కోలుకోవడానికి తక్షణ అవసరం. అందుకని అత్యధిక ప్రొటీన్లు కలిగిన రొయ్యల్ని తింటే సరి.

మిగిలిన మాంసాహారంతో పోలిస్తే.. తక్కువ క్యాలరీలు ఉన్నది రొయ్యల్లోనే. సులువుగా జీర్ణమూ అవుతాయి. రొయ్యలు తిని బరువు కూడా తగ్గొచ్చు.



# బజాజ్ హౌజింగ్ ఐపీవో అదుర్స్

**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రముఖ నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థ బజాజ్ హౌజింగ్ ఫైనాన్స్ అదరగొట్టింది. స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావడానికి సిద్ధమైన సంస్థకు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించింది. సంస్థ జారీ చేసిన షేర్ల కంటే 63 రెట్ల అధిక బిడ్లు దాఖలయ్యాయి. అంటే ఐపీవోల చరిత్రలో ఇంతటి స్థాయిలో బిడ్లు రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. వాటాల విక్రయం ద్వారా రూ.6,560 కోట్ల నిధులను సేకరించాలనుకున్న సంస్థకు రూ.3.2 లక్షల కోట్ల బిడ్లు దాఖలయ్యాయి. అంటే జారీ చేసినదానికంటే 63.6 రెట్లు అధికంగా బిడ్లు దాఖలు కావడం విశేషం. మార్కెట్లో సెంటిమెంట్ బలంగా ఉండటం, ముఖ్యంగా రిటైల్ పెట్టుబడిదారులు అధికంగా బిడ్లు దాఖలు చేశారు. దేశ జీడీపీలో ఈ ఐపీవో వాటా ఒక్క శాతానికి పైగా ఉన్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను దేశ జీడీపీ రూ.295.36 లక్షల కోట్లుగా ఉన్నది.
బజాజ్ హౌజింగ్ ఫైనాన్స్ ఈ నెల 16న ఉదయం 10 గంటలకు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్కాబోతున్నది.
2008లో కోల్ ఇండియా జారీ చేసిన షేర్లకు రూ.2.36 లక్షల కోట్ల బిడ్లు దాఖలయ్యాయి.అలాగే ప్రీమియర్ ఎనర్జీ షేర్లకు రూ.1.48 లక్షల కోట్లు బిడ్లు రాగా, టాటా టెక్నాలజీ ఐపీవోకి రూ.1.56 లక్షల కోట్ల బిడ్లు వచ్చాయి. ఇప్పటి వరకు ఇవే గరిష్ఠ స్థాయి బిడ్డింగులు.

# ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ : ఐఫోన్ 15పై హాట్ డీల్స్



సెప్టెంబర్ 27 నుంచి ప్రారంభమయ్యే ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్‌లో ఐఫోన్ 15పై భారీ డిస్కౌంట్‌ను ఆఫర్ చేయనున్నారు. ఐఫోన్ 15 సిరీస్‌పై గ్రేట్ డీల్స్‌ను సొంతం చేసుకునేందుకు కస్టమర్లకు వెసులుబాటు కల్పిస్తున్నారు. ఐఫోన్ 15 ధర ప్రస్తుతం రూ. 69,900 కాగా, ఈ ధరను ఈ-కామర్స్ దిగ్గజం బిగ్ బిలియన్ డేస్ సేల్‌లో గణనీయంగా తగ్గించేందుకు కసరత్తు సాగిస్తోంది. ఈ సేల్‌లో ఐఫోన్ 15 సిరీస్, ఐఫోన్ 15, ఐఫోన్ 15 ప్లస్, 15 ప్రొ, 15 ప్రొ మ్యాక్స్ సహా అన్ని స్మార్ట్‌ఫోన్లపై గ్రేట్ డీల్స్ అందుబాటులో ఉంటాయని ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది. అయితే ఈ ఫోన్లపై ఎంతమేర డిస్కౌంట్లు ఉంటాయనే వివరాలను వెబ్‌సైట్ ఇప్పటివరకూ స్పష్టం చేయలేదు. దీనిపై సెప్టెంబర్ 23న మరిన్ని వివరాలు తెలుస్తాయని డిస్కౌంట్ ధరలను ఈ-కామర్స్ దిగ్గజం అదేరోజు వెల్లడించనుంది. గత ఏడాది విడుదలైన ఐఫోన్ 15 సిరీస్ ఈ సేల్‌లో మెరుగైన ధరలో లభిస్తుందని చెబుతున్నారు. ప్రొ మోడల్స్ బడ్జెట్ అనుకూలించేవారు గత ఏడాది ఐఫోన్ మోడల్‌ను సొంతం చేసుకోవడం బ్యాడ్ ఐడియా కాబోదని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు. ఐఫోన్ 16 తరహాలోనే ఐఫోన్ 15 ప్రొ, ప్రొ మ్యాక్స్ వంటి మోడల్స్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్‌ను పొందుతాయి.
యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్ సైతం 15 ప్రొ మోడల్స్‌లో అందుబాటులోకి రానుంది. మరోవైపు ఐఫోన్ 15 ప్రొ, ప్రొ మ్యాక్స్ ఉత్పత్తి కూడా నిలిపివేసినందున మిగిలిన డివైజ్‌లను అందుబాటు ధరలో వినియోగదారులు సొంతం చేసుకునే వెసులుబాటు ఉంది. ఐఫోన్ 15 సిరీస్ ఏ16 బయోనిక్ చిప్‌సెట్‌తో మల్టీ టాస్కింగ్, ఇన్‌స్టంట్ యాప్ లోడ్ వంటి ఫీచర్లను కలిగింది. ఐఫోన్లతో అద్భుత వీడియో రికార్డింగ్ సౌకర్యంతో పాటు మీరు ఓ మొబైల్ గేమర్ లేదా క్రియేటర్ అయితే ఐఫోన్ 15 సిరీస్ ప్రాసెసింగ్ పవర్ మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. ఇక ఐఫోన్ 16 సిరీస్ లేటెస్ట్ 18 చిప్‌సెట్‌తో కస్టమర్ల ముందుకొచ్చింది.

# గోల్డ్ ..75వేలు



**హైదరాబాద్- నవభూమి:** బంగారం ధరలు మరింత ప్రియమయ్యాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ తులం ధర రూ.440 అధికమై రూ.74,890కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.74,450గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర రూ.400 ఎగబాకి రూ.68,250 నుంచి రూ.68,650కి చేరుకున్నది. వెండి లక్ష రూపాయల దిశగా పయనిస్తున్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.2,000 అధికమై రూ.97 వేలకు చేరుకున్నది. గడిచిన నాలుగు రోజుల్లో బంగారం రూ.2,500 వరకు, వెండి రూ.8 వేల వరకు పెరిగింది.

# యమహా నుంచి సరికొత్త స్పోర్ట్స్ బైక్.. ధర తెలిస్తే షాకవ్వాల్సిందే!





**చెన్నై- నవభూమి:** స్పోర్ట్స్ బైకుల విభాగంలో పోటీని మరింత పెంచే ఉద్దేశంలో భాగంగా యమహా మోటర్ సరికొత్త బైకును అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్బన్ ఫైబర్ ప్యాటర్న్ గ్రాఫిక్‌తో రూపొందించిన ఆర్15ఎం బైకును మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 155 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు ధర రూ.2,08,300గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. అలాగే దీంతోపాటు ఆర్15 ఎం మెటాలిక్ గ్రే కలర్ మాడల్ ధర రూ.1,98,300.

# నెలాఖరులో భారత్ మార్కెట్లోకి వివో వీ40ఈ.. ఇవీ స్పెషిఫికేషన్స్..!



**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ వివో తన వివో వీ40ఈ ఫోన్‌ను ఈ నెలాఖరులో భారత్ మార్కెట్లో ఆవిష్కరించనున్నది. ఇప్పటికే భారత్ మార్కెట్లో ఉన్న వివో వీ40 ప్రో , వివో వీ 40 ఫోన్లతో వివో వీ40ఈ జత కలువనున్నది. రాయల్ బ్రాంజ్ కలర్ ఆప్షన్ లో అందుబాటులో ఉంటుందని భావిస్తున్నారు.కర్వ్ డ్ డిస్ ప్లేతోపాటు 4500 నిట్స్ పీక్ బ్రైట్ నెస్ తో వస్తుంది. ఆండ్రాయిడ్ 14 బేస్డ్ ఫన్ టచ్ ఓఎస్ 14 వర్షన్ పై పని చేస్తుందీ ఫోన్. మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ఎస్వోసీ ప్రాసెసర్ తో పని చేస్తుంది. 80వాట్ల ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 5500 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తున్న మిడ్ రేంజ్ ఫోన్ ఇది.

# ఇకపై సైబర్ స్కాంలకు కూడా ఇన్సూరెన్స్ .. రోజుకు ఎంతంటే..



**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయాలన్నా, బ్యాంకింగ్ సేవలను పొందాలన్నా ఇంటర్నెట్‌ని ఉపయోగిస్తున్నారు. అయితే టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళు కూడా గతంలో కంటే తెలివిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజు అనేక మందిని బోల్తా కొట్టించి సైబర్ కేటుగాళ్లు దోపిడీ చేస్తున్నారు. నేటి కొత్త తరం సాంకేతికత 'జెనరేటివ్ కారణంగా ఇది మరింత పెరుగుతందని టెక్ వర్గాలు అంటున్నాయి. దీని ద్వారా శబ్దాలు, వీడియోలు, చిత్రాలను సులువుగా రూపొందించడం ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని అంటున్నారు. అయితే ఇలాంటి మోసాల బారిన పడిన కంపెనీలు లేదా వ్యక్తులకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పిస్తామని పలు సంస్థలు ప్రకటించాయి.సైబర్ మోసాల నుంచి..ఇన్సూరెన్స్ కంపెనీలు ఇప్పుడు సైబర్ సెక్యూరిటీ కవర్‌లను సాచెట్‌ల( పేరుతో అందిస్తున్నాయి. ఇవి పెరుగుతున్న సైబర్ మోసాల నుంచి రక్షించడానికి రూపొందించబడ్డాయి. వీటి కోసం రోజుకు కేవలం 3 రూపాయల ఖర్చుతో లభించే ఈ బీమా కవర్లు అందుబాటులో ఉన్నాయి. వీటిని తీసుకోవడం ద్వారా సైబర్ దోపిడీ, ఆన్‌లైన్ దోపిడీల నుంచి ఆయా వ్యక్తులు లేదా వ్యాపారాలను రక్షించుకోవచ్చు. మాల్వేర్, సైబర్ దాడులకు వ్యతిరేకంగా వ్యాపారాలు, వ్యక్తులను రక్షించడమే సైబర్ సాచెట్ ఇన్సూరెన్స్ పాలసీ లక్ష్యమని జనరల్ ఇన్సూరెన్స్ డైరెక్టర్ పార్థనిల్ ఘోష్ అన్నారు. మార్కెట్లో ఇలాంటి నష్టాలు పెరుగుతున్న నేపథఅయంలో ఆయా సైబర్ దాడులకు కవరేజ్ అందించబడుతుందని లొంబార్డ్ ప్రతినిధులు తెలిపారు.

# టాప్-10లో తొమ్మిది సంస్థల ఎం-క్యాప్ రూ.2 లక్షల కోట్లు వృద్ధి.. నష్టపోయిన ఎల్ఐసీ.. ఇవీ వివరాలు..!

**న్యూఢిల్లీ- నవభూమి:** గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈలోని టాప్-10 సంస్థల్లో తొమ్మిది సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2,01,552.69 కోట్లు పెరిగింది. ఈక్విటీ మార్కెట్లలో ఇన్వెస్టర్ సెంటిమెంట్ 'బుల్లిష్'గా ఉండటంతో భారతీ ఎయిర్‌టెల్ భారీగా లబ్ధి పొందింది. గతవారం బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 1,707.01 పాయింట్లు (2.10 శాతం) లబ్ధి పొందింది. గురువారం బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 83,116.19 పాయింట్ల జీవిత కాల గరిష్టాన్ని తాకింది.
భారతీ ఎయిర్ టెల్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.54,282.62 కోట్లు వృద్ధి చెంది రూ.9,30,490.20 కోట్లకు చేరుకున్నది. ఐసీఐసీఐ బ్యాంకు మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.29,662.44 కోట్లు పెరిగి రూ.8,80,867.09 కోట్ల వద్ద స్థిర పడింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థ ఎం-క్యాప్ రూ.23,427.12 కోట్లు పుంజుకుని రూ.16,36,189.63 కోట్ల వద్ద ముగిసింది.హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.22,438.6 కోట్ల వృద్ధితో రూ.6,89,358.33 కోట్ల వద్ద ముగిసింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.22,093.99 కోట్లు పెరిగి రూ.12,70,035.77 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.17,480.49 కోట్లు పుంజుకుని రూ.8,07,299.55 కోట్ల వద్ద స్థిర పడింది.
ఐటీసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.15,194.17 కోట్లు పెరిగి రూ.6,42,531.82 కోట్ల వద్ద నిలిచింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎం-క్యాప్ రూ.9,878.19 కోట్లు పుంజుకుని రూ.19,92,160.61 కోట్ల వద్ద ముగిసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఎం-క్యాప్ రూ.7,095.07 కోట్ల గ్రోత్ తో రూ.7,05,535.20 కోట్లకు చేరుకున్నది.భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,004.38 కోట్లు నష్టంతో రూ.6,54,004.76 కోట్ల వద్ద నిలిచింది. గత వారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీలో టాప్-10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్

# సైబర్ మోసాలకు కూడా ఇన్సూరెన్స్.. కేవలం రూ.3తోనే మీ డబ్బులను భద్రంగా కాపాడుకోవచ్చు!




**న్యూఢిల్లీ- నవభూమి:** సైబర్ మోసాలు రోజురోజుకూ ఎక్కువైపోతున్నాయి. పెరుగుతున్న టెక్నాలజీనే ఆసరాగా తీసుకొని సైబర్ నేరగాళ్లు దాడులకు తెగబడుతున్నారు. దీంతో బాధితులకు రక్షణే లేకుండాపోతున్నది. అందుకే ఇన్సూరెన్స్ కంపెనీలు ఇప్పుడు ఈ కోణంలో దృష్టి పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఆయా బీమా సంస్థలు.. సైబర్ మోసాలకు రక్షణగా సాషే ప్రోడక్ట్స్‌ను పరిచయం చేస్తున్నాయి. ఈ రిస్క్ కవరేజీలు కేవలం రోజుకు రూ.3కే లభిస్తుండటం విశేషం. వ్యక్తులు, వ్యాపార సంస్థల అవసరాలకు తగ్గట్టుగా ఈ చిన్న ప్లాన్లను ఇన్సూరర్లు రూపొందిస్తున్నారు.

**ఏఐ వినియోగంతో..**

మోసగాళ్ల చేతికి సాంకేతిక పరిజ్ఞానం చిక్కితే జరిగే నష్టం అపారం. ఇప్పుడు సైబర్ ప్రపంచంలో కృత్రిమ మేథస్సు (ఏఐ)తో మోసగాళ్లు చేస్తున్నదిదే. జెన్ఏఐ సాయంతో నకిలీ వీడియోలు, వాయిస్ క్లోనింగ్‌లు, టెక్స్ సందేశాలు, ఎస్ఎంఎస్ ఫిషింగ్, ఫ్రాడ్ కాల్స్, ఫేస్ మార్ఫింగ్, ఓటీపీ చోరీలకు దిగుతున్నారు. వీటితో వ్యక్తులు, సంస్థలను బెదిరిస్తూ అక్రమాలకు తెగబడుతున్నారని హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ డైరెక్టర్ పార్థనీల్ ఘోష్ అన్నారు. ఈ సంస్థ ఇప్పటికే మాల్‌వేర్, రాన్సమ్‌వేర్ సైబర్ దాడులను ఎదుర్కొనేలా వ్యక్తులు, వ్యాపార సంస్థల కోసం ఓ సైబర్ సాషే ఇన్సూరెన్స్ పాలసీని తీసుకొచ్చింది.

**పెరుగుతున్న మార్కెట్ విలువ**

భారతీయ సైబర్ ఇన్సూరెన్స్ మార్కెట్ విలువ 2023లో 50-60 మిలియన్ డాలర్లుగా ఉన్నది. అయితే ఇది రాబోయే ఐదేండ్లలో 27-30 శాతం వృద్ధి చెందవచ్చని డెలాయిట్ ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో అంచనా వేసింది. ఇందుకు తగ్గట్టుగానే ఎస్బీఐ జనరల్, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో, ఐసీఐసీఐ లాంబార్డ్‌లు సైబర్ రిస్క్ కవరేజీ ప్లాన్లను తీసుకొస్తున్నాయి. కాగా, జెన్ఏఐ దన్నుతో జరుగుతున్న మోసాల వల్ల ఆర్థికపరమైన నష్టమేగాక సంస్థల పరపతి, వ్యక్తుల పరువు-ప్రతిష్ఠలూ దెబ్బతింటున్నాయని ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ లాక్టోన్ ఇండియా సీఈవో సందీప్ దాడియా అన్నారు. బలమైన లీగల్ ప్రొటెక్షన్ కోసం ఓ డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టాన్నీ తేవాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వ్యక్తిగత సమాచార చోరీకి కంపెనీలదే బాధ్యతన్నారు.

**జాగ్రత్తలు అవసరం**

పెరుగుతున్న సైబర్ దాడుల నేపథ్యంలో అంతా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఏఐ ఆధారిత టెక్నాలజీతో నకిలీ మాయాజాలం నడుస్తున్నదని, అన్ని రకాలుగా నష్టపరుస్తున్నారంటున్నారు. అందుకే ఆన్‌లైన్‌లో ఉన్నప్పుడు చాలాచాలా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అనవసరపు లింక్స్‌పై క్లిక్ చేయవద్దని, అపరిచితుల కాల్స్, మెసేజ్‌లకు స్పందించకపోవడమే ఉత్తమమంటున్నారు. వ్యక్తిగత ఫోటోలను సైతం తరచూ ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయవద్దని, కొత్తకొత్త యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని కూడా హెచ్చరిస్తున్నారు. విలువైన సమాచారాన్ని (బ్యాంక్ ఖాతా నెంబర్లు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు) స్మార్ట్‌ఫోన్లలో సేవ్ చేసుకోవడం, ఈ-మెయిల్స్‌లో పంపించుకోవడం మానేయడం మంచిదనీ సైబర్ ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

**ఏమిటీ సాషే ఇన్సూరెన్స్**

సాషే ఇన్సూరెన్స్ ప్రొడక్ట్ అంటే చిన్న పరిమాణంలో ఉండే బీమా పాలసీలు. సాధారణంగా ఇవి ప్రయాణం, దొంగతనం, గృహోపకరణాలు, ఫిట్నెస్ వంటి కొన్ని అంశాలకు సంబంధించి రూపొందుతాయి. ఇంకా చెప్పాలంటే పరిమిత శ్రేణిలో, తాత్కాలిక రక్షణే లక్ష్యంగా ఈ బీమా పాలసీలుంటాయి. సంప్రదాయ ఇన్సూరెన్స్ పాలసీలైతే జీవిత, ఆరోగ్య, ఆస్తుల వంటి అంశాలపై సమగ్ర రీతిలో లభిస్తాయి.
ఏయే కవరేజీలు?
ఐడెంటిటీ చోరీ, సైబర్ స్టాకింగ్, ఫిషింగ్, ఈ-మెయిల్ స్పూఫింగ్, సైబర్ దోపిడి, నిధుల దొంగతనం, డాటా అపహరణ వంటి వాటికి ఈ బీమా రక్షణ కల్పిస్తుంది. న్యాయపరమైన వ్యవహారా ల్లో ఖర్చులను బీమా సంస్థలే ఇస్తాయి.

# 2 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతలు.. ఆ విభాగంలోనే ఎక్కువంట!



**న్యూఢిల్లీ- నవభూమి:** జీఎస్టీ ఎగవేతలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.2.01 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతలకు పాల్పడినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటిలిజెన్స్(డీజీజీఐ) గుర్తించింది. 2024-25లో 6,084 కేసులు జీఎస్టీ ఎగవేతలకు పాల్పడినట్లు, వీటి విలువ రూ.2.01 లక్షల కోట్లని శనివారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.
సేవల విభాగంలో ఆన్‌లైన్ గేమింగ్, బీఎఫ్ఎస్ఐ, ఇనుము, రాగి, తుక్కు వంటి విభాగాల్లో జీఎస్టీ ఎగవేతలు అధికంగా ఉంటాయని పేర్కొంది. 2022-23లో నమోదైన 4,872 కేసుల జీఎస్టీ ఎగవేత రూ.1.01 లక్షల కోట్ల కంటే ఇది రెండింతలు పెరిగింది. జీఎస్టీ ఎగవేతల్లో పన్నుకు సంబంధించినవి 46 శాతంగా ఉండగా, 20 శాతం ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, 19 శాతం ఐటీసీకి సంబంధించినవని పేర్కొంది. ఆన్‌లైన్ గేమింగ్ రంగంలో రూ.81 వేల కోట్ల ఎగవేతలు జరిగాయని తెలిపింది.

# 50 ఏళ్ల తర్వాత మీరు పని చేయాల్సిన అవసరం లేదు.. ఇలా చేస్తే మీ డబ్బే మిమ్మల్ని పోషిస్తుంది




**న్యూఢిల్లీ- నవభూమి:** మీరు కొన్నేళ్ల పాటు పొదుపు చేసి తర్వాత రెస్ట్ తీసుకోవాలని చూస్తున్నారా. అయితే ఈ వార్త మీ కోసమే. ఎందుకంటే దీనిలో 50 ఏళ్ల తర్వాత రిటైర్‌మెంట్ ప్రకటించి నెలకు లక్ష రూపాయల వరకు పెన్షన్ తీసుకోవచ్చు. అంతేకాదు ప్రతి నెలా మీ ఖాతా నుంచి డబ్బును ఉపసంహరించుకున్నప్పటికీ, మీ కార్పస్ తగ్గడానికి బదులు పెరుగుతూనే ఉంటుంది. మీరు కూడా ఈ విధానాన్ని పాటించాలంటే ఏం చేయాలి, నెలకు ఎంత పెట్టుబడి పెట్టాలనే విషయాలను ఇప్పుడు చుద్దాం.
ప్రస్తుతం అనేక మంది సేవింగ్స్ గురించి ప్లాన్ చేస్తుంటారు. మరికొంత మంది అయితే రిటైర్‌మెంట్ గురించి పొదుపు( %ఋజఅఅస్త్రం% ) చేస్తారు. కానీ ఇంకొంత మంది మాత్రం తక్కువ వయస్సులో ఉన్నప్పుడే పొదుపు(%అఅజవర్ఎవత్ం%) చేయడం ప్రారంభించి 50 ఏళ్ల వయస్సులోనే పదవీ విరమణ చేస్తారు. ఆ సమయంలో కూడా వారు ప్రతి నెలా రూ. 1 లక్ష వరకు పెన్షన్ పొందవచ్చు. అంతేకాదు ప్రతి నెలా ఖాతా నుంచి డబ్బును ఉపసంహరించుకున్నప్పటికీ, మీ కార్పస్ తగ్గడానికి బదులు పెరుగుతూనే ఉంటుంది. అయితే మీరు కూడా ఈ విధానాన్ని పాటించాలని చూస్తే, అందుకోసం ఏం చేయాలి, నెలకు ఎంత పెట్టుబడి పెట్టాలనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.
వడ్డీ రూపంలోనే..ఇందుకోసం సిస్టమాటిక్ విత్‌డ్రావల్ ప్లాన్ (%ాబ్రూ%) అనేది మంచి ఎంపిక. దీనిలో మీరు మీ మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ నుంచి క్రమం తప్పకుండా డబ్బును విత్‌డ్రా చేసుకునే సౌకర్యం ఉంది. %ాబ్రూ% మీకు సాధారణ ఆదాయాన్ని ఇస్తుంది. దీంతోపాటు మీ డబ్బు కూడా పెరుగుతుంది. అయితే దీనిలో మీరు కొంచెం ప్రణాళికతో పెట్టుబడి పెడితే, మీరు ముందుగానే రిటైర్ అవ్వవచ్చు. ఆ తర్వాత మీరు భారీగా పెన్షన్ పొందుతూ మీ మొత్తం జీవితాన్ని హాయిగా గడపవచ్చు

**ప్రతి నెలా**

అందుకోసం మీరు 25 ఏళ్ల వరకు మ్యూచువల్ ఫండ్స్‌లో ప్రతి నెలా రూ. 15,000 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. మ్యూచువల్ ఫండ్స్‌లో సగటున 10-15 శాతం రాబడి అందుబాటులో ఉంది. కానీ ఇక్కడ 10 శాతం సగటు రాబడిని పొందుతామని అనుకుంటే 25 సంవత్సరాలలో మీరు మొత్తం రూ. 45 లక్షలు పెట్టుబడి పెడతారు. దానిపై మీకు 1.55 కోట్ల రూపాయల వడ్డీ లభిస్తుంది. ఈ విధంగా మీరు 50 సంవత్సరాల వయస్సు వచ్చే సరికి దాదాపు రూ. 2 కోట్ల కార్పస్‌ను పొందే ఛాన్స్ ఉంటుంది.

**విత్ డ్రా ఎంత?**

ఈ క్రమంలో మీరు 50 సంవత్సరాల వయస్సులో పదవీ విరమణ చేసి, ప్రతి నెలా రూ.1 లక్ష పెన్షన్ తీసుకోవడం ప్రారంభించవచ్చు. మీరు ఈ విధంగా చేస్తే మీ ఖాతాలో డబ్బు తగ్గుతుందని భావిస్తారు. కానీ అది నిజం కాదు. నిజానికి ఈ కాలంలో మీ డబ్బు తగ్గడానికి బదులుగా క్రమంగా పెరుగుతూనే ఉంటుంది. మీరు 50 ఏళ్ల వయస్సు నుంచి ప్రతి నెలా రూ. 1 లక్ష విత్‌డ్రా చేస్తే, తర్వాతి 20 ఏళ్లలో అంటే 70 ఏళ్ల వరకు, మీరు దాదాపు రూ. 2.40 కోట్లు విత్‌డ్రా చేసుకోవచ్చు. ఆ తర్వాత మీరు 20 సంవత్సరాల తర్వాత మీ ఖాతాను తనిఖీ చేసినప్పుడు, మీ మనీ తగ్గకుండా, డబ్బు పెరిగి దాదాపు రూ.3 కోట్లకు చేరుకుంటుంది.

**ఉపసంహరించుకున్నప్పటికీ ఎలా పొందుతాము**

ఖాతా నుంచి డబ్బులు తీసుకున్నప్పటికీ తగ్గకుండా ఎందుకు పెరుగుతుందని చాలామంది అయోమయంలో ఉంటారు. వాస్తవానికి మీరు ఉపసంహరించుకునే డబ్బు మీ మొత్తం కార్పస్‌పై మీకు వచ్చే వడ్డీలో దాదాపు సగం. అంటే మీ కార్పస్‌కు సగం వడ్డీ ఇంకా జోడించబడుతోంది. మీరు వడ్డీని పొందుతున్నారు. అంటే రాబోయే సంవత్సరాల్లో దానిపై రాబడి ద్వారా మీ డబ్బు తగ్గడానికి బదులు పెరుగుతూనే ఉంటుంది. అయితే ఈ ప్లాన్ లో మీ వయస్సు 25 లేదా 30 ఏళ్ల ఉన్నప్పటి నుంచి సేవ్ చేసుకుంటే సులభంగా ఉంటుంది.

# బంధన్ బిజినెస్ సైకిల్ ఫండ్




**న్యూఢిల్లీ- నవభూమి:** బంధన్ మ్యూచువల్ ఫండ్.. బిజినెస్ సైకిల్ ఫండ్‌ను తీసుకు వచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. మార్కెట్ పరిస్థితులు, రిస్క్‌లకు అనుగుణంగా ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను తీర్చిదిద్దింది. ఈ ఫండ్ ముగింపు తేదీ సెప్టెంబరు 24. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000.



## అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడో హింట్ ఇచ్చిన సీఎం



**న్యూఢిల్లీ- నవభూమి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సూచనప్రాయంగా తెలిపారు. నవంబర్ రెండో వారంలో ఉండే అవకాశాలున్నాయని చెప్పారు. రెండు విడతలుగా ఎన్నికలు ఉండవచ్చని అన్నారు. మహాయుతి కూటమి మధ్య సీట్ల షేరింగ్ అనేది ప్రతిభ, గుడ్ స్ట్రైక్ రేట్ ఆధారంగానే ఉంటుందని తెలిపారు. ముంబైలోని అధికార 'వర్ష' నివాసంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, రాబోయే 8-10 రోజుల్లో బీజేపీ, భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల పంపకాలు ఖరారవుతాయని చెప్పారు. రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం బీజేపీ 150 నుంచి 160 సీట్లలో పోటీ చేయనుంది. అదే జరిగితే ఎన్సీపీ, శివసేనకు 128-138 సీట్లు దక్కుతాయి. కాగా, తమ ప్రభుత్వానికి మహిళల మద్దతు పుష్కలంగా ఉందని షిండే తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల మధ్య సమతుల్యతను తమ ప్రభుత్వం పాటిస్తున్నట్టు చెప్పారు. స్కిల్డ్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద 1.5 లక్షల మంది యువకుల ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని, వీరికి రూ.6,000 నుంచి రూ.10,000 స్టయిఫండ్ వస్తుందని చెప్పారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర లోక్‌సభ ఎన్నికల్లో అధికార కూటమికి గట్టి దెబ్బ తగిలింది. బీజేపీ సీట్ల సంఖ్య 9కి పడిపోయింది. షిండే శివసేన 7 సీట్లు గెలుచుకోగా, అజిత్ పవార్ ఎన్సీపీ కేవలం ఒకే సీటుకు పరిమితమైంది.

## మోడీ అలా నిర్ణయం తీసుకున్నారో లేదో వంట నూనెల ధరల్ని పెంచేశారు




**న్యూఢిల్లీ- నవభూమి:** వంటింటిపై మరోసారి షాకింగ్ అస్త్రాన్ని ప్రయోగించింది మోడీ సర్కారు. మొన్నటి వరకు మండిన వంటనూనెల ధరలు.. అంతర్జాతీయంగా చోటుచేసుకున్న మార్పుల పుణ్యమాఅని ఇప్పుడిప్పుడే అందుబాటులోకి వస్తున్న సంగతి తెలిసిందే. కొద్ది నెలల క్రితం వరకు లీటరు సన్ ఫ్లవర్ ఆయిల్ 150వరకు ఉండగా.. ఇటీవల కాలంలో రూ.120 వరకు తగ్గింది. కొన్ని బడా సూపర్ మార్కెట్లలో మాత్రం లీటరు సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.115 చొప్పున అమ్ముతున్న పరిస్థితి. ఈ ధరలతో సామాన్యుల మీద ఆయిల్ భారం తగ్గే పరిస్థితి. కేంద్రప్రభుత్వం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వంట నూనెల మీద 20 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీని విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో.. ఒక్కసారిగా ధరల భారం దాదాపు 20 శాతం పెరగనుంది. అంతేకాదు. శుద్ధిచేసిన పామాయిల్.. సోయా.. సన్ ఫ్లవర్ ఆయిల్ పై దిగుమతి సుంకం ఇప్పటివరకు 12.5 ఉండగా.. దాన్ని ఏకంగా 32.5 శాతానికి పెంచేశారు. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. దిగుమతి సుంకం మాత్రమే కాదు అగ్రికల్చర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్.. డెవలప్ మెంట్ సెస్ లతో పాటు సోషల్ వెల్ఫేర్ సర్ ఛార్జ్ లు అదనంగా వడ్డించనున్నారు. దీంతో దగ్గర్లో దగ్గర 20-30 శాతం వరకు వంట నూనెల ధరలు పెరగనున్నాయి. అంటే.. లీటరు పాకెట్ మీద రూ.20 - 30కు పైనే ధరలు పెరిగే అవకాశం ఉందని చెప్పాలి. విదేశాల నుంచి తక్కువ ధరకు ముడి.. శుద్ధి చేసిన నూనెల దిగుమతులతో భారత్ లో నూనె గింజల ధరలు క్షీణిస్తున్నాయి. దీంతో.. రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో వారికి మేలు చేకూరేలా తాజా నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటించింది. కొట్టేసిన టీహైకోర్టు ప్రపంచంలో వంట నూనెల్ని అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ మొదటిస్థానంలో ఉంది. మొత్తం వినియోగంలో దిగుమతుల వాటా ఏకంగా 70 శాతం ఉండనుంది. పామాయిల్ వాటా 50 శాతం వరకు ఉంది. ఇక.. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వంట నూనెల విషయానికి వస్తే.. ఇండోనేషియా.. మలేషియా.. థాయ్లాండ్ నుంచి పామాయిల్.. అర్జెంటీనా.. బ్రెజిల్.. రష్యా.. ఉక్రెయిన్ నుంచి సోయా, సన్ ఫ్లవర్ ఆయిల్ భారత్ కు దిగుమతి అవుతున్నాయి. మోడీ సర్కారు తీసుకున్న నిర్ణయంతో రానున్న రోజుల్లో దిగుమతి అయ్యే వంట నూనెలు ప్రాసెస్ అయి.. ప్యాకింగ్ పూర్తై మార్కెట్ లోకి వచ్చిన తర్వాత నుంచి ధరల పెంపు ఉండాల్సి ఉంది. దీని కోసం కనీసం రెండు వారాల సమయం పడుతుంది. కానీ.. ఎప్పుడైతే కేంద్రం సుంకం నిర్ణయాన్ని వెల్లడించిందో.. ఆ వెంటనే వంట నూనెల ధరల్ని పెంచేస్తూ వ్యాపారులు నిర్ణయం తీసుకున్నారు. వంట నూనెల పాకెట్ల మీద ఎంఆర్ పీ ఎక్కువగా ఉంటుందన్న విషయం తెలిసిందే. దీంతో.. ఎమ్మార్పీకి సంబంధించి ఎలాంటి చిక్కులు ఎదురయ్యే అవకాశం లేదు. దీన్నిఅసరాగా చేసుకొని లీటరుకు రూ.20 చొప్పున ధరల్ని పెంచేసి అమ్మేస్తున్నారు. నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న కుటుంబానికి కనిష్ఠంగా 4.. గరిష్టంగా ఆరు పాకెట్ల వంట నూనెల్ని వినియోగిస్తుంటారు. అందరిమీదా భారం పడేలా మోడీసర్కారు తాజా నిర్ణయం ఉందని చెప్పాలి.

## హర్యానా ప్రజలను భయపెడుతున్న బీజేపీ




**న్యూఢిల్లీ- నవభూమి:** దేశంలో రెండు రాష్ట్ర శాసనసభలకు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు ఉత్కంఠను రేపుతున్నాయి. బీజేపీ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన తరువాత జరుగుతున్న ఎన్నికలు కాబట్టి ఒక విధంగా కేంద్ర ప్రభుత్వం మీద ప్రజల ఆలోచన అనో తీర్పు అనో ఇండియా కూటమి చెప్పదలచింది అని అంటున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికలు ఎపుడూ లోకల్ ఇష్యూల మీద జరుగుతాయి. కర్ణాటక చూస్తే అసెంబ్లీలో బీజేపీ ఓడినా ఎంపీ ఎన్నికల్లో గెలిచింది. అలాగే తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఎనిమిది సీట్లకు పరిమితం అయిన బీజేపీ లోక్ సభ ఎన్నికల్లో ఎనిమిది ఎంపీ సీట్లను సొంతం చేసుకుంది. అందువల్ల అసెంబ్లీ ఎన్నికల తేరు వేరు అని సరిపెట్టుకోవచ్చు. కానీ బీజేపీని మోడీని ఎందుకు టార్గెట్ చేస్తారు అంటే మోడే అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చాలా గట్టిగా చేస్తారు. పైగా ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరూ బీజేపీ తరఫున ముందే ప్రకటించారు. లోకల్ లీడర్ షిప్ ని అలా ఉంచి మోడీ అమిత్ షావే రంగంలోకి దిగుతారు. దాంతో ఆ క్రెడిట్ అయినా లేక డెబిట్ అయినా అది కచ్చితంగా బీజేపీ ఖాతాలోనే పడుతున్నారు. మరో వైపు చూస్తే కాశ్మీర్ ఎన్నికలు పూర్తిగా కేంద్రంలోని బీజేపీకి రిఫరెండమే. ఎందుకంటే 370 అధికరణను బీజేపీ రద్దు చేసింది. దానికి స్థానిక ప్రజలు కోరుకున్నారు అంది. తమకే అందరి మద్దతు అని కూడా చెప్పింది. కొట్టేసిన టీహైకోర్టు అలా కాశ్మీరు ఫలితం ఏదైనా బీజేపీ డైరెక్ట్ గానే బాధ్యత తీసుకోవాలి. ఇక హర్యానా విషయం తీసుకుంటే రెండు సార్లు బీజేపీ అధికారంలో ఉంది. దాంతో ఈసారి గెలవకపోతే బీజేపీ మీద జనాలకు మొత్తింది అంటారు. మోడీ వచ్చి ప్రచారం చేసినా జనాలు మాట వినలేదు అంటే కేంద్రం మీద కూడా వ్యతిరేకత ఉంది అని అంటారు. ఈ విషయాలు ఏవీ బీజేపీకి తెలియనివి కాదు, అందుకే ఈ రెండు రాష్ట్రాలు తమకు ఎంత ప్రతిష్టాత్మకమో తెలిసిన మీదటనే వ్యూహాలు మార్చుకుంటూ ముందుకు సాగుతోంది. హర్యానా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన నరేంద్ర మోడీకి అక్కడ పరిస్థితి అర్థం అయిందా అన్నది కూడా చర్చకు వస్తోంది. అందుకే ఆయన తొలి సభలోనే ప్రజలను హెచ్చరించే విధంగా మాట్లాడారు. పొరపాటున కాంగ్రెస్ కి ఓటు వేస్తే హిమాచల్ ప్రదేశ్ పరిస్థితి వస్తుందని కూడా భయపెట్టేలా మాట్లాడారు అని అంటు న్నారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం దివాళా తీసిందని అదే పరిస్థితిని తెచ్చుకోవద్దు అని మోడీ గట్టిగానే చెబుతున్నారు. కాంగ్రెస్ కి ఓటేస్తే హర్యానా కూడా దివాళా తీస్తుందని కూడా చెప్పకనే చెబుతున్నారు. మరి ప్రజలకు ఇవన్నీ పట్టింపు ఉంటాయా హిమాచల్ ప్రదేశ్ లో జరిగింది అని హర్యానాలో ప్రజలు కాంగ్రెస్ కి ఓటు వేయకుండా ఉంటారా అన్నదే చర్చ. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం పరిస్థితులు ఉంటాయి. అంతే కాదు రాజకీయ పరిస్థితులు పరిణామాలు పర్యవసానాలు అన్నీ చూసిన మీదటనే ప్రజలు ఒక నిర్ణయం తీసుకుంటారు. హర్యానాలో బీజేపీకి పదేళ్ళు చాన్స్ ఇచ్చిన ప్రజలు మార్పు కోసం చూస్తున్నారు అనుకుంటే కాంగ్రెస్ కి కచ్చితంగా అవకాశం వస్తుంది.

## వచ్చే వారం మార్కెట్లోకి రానున్న ఐపీఓలు ఇవే.. ఈసారి ఎన్నంటే..




**న్యూఢిల్లీ- నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లో మళ్లీ ఐపీఓల వారం రానే వచ్చింది. ఈసారి సెప్టెంబర్ 16 నుంచి ప్రారంభమయ్యే వారంలో 7 కొత్త మొదలుకానున్నాయి. మెయిన్‌బోర్డ్ విభాగం నుంచి రెండు వస్తుండగా, కొత్త వారంలో ఇప్పటికే ప్రారంభించిన 5 ుబ్బును పెట్టుబడి పెట్టడానికి అవకాశం ఉంది. మెయిన్‌బోర్డ్ విభాగంలో, ఆర్కేడ్ డెవలపర్లు, నార్తర్న్ ఆర్క్ క్యాపిటల్ సెప్టెంబర్ 16న ప్రారంభమవుతాయి. రాబోయే వారంలో 13 కంపెనీల షేర్లు లిస్ట్ కానున్నాయి. వీటిలో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్‌తో సహా 4 కంపెనీలు మెయిన్‌బోర్డ్ విభాగానికి చెందినవి. ఈ నేపథ్యంలో కొత్త వారంలో ఏయే కంపెనీలు ప్రారంభిస్తున్నాయో తెలుసుకుందాం.

**పెలాట్రో:** ఈ ఇష్యూని ఒక్కో షేరుకు రూ. 190-200 ధరలో నిర్ణయించారు. 600 షేర్ల లాట్ సైజు అందుబాటులో ఉంటుంది. ఈ సెప్టెంబర్ 16న ప్రారంభమై, సెప్టెంబర్ 19న ముగుస్తుంది. రూ. 55.98 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. సెప్టెంబర్ 24న షేర్ల లిస్టింగ్ జరగవచ్చు.

నార్తర్న్ ఆర్క్ క్యాపిటల్ ఇది సెప్టెంబర్ 16 నుంచి మొదలు కానుండగా, సెప్టెంబర్ 19న ముగియనుంది. రూ.777 కోట్ల పబ్లిక్ ఇష్యూకు వేలం జరగనుంది. షేర్ల లిస్టింగ్ సెప్టెంబర్ 24న ఉంటుంది. ఒక్కో షేరు ధర రూ. 249-263. లాట్ పరిమాణం 57 షేర్లు.

**ఓసెల్ డివైజెస్ :** ఈ కంపెనీ రూ.70.66 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈ ఇష్యూ కూడా సెప్టెంబర్ 16న తెరవబడి, సెప్టెంబర్ 19న ముగుస్తుంది. ఈ షేర్లు సెప్టెంబర్ 24న ో లిస్ట్ కావచ్చు. బిడ్డింగ్ కోసం ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 155-160. లాట్ పరిమాణం 800 షేర్లు.

ఆర్కేడ్ డెవలపర్స్ ఇష్యూ పరిమాణం రూ. 410 కోట్లు. ఈ సెప్టెంబర్ 16న ప్రారంభమై, సెప్టెంబర్ 19న ముగుస్తుంది. దీని బిడ్డింగ్ కోసం ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 121-128. లాట్ పరిమాణం 110 షేర్లు. షేర్లు సెప్టెంబర్ 24న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్ కానున్నాయి. పారామౌంట్ స్పెషాలిటీ ఫోర్జింగ్స్ ఇది సెప్టెంబర్ 17న తెరవబడి, సెప్టెంబర్ 19న ముగుస్తుంది. రూ. 32.34 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది.

ఈ కోసం ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 57-59. లాట్ పరిమాణం 2000 షేర్లు. ఇష్యూ ముగిసిన తర్వాత షేర్లు సెప్టెంబర్ 24నో లిస్ట్ చేయబడతాయి.

BikeWo GreenTech IPO: రూ. 24.09 కోట్ల ఈ ఇష్యూకి ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 59-62. లాట్ పరిమాణం 2000 షేర్లు. ఈ ఐపీఓ సెప్టెంబర్ 18న ప్రారంభమై, సెప్టెంబర్ 20న ముగుస్తుంది. షేర్ల లిస్టింగ్ సెప్టెంబర్ 25న జరుగుతుంది.

రిటైల్ లోగో ఐపీఓ: ఇది సెప్టెంబర్ 20న తెరవబడి, సెప్టెంబర్ 24న ముగుస్తుంది. సెప్టెంబర్ 27న ఎన్ఎస్ఈ ఎస్ఎంఈలో ఈ షేర్లు లిస్ట్ చేయబడతాయి. ఈ ఐపీఓ నుంచి రూ.64.98 కోట్లు సమీకరించే యోచనలో ఉంది.

ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 124-131. లాట్ పరిమాణం 1000 షేర్లు.సోధాని అకాడమీ ఆఫ్ ఫిన్‌టెక్ ఎనేబుల్స్, పాపులర్ ఫౌండేషన్స్, డెక్కన్ ట్రాన్స్‌కాన్ లీజింగ్, వెస్ట్రన్ క్యారియర్స్, పీఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్, ఎన్విరోటెక్ సిస్టమ్స్ ఐపీఓలు ఇప్పటికే మొదలుకాగా, వచ్చే వారం ముగియనున్నాయి. మరోవైపు బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ షేర్ల లిస్టింగ్ సెప్టెంబర్ 16న సోమవారం జరగనుంది.

## అరవింద్ కేజ్రీవాల్ వారసురాలు అతిషేనా..?



**న్యూఢిల్లీ- నవభూమి:** మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో అరెస్టయి బెయిల్‌పై విడుదలైన సీఎం అరవింద్ కేజ్రీవాల్.. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రెండు రోజుల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిని నిర్ణయిస్తామని ఆయన పేర్కొన్నారు. దీంతో అరవింద్ కేజ్రీవాల్ వారసులెవరనే ఓ చర్చ అయితే సర్వత్ర జరుగుతుంది. అరవింద్ కేజ్రీవాల్ వారసురాలు అతిషినే అని ఓ ప్రచారం అయితే సాగుతుంది. ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆమె పేరును అరవింద్ కేజ్రీవాల్ ప్రకటిస్తారనే చర్చ సైతం నడుస్తుంది. ఎందుకంటే..2013 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ గెలుపులో ఆమె కీలకంగా వ్యవహరించారు. అలాగే పార్టీ మేనిఫెస్టో రూపకల్పనలో అతిషి తనదైన ముద్ర వేశారు. దీంతో పార్టీలోనే కాదు.. ప్రభుత్వంలో సైతం అతిషి కీలకంగా వ్యవహరిస్తున్నారు. కేజ్రీవాల్ కేబినెట్‌లో అత్యధిక మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న ఒకే ఒక్క మంత్రి అతిషి. ఆమె అజమాయిషీలో 11 మంత్రిత్వ శాఖలు ఉన్నాయి. దీంతో పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు అత్యంత నమ్మకమైన వ్యక్తిగా అతిషి ఉన్నారని సుస్పష్టమవుతుంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ సీఎంగా అతిషిని ఎంపిక చేస్తారని ఊహాగానాలు ఊపందుకోన్నాయి.

**స్వాతంత్ర్య దినోత్సవ వేళ.. త్రివర్ణ పతాకం..**

ఇటీవల జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తాను జైల్లో ఉన్నానని.. ఈ నేపథ్యంలో త్రివర్ణ పతాకాన్ని అతిషి ఎగురవేస్తుందంటూ సీఎం కేజ్రీవాల్.. న్యూఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సెనాకు లేఖ సైతం రాసిన సంగతి తెలిసిందే. కానీ ఆ అవకాశాన్ని కేజ్రీవాల్ కేబినెట్లోని మరో మంత్రికి కల్పిస్తూ.. ఢిల్లీ ఎల్జీ నిర్ణయం తీసుకున్న విషయం విదితమే.కేజ్రీవాల్ రాజీనామా ప్రకటన అనంతరం స్పందించిన అతిషి..

కేజ్రీవాల్ రాజీనామా అనంతరం అతిషి స్పందిస్తూ.. బీజేపీపై ఆరోపణలు గుప్పించారు. బీజేపీ ఎన్నికలకు భయపడుతుందని విమర్శించారు. అందుకే ఆప్ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేస్తుందని మండిపడ్డారు. ఆప్ నేతలను అరెస్ట్ చేసిన కేసుల్లో ఒక్క ఆధారాన్ని సైతం బీజేపీ చూపించలేక పోయిందని గుర్తు చేశారు.అందుకే ఢిల్లీ ప్రజలు బీజేపీపై ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. ఇప్పటికిప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తే బీజేపీకి ఒక్క సీటు కూడా రాదన్నారు. ఢిల్లీ అసెంబ్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలు ఆమ్ ఆద్మీ పార్టీ ఖాతాలో పడతాయని స్పష్టం చేశారు. ఇక సీఎం కేజ్రీవాల్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జార?ండ్, మహారాష్ట్రతోపాటు నిర్వహించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

## హైతీలో భారీ అగ్ని ప్రమాదం.. ఇంధన ట్యాంకర్ పేలి 25 మంది దుర్మరణం



**న్యూఢిల్లీ- నవభూమి:** హైతీ దేశంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇంధన ట్యాంకర్ పేలడంతో 25 మంది మృతి చెందారు. మరో 40 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పెట్రోల్ ట్యాంకర్ అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో.. స్థానికులు పెద్ద సంఖ్యలో ఆ పెట్రలో కోసం ఎగబడ్డారు.దాంతో ఒక్కసారిగా పెట్రోల్‌కు మంటలు అంటుకుని పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దాంతో కొన్ని నిమిషాల్లోనే ఘోరం జరిగింది. కాగా హైతీ తాత్కాలిక ప్రధాని గ్యారీ కొనిల్ ఘటనా ప్రాంతాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు.

## దూసుకొస్తున్న భారీ గ్రహ శకలం.. 17న భూమికి చేరువగా '2024 ఆన్'



**న్యూఢిల్లీ- నవభూమి:** మానవాళిని ఓ భారీ గ్రహ శకలం (ఆస్టరాయిడ్) భయపెడుతున్నది. ఆకాశ హర్మ్యం అంత పరిమాణంలో ఉన్న ఈ గ్రహశకలం ఈ నెల 17న భూగోళాన్ని దాటుకుని వెళ్తుందని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' ప్రకటించింది. 721 నుంచి 1,575 అడుగుల (220-480 మీటర్ల) చుట్టుకొలతతో ఉన్న ఈ గ్రహశకలానికి '2024 ఆన్' అని నామకరణం చేశారు. ప్రస్తుతం ఈ ఆస్టరాయిడ్ గంటకు 19,842 మైళ్ల (31,933 కి.మీ.) వేగంతో ప్రయాణిస్తున్నదని, ఇది ధ్వని వేగం కంటే 26 రెట్లు అధికమని 'లైవ్ సైన్స్' వెల్లడించింది.

ఈ గ్రహ శకలం భూగోళానికి దాదాపు 62 వేల మైళ్ల (లక్ష కిలోమీటర్ల) చేరువగా రానున్నది. ఇది భూమికి, చంద్రునికి మధ్య ఉన్న సగటు దూరం కంటే 2.6 రెట్లు ఎక్కువ. ఈ ఆస్టరాయిడ్ భూమిని ఢీ కొనబోదని, మానవాళి భద్రతకు ఎలాంటి ముప్పు కలిగించబోదని శాస్త్రవేత్తలు తెలిపారు. నాసా నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం భూగోళానికి 12 కోట్ల మైళ్ల (19.3 కోట్ల కిలోమీటర్ల) చేరువగా వచ్చిన ఖగోళ వస్తువులను భూమికి సమీపంగా వచ్చిన వస్తువులుగా, 46.5 లక్షల మైళ్ల (75 లక్షల కిలోమీటర్ల) చేరువగా వచ్చే పెద్ద వస్తువులను ప్రమాదకరమైనవిగా పరిగణిస్తారు.

## కొత్త ప్రేమికుడ్ని పాత లవ్వర్‌తో పొడిపించింది!



**తిరుపతి- నవభూమి:** తిరుపతి పట్టణంలో చోటు చేసుకున్న ఒక పరిణామం షాకింగ్ గా మారింది. రీల్ సీన్ కు ఏ మాత్రం తీసిపోని ఈ రియల్ క్రైం సీన్ మీద బోలెడన్ని సందేహాలు.. అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకూ సదరు క్రైంకు కారణం ఏమిటన్నది ప్రశ్నగా మారింది. స్థానికంగా సంచలనంగా మారిన ఈ ఉదంతం మొత్తాన్ని ఒక వాక్యంలో చెప్పాలంటే.. కొత్త ప్రేమికుడ్ని పాత లవ్వర్ చేత కత్తితో పొడిపించిన ప్రేమికురాలి వ్యవహారం షాకింగ్ గా మారింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం చూస్తే.. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలానికి చెందిన లోకేశ్ తిరుపతిలో పారామెడికల్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన తన క్లాస్ మేట్‌తో ఇటీవల ప్రేమలో పడ్డాడు. శనివారం సినిమాకు వెళదామని లోకేశ్ కు చెప్పటంతో అతను ఓకే చెప్పాడు. సదరు గాళ్ ఫ్రెండే సినిమాకు టికెట్లను బుక్ చేసింది. హాస్టల్ నుంచి లోకేశ్ బైక్ మీద థియేటర్ కు రాగా.. ఆమె ఆటోలో వచ్చింది. ఇద్దరు తమ సీట్లలో కూర్చొని సినిమా చూస్తున్నారు. కాసేపటికి వారి ముందు సీట్లో కూర్చున్న తిరుపతి జిల్లాకు చెందిన కార్తీక్ కత్తితో లోకేశ్ కడుపులో పొడిచాడు. అనంతరం అతను.. లోకేశ్ గాళ్ ఫ్రెండ్ ఇద్దరు కలిసి థియేటర్ నుంచి వెళ్లిపోగా.. షాక్ కు గురైన లోకేశ్ వాష్ రూంకు వెళ్లి తనకు తగిలిన గాయాన్ని శుభ్రం చేసుకున్నాడు. కత్తిపోట్ల వ్యవహారాన్ని గుర్తించిన థియేటర్ సిబ్బంది సమాచారాన్ని పోలీసులకు అందించగా.. అతడ్ని రుయా ఆసుపత్రికి తరలించారు. కట్ చేస్తే.. తాను కింద పడ్డానని అందుకే గాయమైనట్లుగాతొలుత లోకేశ్ పేర్కొన్నాడు. అయితే.. పోలీసులు విచారించగా అసలు విషయాలు వెలుగు చూశాయి. లోకేశ్ గాళ్ ఫ్రెండ్, కార్తీక్ లు ఇద్దరూ ఐదేళ్లుగా ప్రేమలో ఉన్నారని.. ఇద్దరు బంధువులన్న విషయం బయటకు వచ్చింది. అయితే..కొంతకాలంగా తన క్లాస్ మేట్ లోకేశ్‌తో చనువుగా ఉంటోంది. అయితే.. ఇద్దరి బాయ్ ఫ్రెండ్ సమాచారాన్ని ఆమె షేర్ చేసేది. దీంతో.. వీరిద్దరి మధ్య కక్షల వరకు సీన్ వెళ్లింది. కార్తీక్ పదో తరగతి వరకు చదివి ప్రస్తుతం జులాయిగా తిరుగుతున్నాడు. మధ్యలో ఏమైందో ఏమో కానీ.. లోకేశ్ మీద కోపం పెంచుకున్న కార్తీక్.. థియేటర్ లో దాడికి ప్లాన్ చేశాడు. తాను చెప్పినట్లుగా చేయాలన్న ఒత్తిడితో.. ముగ్గురికి థియేటర్‌లో మూవీకి ప్లాన్ చేశారు. ముందుగాబుక్ చేసినట్లే.. వెనుక సీట్లో లోకేశ్.. అతని గాళ్ ఫ్రెండ్ కూర్చుంటే.. ముందు సీట్లో కార్తీక్ కూర్చున్నాడు. సినిమా మొదలైన కాసేపటికే.. తనతో తెచ్చుకున్న కత్తితో లోకేశ్ మీద దాడి చేశాడు. అతడి పొత్తికడుపులో పొడిచాడు. దాడి అనంతరం తన గాళ్ ఫ్రెండ్ ను తీసుకొని కార్తీక్ బైక్ మీద పారిపోయాడు. ఈ విచిత్రమైన క్రైం ఉదంతంపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

### తమిళనాడు ప్రజలకు రాముడు ఎవరో తెలియదు..

## గవర్నర్ సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ- నవభూమి:** గతేడాదే అయోధ్యలో రామమం దిరం నిర్మాణం పూర్తయి.. బాలరాముడు కొలువుదీరాడు. రాముడి గురించి దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. ఈ క్రమంలో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆ రాష్ట్ర ప్రజలు, రాముడి గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ హొదాలో ఆ వ్యాఖ్యలో చేయడంతో చర్చకు దారితీసింది. ఆయన ఎందుకు అలా మాట్లాడారా అని ఆరా తీస్తున్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాముడు ఉత్తరభారతానికే దేవుడు అన్న భావనను తమిళనాడు ప్రజల్లో కల్పించారంటూ అన్నారు. రాముడి గురించి తమిళనాడు ప్రజలకు పెద్దగా తెలియదంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో రాముడు తిరగని చోటు లేదని, కానీ.. ఇక్కడి వారికి రాముడంటే తెలియకుండా పోయిందని పేర్కొన్నారు. కేవలం ఉత్తర భారతానికి చెందిన దేవుడన్న భావనను తమిళనాడు ప్రజల్లో తీసుకొచ్చారని ఆరోపించారు. రాష్ట్ర యువతకు భారత సంస్కృతి తెలియకుండా సాంస్కృతిక హననం చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. అలాగే.. సనాతన ధర్మంపై సీఎం స్టాలిన్ తనయుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ గతంలో చేసిన వ్యాఖ్యలపైనా గవర్నర్ స్పందించారు. కొందరు గతంలో సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా వ్యాధులతో పోల్చారు. వారు అలా ఎందుకు మాట్లాడారో తెలియదని అన్నారు. ఇప్పుడు ఎందుకు మూగబోయరని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి గవర్నర్‌కు మధ్య అంతగా పొసగడం లేదు. ఇద్దరి మధ్య ఎప్పటి నుంచో విభేదాలు కొనసాగుతున్నాయి. సందర్భం వచ్చినప్పుడల్లా గవర్నర్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు కూడా.. ప్రభుత్వ స్కూళ్లపై ఆయన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందడం లేదని, విద్యార్థులు కనీసం రెండంకెల సంఖ్యను సైతం గుర్తించలేకపోతున్నారని ఆరోపించారు. అయితే గవర్నర్ వ్యాఖ్యలపై డీఎంకే నేతలు విమర్శలు చేస్తున్నారు. గవర్నర్ ద్వారా తమ ప్రభుత్వాన్ని నియంత్రించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు.

## భయంకర బాహుబలి గుండె పోటుతో మృతి



**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రపంచంలోని అత్యంత భారీ బాడీ బిల్డర్‌గా గుర్తింపు పొందిన ఇల్లియా 'గోలెమ్' యెఫించిక్ (36) గుండెపోటుతో మరణించారు. ఆయనను 'ది మ్యుటెంట్' అని ముద్దుగా పిలుస్తారు. 6 అడుగుల ఎత్తు, 340 పౌండ్ల బరువు గల ఆయన ప్రపంచంలో అత్యంత భయంకరమైన బాడీ బిల్డర్(బాహుబలుడి)గా పేరు సంపాదించినప్పటికీ ఎన్నడూ ఏ పోటీల్లోనూ పాల్గొనలేదు.

ఆయన సతీమణి అన్నా మాట్లాడుతూ.. ఈ నెల 6న ఆయన గుండె చాలా వేగంగా కొట్టుకుందని, అంబులెన్స్ వచ్చే లోపల ఆయన ఛాతీపై ఒత్తి, ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ మరణించారని చెప్పారు. యెఫించిక్ కండలు 25 అంగుళాల చుట్టుకొలత కలిగి ఉండేవి. ఆయన రోజుకు 16,500 క్యాలరీల ఆహారాన్ని తీసుకునేవారు.

# 'కూలీ' సెట్స్‌లో ఓనం సెలబ్రేషన్స్.. 'మనసిలాయో' పాటకు స్టెప్పులు వేసిన రజనీకాంత్

కేరళ ప్రజలు నేడు ఓనం పండుగను జరుపుకుంటున్న విషయం తెలిసిందే. మలయాళీ క్యాలెండర్‌లోని మొదటి నెలయిన చింగం మాసంలో ఓనమ్ పండుగా వస్తుంది. కేరళ సంస్కృతి సంప్రదాయాలకు, సొంత గ్రామాలపై మమకారానికి, వ్యవసాయానికి ముడిపడిన పండుగే ఓనమ్. ఈ పది రోజుల పండుగ 2024లో సెప్టెంబర్ 06న శుక్రవారం మొదలై.. ఆదివారంతో (సెప్టెంబర్ 15)తో ముగియనుంది. ఇక ఓనమ్ పండుగ సందర్భంగా.. కేరళలో ఇళ్ల ఎదుట పుష్పాల అలంకరణలు, కొత్త వస్త్రాలు, విందు భోజనాలతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటోంది.



అయితే సూపర్ స్టార్ రజనీకాంత్ తాజాగా ఓనం పండుగను జరుపుకున్నాడు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం కూలీ. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతుంది. అయితే ఈ సినిమా సెట్స్‌లో రజనీకాంత్ పంచెకట్టులో ఓనం వేడుకలు జరుపుకున్నాడు. అంతేగాకుండా తన రీసెంట్ సూపర్ హిట్ పాట మనసిలాయో పాటకు స్టెప్పులు కూడా వేశాడు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి.

నవచిత్ర



# కృతి శెట్టి.. ఎలా చేసినా లక్కు రాదే..



'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్ లోకి హీరోయిన్ గా అడుగుపెట్టిన అందాల భామ కృతి శెట్టి. మొదటి చిత్రంతోనే సూపర్ సక్సెస్ అందుకున్న కృతిశెట్టి తరువాత వరుసగా అవకాశాలు అందుకుంది. నానికి జోడీగా 'శ్యామ్ సింగరాయ్' చిత్రంలో నటించింది. ఆ మూవీ సక్సెస్ అయ్యింది. 'బంగార్రాజు' చిత్రంలో నాగ చైతన్యతో జతకట్టి హిట్ సొంతం చేసుకుంది. హ్యాట్రిక్ హిట్స్ తో కృతి శెట్టి టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ రేస్ లోకి వచ్చింది. తరువాత వరుసగా బ్యాక్ టూ బ్యాక్ మూవీస్ చేసింది. అలాగే కెరీర్ మొదలు పెట్టి రెండేళ్ళు కాకముందే కోటి రూపాయలుకు రెమ్యునరేషన్ డిమాండ్ చేసింది. అయితే 'బంగార్రాజు' తర్వాత కృతిశెట్టి చేసిన ఏ మూవీ కూడా హిట్ కాలేదు. దీంతో తెలుగులో క్రమంగా అవకాశాలు కూడా తగ్గిపోయాయి. రెమ్యునరేషన్ కూడా తగ్గించాల్సి వచ్చింది. ఆమె చివరిగా ఈ ఏడాది 'మనమే' సినిమాలో శర్వానంద్ కి జోడీగా నటించింది. ఈ సినిమాతో తెలుగులో బ్రేక్ వస్తుందని కృతిశెట్టి ఆశపడింది. అయితే ఈ సినిమా కూడా కమర్షియల్ ఫెయిల్యూర్‌గా మారింది. దీంతో కృతిశెట్టి మీద టాలీవుడ్‌లో ఐరన్ లెగ్ ఇమేజ్ పడిపోయిందనే మాట వినిపిస్తోంది. ప్రస్తుతం అయితే ఈ బ్యూటీ చేతిలో ఒక్క తెలుగు సినిమా కూడా లేదు. మలయాళంలో టోవినో థామస్ కి జోడీగా చేసిన 'అజాయంతే రందం మోషణం' మూవీలో కృతిశెట్టి నటించింది. ఈ సినిమా మలయాళీలో పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. పాన్ ఇండియా రేంజ్ లో ఈ సినిమాని రిలీజ్ చేశారు. అయితే తెలుగు నేటివిటీకి ఈ మూవీ కథ సింక్ కాలేదు. దీంతో తెలుగులో ఆశించిన స్థాయిలో ఆదరణ రాలేదు. ఈ మూవీ తెలుగులో సక్సెస్ అయితే మరల అవకాశాలు వస్తాయని కృతి శెట్టి భావించిన నిరాశే ఎదురైంది. ఫైట్ తప్పేలా లేదు ప్రస్తుతం కృతి శెట్టి తమిళంలో కార్తీకి జోడీగా 'వావాతియార్' సినిమాలో నటించింది. ఈ మూవీ రిలీజ్‌కి రెడీ అవుతోంది. తెలుగులో కూడా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చే ఛాన్స్ ఉంది. 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథ్‌కి జోడీగా 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే మూవీలో చేస్తోంది. విగ్నేష్ శివన్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇది కూడా తెలుగులో రిలీజ్ కానుంది. అలాగే జయం రవికి జోడీగా 'జెనీ' అనే చిత్రం చేస్తోంది. ఈ సినిమాలు హిట్ అయితే మరల తన ఫేట్ మారుతుందని కృతి శెట్టి భావిస్తోంది. ఈ సినిమాలు హిట్ అయితే తమిళంలో అయితే ఇమేజ్ పెరగడం గ్యారెంటీ. కానీ తెలుగులో ఏ మేరకు ఛాన్స్‌లు దక్కించుకుంటుందనేది వేచి చూడాలి.

# దేవరకు అనిరుధ్ వరల్డ్ క్లాస్ స్కోర్.. తారక్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



గ్లోబర్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం దేవర . కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నాడు. దేవర రెండు పార్టులుగా వస్తుండగా.. దేవర పార్టు 1 సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దేవర టీం ఇప్పటికే ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. ఇప్పటికే విడుదలైన దేవర సాంగ్స్, ట్రైలర్‌తో అనిరుధ్ బీజీఎం లెవల్స్ సినిమాను మరో లెవల్‌కు తీసుకెళ్లడం గ్యారంటీ అని చెప్పకనే చెబుతున్నాయి. తాజాగా తారక్ చేసిన కామెంట్స్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దేవర టీంతో చేసిన చిట్‌చాట్‌లో అనిరుధ్ కంపోజిషన్ గురించి చెప్పుకొచ్చాడు తారక్. అనిరుధ్ దేవర స్కోర్ హాలీవుడ్ స్థాయి కంటే ఏ మాత్రం తగ్గకుండా ఉంటుంది. దేవర స్కోర్ వరల్డ్ క్లాస్‌లో ఉంటుంది. అనిరుధ్ తప్పకుండా ఈ సినిమాతో హాలీవుడ్‌లో తన మార్క్‌ను చూపిస్తాడని.. ధీమా వ్యక్తం చేశాడు.

ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. సెన్సార్ బోర్డు దేవరకు యూ/ఏ సర్టిఫికెట్‌ను జారీ చేసింది. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైరగా నటిస్తున్నాడు. ఈ చిత్రంలో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దేవరను ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ట్రైలర్‌లో అసలెవరు వాళ్లంతా.. కులం లేదు.. మతం లేదు.. భయమే లేదు.. ధైర్యం తప్ప ఏమీ తెలియని కళ్లల్లో మొదటిసారి భయం పొరలు కమ్ముకున్నాయి..చాలా పెద్ద కథ సామి.. రక్తంతో సముద్రమే ఎరుపెక్కిన కథ.. మా దేవర కథ.. అంటూ సాగుతున్న డైలాగ్స్ దేవరపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి.



కృతి శెట్టి

# ఒక్కటైన మేఘా ఆకాశ్-సాయి విష్ణు.. వెడ్డింగ్ ఫొటోలు వైరల్



టాలీవుడ్ భామ మేఘా ఆకాశ్ ఆగస్టులో తన ప్రియుడు సాయి విష్ణుతో నిశ్చితార్థం పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. వెడ్డింగ్ గురించి ఎదురుచూస్తున్న అభిమానుల కోసం ఆసక్తికర వార్తను అందరితో పంచుకుంది మేఘా ఆకాశ్. సాయి విష్ణు- మేఘా ఆకాశ్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. సంప్రదాయబద్ధంగా ఈ ఇద్దరి వెడ్డింగ్ ఇవాళ చెన్నైలో జరిగింది. ఈ వేడుకకు కుటుంబసభ్యులు, సన్నిహితులు, పలువురు ఇండస్ట్రీ ప్రముఖులు హాజరై వధూవరులిద్దరినీ ఆశీర్వదించారు. సాయి విష్ణు పాపులర్ తమిళ పొలిటిషన్ తిరునవుకరసు కుమారుడు సాయి విష్ణు. ఈవెంట్‌కు ఎంకే స్టాలిన్, ఉదయనిధి, దురై మురుగన్‌తోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఆరేండ్లుగా ప్రేమలో ఉన్న మేఘా ఆకాశ్–సాయి విష్ణు ఫైనల్‌గా ఓ ఇంటివారు అయి కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో నూతన దంపతులకు అభిమానులు, నెటిజన్లు సోషల్‌మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మేఘా ఆకాశ్ ప్రస్తుతం వికటకవి, సహకుటుంబం సినిమాల్లో నటిస్తోంది. మరి వివాహం తర్వాత ప్రొఫెషనల్ లైఫ్‌ను కొనసాగిస్తుందా..? లేదా.,? అంటూ తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు.

# 'మత్తు వదలరా 2' సినిమాపై ప్రశంసలు కురిపించిన మహేశ్ బాబు



టాలీవుడ్ యువ నటులు శ్రీ సింహా, కమెడియన్ సత్య ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మత్తు వదలరా 2'. బ్లాక్ బస్టర్ మూవీ 'మత్తు వదలరా'(కు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రానికి రితేశ్ రానా దర్శకత్వం వహించాడు. జాతి రత్నాలు ఫేం ఫరియా అబ్దుల్లా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. సెప్టెంబర్ 13న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా చూసిన దిగ్గజ దర్శకుడు రాజమౌళితో పాటు, మెగాస్టార్ చిరంజీవి కూడా మూవీపై ప్రశంసలు కురిపించారు. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా చూసిన సూపర్ స్టార్ మహేశ్ బాబు మూవీపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. 'మత్తు వదలరా 2' సినిమా చూశాను. ఇది ఒక ఫన్ ఎంటర్‌టైనర్. చాలారోజులకు ఒక సినిమా మొత్తం ఎంజాయ్ చేస్తూ చూశాను. హీరో శ్రీ సింహాతో పాటు మిగతా నటీనటులంతా అద్భుతంగా నటించారు. వెన్నెల కిశోర్ నువ్వు స్క్రీన్ మీద కనిపించినంత సేపు నా కూతురు నవ్వు ఆపుకోలేకపోయింది. సత్య నువ్వు తెరపై కనిపించినప్పుడల్లా మేమంతా నవ్వకుండా ఉండలేకపోయాం. అద్భుతంగా నటించారు. టీమ్ మొత్తానికి అభినందనలు అంటూ మహేశ్ రాసుకొచ్చాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. బాబూమోహన్ (శ్రీసింహా), యేసు (సత్య).. ఇద్దరికీ డెలివరీ ఏజెంట్స్ ఉద్యోగాలు ఊడటంతో రోడ్డుమీద పడతారు. ఎన్నో అష్టకష్టాలకోర్చి మొత్తానికి హై ఎమర్జెన్సీ టీమ్‌లో స్పెషల్ ఏజెంట్స్‌గా ఉద్యోగాలు సంపాదిస్తారు. కిడ్నాపుల్ని ఛేదించడం, నిందితుల్ని పట్టుకోవడం వీళ్ల పని. ఆ పనిలో ఇద్దరూ పూర్తిగా ఆరితేరిపోతారు. జీతం డబ్బులతో బతకడం కష్టమై, అప్పుడప్పుడు చేతివాటం ప్రదర్శిస్తూ.. కొద్ది మొత్తంలో డబ్బుని కూడా తస్కరిస్తూ.. ఎవరికీ అనుమానం రాకుండా జాగ్రత్త పడుతుంటారు. కొన్ని రోజులకు వాళ్లు చేస్తున్న పనిపై వాళ్లకే చిరాకేస్తుంది. 'ఈ అరాకొరా ఆదాయంతో ఎన్నాళ్లు బతకడం.. కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలి' అని నిశ్చయించుకున్నారు. సరైన సమయంలో రెండుకోట్ల లావాదేవీలతో ముడిపడిన ఓ కిడ్నాప్ కేసు వీళ్ల దగ్గరకి వస్తుంది. ఆ కేసును అడ్డం పెట్టుకొని ఎలాగైనా ఆ రెండు కోట్లు కొట్టేయాలనే ప్లాన్‌తో రంగంలోకి దిగుతారు. అయితే.. ఆ కిడ్నాప్‌కి గురైన యువతి అనూహ్యంగా వీళ్ల కారులోనే శవమై కనిపిస్తుంది. ఈ దారుణం చేసిందే వీళ్లే అని రుజువు చేసేలా ఓ వీడియో కూడా బయటపడుతుంది. ఇంతకీ ఆ హత్య చేసింది ఎవరు? అసలు ఆ చనిపోయిన అమ్మాయి ఎవరు? ఈ కేసు నుంచి ఇద్దరూ ఎలా బయపడ్డారు? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.

# 'స్క్విడ్ గేమ్' వెబ్ సిరీస్ నా సినిమా కాపీ కొట్టి తీశారు.. కోర్టుకెక్కిన బాలీవుడ్ దర్శకుడు



ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'స్క్విడ్ గేమ్' తన సినిమాను చూసి కాపీ కొట్టి తీశారని బాలీవుడ్ దర్శకుడు కేసు వేశాడు. పాపులర్ కొరియన్ డ్రామా 'స్క్విడ్ గేమ్' ఎంత పెద్ద హిట్ అయిందో వేరే చెప్పాల్సిన పనిలేదు. ప్రపంచంలోని సగం కంటే ఎక్కువ ప్రేక్షకులు ఈ వెబ్ సిరీస్‌ను చూశారు. 2021 నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అయిన ఈ వెబ్ సిరీస్ చాలా పెద్ద హిట్టయింది. రిలీజ్ అయిన కేవలం 28 రోజుల్లో ఈ సిరీస్‌ను ప్రపంచ వ్యాప్తంగా 11 కోట్ల మంది నెట్‌ఫ్లిక్స్ యూజర్లు చూశారు. సిరీస్‌లో వయొలెన్స్ ఎక్కువ ఉన్నప్పటికీ ప్రేక్షకులకు బాగానే చేరువైంది. అయితే ఈ సిరీస్‌ను తన సినిమా లక్ మూవీని కాపీ కొట్టి తీశారంటూ బాలీవుడ్ దర్శకుడు సోహమ్ షా ఆరోపించాడు. అంతేగాకుండా ఇది కాపీరైట్ ఉల్లంఘన కిందకు వస్తుందంటూ న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టులో దావా వేశారు. అలాగే ఈ సిరీస్‌ను వెంటనే స్ట్రీమింగ్ నుంచి నెట్‌ఫ్లిక్స్ తొలగించాలని కోరారు. అయితే ఈ ఆరోపణలపై నెట్‌ఫ్లిక్స్ తాజాగా స్పందించింది. ఆ డైరెక్ట్ చేసింది కేవలం ఆరోపణలు మాత్రమేనని, అందులో ఎటువంటి నిజాలు లేవంటూ పేర్కొంది. ఈ కథను రాసింది దర్శకత్వం? వహించింది హ్వాంగ్ డాంగ్ హ్యుక్ మాత్రమేనంటూ ప్రకటన విడుదల చేసింది. బాలీవుడ్ నటులు సంజయ్ దత్, మిథున్ చక్రవర్తి, ఇమ్రాన్ ఖాన్ ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం లక్. ఈ సినిమాతోనే శృతి హాసన్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. మరోవైపు 'స్క్విడ్ గేమ్' సీజన్ 1 ఇప్పటికే రికార్డు వ్యూస్ సాధించగా.. తాజాగా సీజన్ 2 రాబోతుంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ ఏడాది డిసెంబర్ 26 నుంచి సీజన్ 2 ప్రసారం కానున్నట్లు మేకర్స్ రివీల్ చేశారు. అలాగే ఈ సిరీస్ ఫైనల్ సీజన్‌ను వచ్చే ఏడాది తీసుకురానున్నట్లు నెట్‌ఫ్లిక్స్ సంస్థ తాజాగా ఓ వీడియో ద్వారా ప్రకటించింది.

# క్రికెట్‌లో వివక్ష.. నాన్న ఇప్పటికీ కన్నీళ్లు పెట్టుకుంటాడు



**న్యూఢిల్లీ–నవభూమి:** ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మసాబా గుప్తా వెటరన్ క్రికెటర్ వివ్ రిచర్డ్స్‌కూతురు అని తెలిసిందే. బాలీవుడ్ సీనియర్ నటి నీనా గుప్తా( రిచర్డ్స్‌ల సంతానమైన మసాబా సమయం దొరికితే చాలు తండ్రి గురించి బోలెడు విషయాలు చెబుతుంది. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో రిచర్డ్స్ గొప్ప ఆటగాడు అయినప్పటికీ క్రికెట్‌లో ఎంతో వివక్షను ఎదుర్కొన్నాడని తెలిపింది. ఇప్పటికీ ఆ రోజులను గుర్తు చేసుకుంటూ ఆయన కంట తడి పెట్టుకుంటారని ఆమె చెప్పింది.

'మా నాన్న జాతివివక్షను ఎలా ఎదుర్కొన్నాడు? అనేది నాకు ఈమధ్యే తెలిసింది. ఈ రోజుకు కూడా నేను ఆ విషయం ప్రస్తావిస్తే ఆయన కండ్ల వెంట నీళ్లు వస్తాయి. రేసిజం బలంగా ఉన్న కాలంలో ఆయన క్రికెటర్‌గా ఎదిగారు. ఒంటిరంగు ఆధారంగా ప్రతిభను కొలిచే కాలంలో మా తండ్రి ప్రొఫెషనల్ క్రికెట్ ఆడడం మొదలెట్టాడు. నల్లజాతీయులపై వివక్ష ఇప్పటికీ ఉంది. ఆ రక్కసికి వ్యతిరేకంగా మనం పోరాటం చేసేంత వరకూ అది

# ఆరోజే క్రికెట్‌కు వీడ్కోలు.. హింట్ ఇచ్చేసిన అశ్విన్



**న్యూఢిల్లీ–నవభూమి:** భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మళ్లీ బంతితో మాయ చేసేందుకు సిద్ధమవుతున్నాడు. చెన్నైలో బంగ్లాదేశ్‌తో జరుగనున్న తొలి టెస్టు కోసం అశ్విన్ నెట్స్‌లో బౌలింగ్ సాధనలో మునిగిపోయాడు. సొంత మైదానంలో చెలరేగిపోవాలని భావిస్తున్న ఈ ఆఫ్ స్పిన్నర్ తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఇంకెన్ని రోజులు క్రికెట్ ఆడుతారు? మీ భవిష్యత్ ప్రణాళికలు ఏంటీ?' అనే ప్రశ్నలకు అశ్విన్ నిజాయతీగా సమాధానం చెప్పాడు. చెపాక్‌లో బంగ్లాదేశ్‌తో టెస్టు సన్నద్ధతలో ఉన్న అశ్విన్ యూట్యూబ్ చానెల్‌లో మాట్లాడాడు. ఈ సందర్భంగా అతడు తన మనసులో ఉన్నది ఉన్నట్టు చెప్పేశాడు. 'ఇప్పటికైతే క్రికెట్ నుంచి వైదొలగాలనే ఆలోచన నాకు ఏమాత్రం లేదు. ప్రస్తుతానికి నేను ఏరోజు కారోజు మీదనే దృష్టి పెడుతున్నా. ఎందుకంటే వయసు పెరిగే కొద్దీ ప్రతిరోజు అదనంగా శ్రమించాల్సి ఉంటుంది. గత 3 నుంచి 4 ఏండ్లలో నేను ఎంతో కష్టపడ్డాను.

నవక్రీడ

# టీ20లకు శుభ్‌మన్ గిల్ దూరం.. కారణమిదేనా?



**న్యూఢిల్లీ–నవభూమి:** భారత యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ టీ20 సిరీస్‌కు దూరం కానున్నాడు. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరుగనున్న పొట్టి సిరీస్‌కు గిల్ విశ్రాంతి తీసుకోనున్నాడు. అడడిపై పని భారత తగ్గించాలనే ఉద్దేశంతో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. టీమిండియా భావి కెప్టెన్‌గా పిలవబడుతున్న గిల్‌కు బ్రేక్ ఇవ్వడానికి కారణం ఉంది. అది ఏంటంటే..? బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల అనంతరం ఇరుజట్ల మధ్య పొట్టి సిరీస్ జరుగనుంది. అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 12 మధ్య మూడు వేదికల్లో మూడు టీ20 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. అయితే.. అక్టోబర్ 16వ తేదనే న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ మొదలవ్వనుంది. అందువల్ల గిల్‌పై పని ఒత్తిడి లేకుండా చూడాలని బీసీసీఐ భావించింది. బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌కు అతడికి విశ్రాంతి ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**